ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్ కార్యకలాపాలు

**ANDHRA PRADESH**
**LEGISLATIVE COUNCIL DEBATES**

అధికార నివేదిక

# OFFICIAL REPORT

శనివారం, డిసెంబరు 19, 2015,

ఇరవై అయిదవ సమావేశం, సంపుటం–1, నంబరు–3,

**SATURDAY, THE 19TH DAY OF DECEMBER, 2015,**

**TWENTY FIFTH SESSION, VOLUME - 1, NO.3**

*****

శాసన పరిషత్తు సచివాలయము,
పబ్లిక్ గార్డెన్స్,
హైదరాబాద్ – 500 004.

**LEGISLATURE SECRETARIAT,**
**PUBLIC GARDENS,**
**HYDERABAD - 500 004.**

# ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్తు
## ప్రధాన అధికారులు

| | | |
|---|---|---|
| **ఛైర్మన్** | : | డా. ఎ. చక్రపాణి |
| **కార్యదర్శి (ఇన్‌ఛార్జ్)** | : | శ్రీ కె. సత్యనారాయణరావు |
| **ఉప కార్యదర్శులు** | : | శ్రీ పి. బాలకృష్ణమాచార్యులు<br>శ్రీ ఎమ్. విజయరాజు |
| **సహాయ కార్యదర్శులు** | : | శ్రీ పి.వి. సుబ్బారెడ్డి<br>శ్రీ కె. రాజ్‌కుమార్<br>శ్రీమతి ఆర్. వనితారాణి<br>శ్రీ పి. నరసింహ<br>శ్రీ బి. కమలాకర్<br>డా. వై. కామేశ్వరి<br>శ్రీ ఇ. సంజీవరావు<br>శ్రీ కె. వెంకటేశ్వరరావు<br>శ్రీ డి. జగన్‌మోహన్‌రావు<br>శ్రీ బి. ప్రభాకర్‌రావు |
| **చీఫ్ రిపోర్టర్** | : | శ్రీ ఆర్. శ్రీనివాసరావు |

* * * * *

## ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్తు కార్యకలాపములు

**శనివారం, డిసెంబరు 19, 2015.**

# అధికార నివేదిక

---


విషయ సూచిక

---

(1) సభా కార్యక్రమం –వాయిదా తీర్మానం

(2) ప్రశ్నోత్తరాలు

(3) ప్రత్యేక ప్రస్తావనలు

(4) అర్జీ సమర్పణ

(5) సభా సమక్షంలో ఉంచే పత్రాలు

(6) మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి శ్రీమతి పీతల సుజాత, డా. బి.ఆర్. అంబేద్కర్ 125వ వార్షికోత్సవంపై ప్రకటన కొనసాగింపు.


----

# ANDHRA PRADESH LEGISLATIVE COUNCIL
# SATURDAY, THE 19TH DECEMBER, 2015

(THE HOUSE ASSEMBLED AT 10.00 A.M.)
(THE HON'BLE CHAIRMAN IN THE CHAIR)

* * *

## (1)సభా కార్యక్రమం –వాయిదా తీర్మానం :

MR. CHAIRMAN: Today, I have received one Adjournment Motion Notice.

The Adjournment Motion given notice of by Sri Yandapalli Srinivasulu Reddy and Sri Boddu Nageswara Rao, with regard to the Regularization of Contract and Outsourcing Employees working in various Departments in the State, has been disallowed.

శ్రీ యండపల్లి శ్రీనివాసులు రెడ్డి (పట్టభద్రుల నియోజకవర్గం, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు): అధ్యక్షా, దయచేసి allow చేయండి. కాంట్రాక్ట్ మరియు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు మద్దతుగా జిల్లా వ్యాప్తంగా, రాష్ట్రవ్యాప్తంగా నిరాహార దీక్షలు జరుగుతున్నాయి. 2002 వ సంవత్సరం నుండి 13 జిల్లాలలో లెక్కవేస్తే 2.5 లక్షల మంది కాంట్రాక్టు మరియు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నారు. 13,500 మంది కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామని రాష్ట్రప్రభుత్వం లెక్కలలో చూపించింది. కానీ, అది వాస్తవం కాదు. ఔట్‌సోర్సింగ్ వారిని కూడా తెలుగుదేశం ఎన్నికల మ్యానిఫెస్టో ప్రకారం అంచెలంచెలుగా క్రమబద్ధీకరిస్తామని పూర్తిస్థాయి వాగ్దానం చేశారు. ఖాళీ పోస్టులను భర్తీ చేయడం కోసం 13,500 మందిని అంచెలంచెలుగా భర్తీ చేస్తామన్నారు. ఇంతవరకూ అటువంటివి జరగలేదు. రెండవ విషయమేమంటే, కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు జీ.ఓ.ఎం.ఎస్. 3 ప్రకారం కనీస వేతనాలు ఇచ్చే ప్రక్రియ పూర్తి స్థాయిలో జరగాలని కోరుతున్నాను. దిగువ స్థాయి ఉద్యోగులకు కనీస వేతనం రూ.13,370 ఉండడాన్ని కూడా ఇంతవరకూ పరిగణనలోకి తీసుకోలేదు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ద్వారా వివిధ స్థాయిలలో పనిచేస్తున్న వారికి న్యాయం చేయాలని కోరుతున్నాను. 2002వ సంవత్సరంలో మొట్టమొదటిసారిగా తెలుగుదేశం ప్రభుత్వం హయాంలోనే మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్‌మెంట్‌లో ఈ విధానం ప్రారంభమయింది. ఉమ్మడి రాష్ట్రంలో 3లక్షల 40వేలమందిని తీసుకోవడం జరిగింది. కాబట్టి ఇది న్యాయమైన సమస్య. ఏళ్ల తరబడి వారు ఈ ఉద్యోగాలను నమ్ముకొని పనిచేస్తున్నారు. వారిని క్రమబద్ధీకరణ చేయాలని, పదవ పిఆర్‌సి ప్రకారం కనీస వేతనాలు, బేసిక్ పే ఇవ్వడం మరియు డి.ఎ. ఇవ్వడాన్ని పరిగణనలోకి తీసుకోవాలని ఈ అంశాన్ని సభలో చర్చించాలని తమరిని కోరుతున్నాను.

MR. CHIARMAN: I have disallowed the Adjournment Motion notice.

శ్రీ బొడ్డు నాగేశ్వర రావు (పట్టభద్రుల నియోజకవర్గం, కృష్ణా, గుంటూరు): అధ్యక్షా, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయడంపై మంత్రివర్గ ఉపసంఘాన్ని కూడా ఏర్పాటు చేశారు. దానిమీద ఏ నిర్ణయం తీసుకున్నారు, ఎప్పటిలోగా చేస్తారో చెప్పవలసిందిగా గౌరవ మంత్రిగారిని తమద్వారా కోరుతున్నాను. వారు కూడా

మంత్రివర్గ ఉపసంఘంలో ఉన్నారు. అలాగే 9 వ పిఆర్‌సిలో జీ.ఓ.ఎం.ఎస్. నెం. 3 ద్వారా కనీస వేతనాలను ఇవ్వడం జరిగింది. అలాగే, 10వ పిఆర్‌సిలో కూడా కనీస వేతనాలను ఈ ఉద్యోగులకు అమలయ్యేలా చూడాలని మీ ద్వారా మంత్రిగారి దృష్టికి తీసుకువస్తున్నాను. వీటిపై మంత్రిగారి ద్వారా సమాచారాన్ని ఇప్పించాలని కోరుతున్నాను.

శ్రీ రాము సూర్యారావు (ఉపాధ్యాయ నియోజకవర్గం, తూర్పు, పశ్చిమగోదావరి): గౌరవ సభ్యులు శ్రీ వై. శ్రీనివాసులు రెడ్డి, శ్రీ బొడ్డు నాగేశ్వర రావు గార్లు చెప్పిన విషయాలనే నేను కూడా సభ దృష్టికి తీసుకువస్తున్నాను.

శ్రీ పి.జె. చంద్రశేఖర రావు (శాసనసభ నియోజకవర్గం): సార్, లక్షలమంది కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల విషయంలో ప్రభుత్వం తమ దగ్గర ఉన్న లెక్కల ప్రకారం సుమారు 13,000 మంది మాత్రమే ఉన్నారని తెలిపింది. ఈ 13,000 మంది ఉన్నారనే నిర్ధారణకు రావడానికి గల ప్రాతిపదికలేమిటి అనే విషయంపై ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరిస్తున్నది. రెండవ అంశం, ఆ కమిటీ వారు సమావేశాలు పెట్టి ఆయా ఉద్యోగ సంఘాల వారితో చర్చించి ఆ ఉద్యోగులను అంచెలంచెలుగా రెగ్యులరైజ్ చేసేందుకు గల కార్యక్రమాన్ని ఏకపక్షంగా ప్రకటించింది. ఆ ఏకపక్షంగా ప్రకటించిన అంశాన్ని కూడా కోల్డ్ స్టోరేజ్‌లో పెట్టారు. కోల్డ్ స్టోరేజీలో పెట్టిన దానిని బయటకు తీసి ఎప్పుడు అమలు చేస్తారా అని అందరూ ఎదురుచూస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు కోల్డ్ స్టోరేజీలో పెట్టిన దానిని బయట పెట్టి వారిని రెగ్యులరైజ్ చేయమని కోరుతున్నాను. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం ఈ మధ్యనే 7వ వేతన కమీషన్ వేసినప్పుడు వాళ్లు కనీస వేతనం రూ.18,000 గా చేయడం జరిగింది. కాబట్టి, దాని ప్రకారం ఒక జీ.ఓ. తీసుకురావలసిన అవసరం ఉన్నది. 9వ వేతన సంఘంలో ఇచ్చినటువంటి కనీస వేతనాన్ని ప్రాతిపదికగా తీసుకుని అప్పట్లో జి.ఓ.ఎం.ఎస్. నెం. 3 ప్రకారంగా కనీస వేతనాన్ని రూ.6,700గా నిర్ణయించడమయింది. ఇదే పద్ధతిలో రూ.13,472లు డి.ఎ.తో లింకప్ చేసి ఆ తేదీనుండి అమలు చేయవలసిన బాధ్యత ప్రభుత్వం మీద ఉన్నది. అసలు ఏ విషయంలో కూడా ప్రభుత్వం 'కిం' అనకుండా ఉండడం అన్యాయం. ప్రభుత్వ ఉద్యోగుల బదులుగా పనిచేస్తూ, వారికంటే ఎక్కువగా పనిచేస్తున్నటువంటి కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికుల ఎడల నిర్లక్ష్యాన్ని, నిర్దయను వీడి ఈ సభలో ప్రభుత్వం ప్రకటన చేయాలని తమద్వారా విజ్ఞప్తి చేస్తున్నాను.

శ్రీ యండపల్లి శ్రీనివాసులు రెడ్డి : దీనిపై మంత్రిగారిని స్పందించాలని కోరుతున్నాను. వారు మంత్రివర్గ ఉపసంఘంలో ఉన్నారు.

ఉ. 10.10

మిస్టర్ ఛైర్మన్: మంత్రిగారూ, ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని వారు అంటున్నారు. ఏదైనా జవాబు ఉన్నదా?

డా. పల్లె రఘునాథరెడ్డి: అధ్యక్షా, సభ్యులు చెప్పిన విషయాలను నోట్ చేసుకున్నాను. కాంట్రాక్టు ఉద్యోగులను యథావిధిగా రెగ్యులరైజ్ చేయకుండా ఏదైనా వ్రాత

పరీక్ష  లేదా మౌఖిక పరీక్షను నిర్వహించి, ఏదో ఒక పద్ధతి ద్వారా ఆ పోస్టులను భర్తీచేయాలని సుప్రీంకోర్టు ఒక తీర్పునిచ్చింది. Still the discussions are going on. అవి పూర్తయిన తర్వాత ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది.

శ్రీ ఉమ్మారెడ్డి వేంకటేశ్వర్లు (స్థానిక సంస్థలు, గుంటూరు): అధ్యక్షా, పనిచేసే ప్రతి ఉద్యోగికి  కనీస వేతనాలైనా ఇవ్వాలని ఒక చట్టం కూడా ఉంది. ఔట్‌సోర్సింగు ద్వారా పనిచేసే వారికి కనీస వేతనాలు కూడా లేవు.  It amounts to exploitation.  దయచేసి దానిని పరిశీలించవలసిందిగా నేను తమరిద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

శ్రీ పి.జె.చంద్రశేఖర రావు:  అధ్యక్షా, కనీస వేతనం విషయంలో గౌరవ మంత్రివర్యులు సుప్రీంకోర్టు గురించి ప్రస్తావించారు. కనీసవేతనాలు ఇవ్వలేని సంస్థకు existenceలో ఉండడానికి అవకాశం లేదని చెప్పి ఇచ్చిన సీరియస్ జడ్జిమెంట్‌ను పక్కన పెట్టి ఆ ఉద్యోగులకు కనీస వేతనం కూడా ఇవ్వకుండా రెగ్యులరైజేషన్‌ను abeyanceలో పెట్టి ఎలా చేస్తారు?

శ్రీ విటపు బాలసుబ్రహ్మణ్యం (ఉపాధ్యాయ నియోజకవర్గం, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు):  (మైకు లేకుండా) అధ్యక్షా, మేనిఫెస్టోలో  తెలుగుదేశం పార్టీ కాంట్రాక్టు మరియు ఔట్‌సోర్సింగు ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామని చెప్పిందా, లేదా?

డా. పల్లె రఘునాథరెడ్డి:  అధ్యక్షా, రెగ్యులరైజేషన్ చేయడం కోసం ప్రభుత్వం ఆలోచన చేస్తూ ఉంది.  వేరే విధంగా లేదు. అది ఇంకా  కమిటీ పరిశీలనలో ఉంది కాబట్టి ఇంకా ఆ అంశం ప్రాసెస్‌లో ఉంది.  ఈ రాష్ట్రప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగుల పట్ల  చాలా సానుభూతితో మరియు  సానుకూలంగా ఉంది. రూ. 16 వేల కోట్ల లోటుబడ్జెట్ ఉన్నప్పటికీ, రూ. 9,750 కోట్లు భారం పడుతుందని తెలిసినప్పటికీ  ఈ రాష్ట్రంలో ఉద్యోగులు బాగుంటే రాష్ట్రం బాగుంటుందనే సదుద్దేశంతో 43 శాతం ఫిట్‌మెంట్‌ను ఇచ్చిన ప్రభుత్వాన్ని వారు నిజంగా అభినందించాలి. దశల వారీగా ప్రభుత్వంలో పనిచేస్తోన్న ఉద్యోగులకు తగిన న్యాయం చేయడానికి ఈ రాష్ట్రప్రభుత్వం సంసిద్ధంగా ఉందని నేను తమరిద్వారా వారికి  తెలియజేస్తున్నాను.

శ్రీ యండపల్లి శ్రీనివాసులు రెడ్డి:  (మైకు లేకుండా) అధ్యక్షా, ప్రభుత్వ ఉద్యోగులకు మంచి ఫిట్‌మెంట్ ఇచ్చినందుకు తమరిద్వారా  మంత్రిగారికి ధన్యవాదాలను తెలియజేస్తున్నాను. ఇప్పుడు  ఔట్‌సోర్సింగు  మరియు కాంట్రాక్టు ఉద్యోగులకు కూడా మంచి వేతనాలను ఇవ్వవలసిందింగా నేను తమరిద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

MR. CHAIRMAN:  Srinivasulu Reddy garu, you can't expect everything on the Floor of the House. The Minister has also said that they are examining all the aspects of the issue and the Committee will do it.  It is an important issue. I have said that the Adjournment Motion is disallowed. The Minister is also very liberal in this aspect and it is his job.

## (2) ప్రశ్నోత్తరాలు :

### ఆదర్శ పాఠశాలలు, ఉన్నత పాఠశాలలకు వంటగదులు

ప్రశ్న నెం. 8761 (21)
శ్రీమతి పి.శమంతకమణి, ఎం.ఎల్.సి.,

గౌరవనీయులైన మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా?

అ) అనేక ఆదర్శ పాఠశాలలు, ఉన్నత పాఠశాలలకు వంటగదులు లేవన్న విషయం వాస్తవమేనా;
ఆ) అయితే, ఈ విషయంలో తీసుకున్న చర్య ఏమిటి?

గౌరవ మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి తరఫున సమాచార మరియు పౌర సంబంధాల శాఖ మంత్రి (డా. పల్లె రఘునాథరెడ్డి)

అ) లేదండీ.
చాలావరకు ఉన్నత పాఠశాలలకు వంటగది షెడ్లు ఉన్నాయి. వంటగది షెడ్లు లభ్యంగా లేని మిగిలిన ఉన్నత పాఠశాలలు, ఆదర్శ పాఠశాలలకు వంటగది షెడ్లను సమకూర్చడమవుతున్నది.

ఆ) 2 వ దశ క్రింద కేంద్రప్రభుత్వం 13,103 వంటగది షెడ్లను మంజూరు చేసింది. వాటిలో ఉన్నత పాఠశాలలకు 3237, ఆదర్శ పాఠశాలలకు 74 వంటగది షెడ్లను కేటాయించడమయింది. ఉన్నత పాఠశాలలకు మంజూరుచేసిన 3237 వంటగది షెడ్లలో 1709 పూర్తి అయ్యాయి. ఆదర్శ పాఠశాలలకు మంజూరుచేసిన 74 వంటగది షెడ్లలో 20 పూర్తి అయ్యాయి. మిగిలినవి నిర్మాణంలో ఉన్నాయి.

శ్రీమతి పమిడి శమంతకమణి (శాసనసభ నియోజకవర్గం): అధ్యక్షా, విద్యకు, వైద్యానికి అధిక ప్రాధాన్యతను ఇస్తున్నామని మన ప్రభుత్వాలు చెబుతున్నాయి. ఎక్కడైతే పేద పిల్లలున్నారో వారికి విద్యాబుద్ధులు నేర్పించడానికి ఆదర్శ పాఠశాలలను గత ప్రభుత్వం ఏర్పాటుచేయడం జరిగింది. దానిని మేము అభినందిస్తున్నాము. కోట్ల రూపాయలు ఖర్చుచేసి ఉన్నతపాఠశాలలను నిర్మించారు కానీ, ఏ పాఠశాలలో కూడా వంటగది నిర్మాణం చేయలేదు. అనంతపురం, కర్నూలు, విశాఖపట్నం, ప్రకాశం, విజయనగరం జిల్లాల్లో సుమారు 70 శాతం పాఠశాలల్లో వంటగదుల నిర్మాణం చేయలేదు. ముఖ్యంగా, మంత్రిగారు అనంతపురం జిల్లాకు చెందిన వారు కాబట్టి నేను చెబుతున్నాను, అనంతపురం జిల్లాలో 25 ఆదర్శ పాఠశాలలు ఉన్నాయి. ఆ 25 ఆదర్శ పాఠశాలల్లో ఎక్కడా కూడా

వంటగదులు లేవు. అక్కడ వంటగదులు ఏవిధంగా ఉన్నాయంటే, కాంపౌండ్ వాల్‌కు ఒక రేకు వేసి ఆ రేకు కింద ఆదర్శ పాఠశాలలో వంటగదిని ఏర్పాటుచేయడం జరిగింది. ఉన్నతపాఠశాలలో అయితే, నేటికీ చెట్ల కిందనే వంట చేస్తున్నారు. నేను ఒక మహిళ కాబట్టి చెబుతున్నాను. చెట్ల కింద వంట చేసినపుడు ఆ వేడికి ఆ చెట్లపై ఉన్న క్రిమికీటకాదులన్నీ కిందకు పడిపోయి ఆ భోజనమంతా విషపూరితంగా మారడం జరుగుతోంది. మధ్యాహ్న భోజనం తిని 30 మంది లేదా 60 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైనారని చాలా వార్తాపత్రికలలో మనం చూస్తూ ఉన్నాము. పాఠశాలకు విద్యార్థి విద్యను అభ్యసించడం కోసం ఉదయాన్నే వచ్చి, మధ్యాహ్నం అక్కడే భోజనం చేసి తిరిగి పాఠశాలకు వెళ్లి సాయంత్రం ఆ విద్యార్థి ఇంటికి వెళ్లడం జరుగుతోంది. మధ్యాహ్నం పూట భోజనం అపరిశుద్ధంగా తయారైతే ఆ విద్యార్థి ఆరోగ్యం దెబ్బతినే ప్రమాదముంది. అనంతపురం జిల్లా కలెక్టరు గారు కూడా ఈ విషయంలో సంబంధిత ముఖ్యకార్యదర్శికి లెటర్‌ను రాయడం జరిగింది. రూ.9.50 కోట్లు ఖర్చుచేస్తే అనంతపురం జిల్లాలో ఉన్న ఆ 25 పాఠశాలలకు వంటగదులను ఏర్పాటుచేస్తామని చెప్పడం జరిగింది. ఎక్కడా కూడా ఆ వంటగదుల నిర్మాణం మొదలుకాలేదు. నేటికీ కూడా విద్యార్థులకు ఆహారాన్ని ఆదర్శపాఠశాలల్లో షెడ్ల కిందనే, ఉన్నతపాఠశాలల్లో చెట్లకిందనే తయారుచేయడం జరుగుతోంది. ఆదర్శపాఠశాలల్లో పిల్లలు నాణ్యమైన విద్యను నేర్చుకుంటారనే ఒక ఆశతో తల్లిదండ్రులు వారిని ఆ పాఠశాలలకు పంపించడం జరుగుతోంది. ఆ పిల్లల ఆరోగ్యం దెబ్బతినకుండా చూడవలసిన బాధ్యత కూడా ప్రభుత్వంపై ఉందని దీనిపై తగిన శ్రద్ధ తీసుకోవాలని నేను తమరిద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

డా. ఎం.వి.ఎస్.ఎస్.మూర్తి (స్థానిక సంస్థలు, విశాఖపట్నం): అధ్యక్షా, చాలా పాఠశాలల్లో నేడు వంటగదులు ఒక్కటే సమస్య కాదు. మరుగుదొడ్లలో రన్నింగ్ వాటర్ లేకపోవడం కూడా చాలా పెద్ద సమస్య. ఒకసారి మరుగుదొడ్లకు పిల్లలు వెళితే వారు వెంటనే పారిపోవలసిందే తప్ప వాటిని ఉపయోగించలేకపోతున్నారు. రన్నింగ్ వాటర్‌ను ప్రొవైడ్ చేయకుండా శానిటరీ కండిషన్స్ ఇంప్రూవ్ కాకుండా పిల్లలకు చదువుచెప్పడం చాలా ఇబ్బందిగా ఉంది. విజయనగరం మరియు విశాఖపట్నం జిల్లాల్లో ఈవిధంగా ఉండడం నేను స్వయంగా చూడడం జరిగింది. మిగిలిన జిల్లాల్లో కూడా ఇటువంటి పరిస్థితులు ఉండవచ్చు. అన్ని పాఠశాలల్లో మరుగుదొడ్లను నిర్మించామని అంటున్నారు కానీ, చాలా పాఠశాలల్లో మరుగుదొడ్లు కూడా లేవు. మరుగుదొడ్లు లేని పాఠశాలల్లో వెంటనే వాటిని నిర్మించి, మరుగుదొడ్లకు మరియు వంటగదులకు కూడా వెంటనే రన్నింగ్ వాటర్‌ను సమకూర్చవలసిన ప్రాధాన్యతను ప్రభుత్వం గుర్తించాలని నేను తమరిద్వారా ప్రభుత్వానికి విజ్ఞప్తిచేస్తున్నాను.

మిస్టర్ ఛైర్మన్: మంత్రిగారూ, కొంచెం నోట్ చేసుకోండి. అందరూ ఈ అంశం గురించి అడుగుతున్నారు.

ఉ. 10.20

శ్రీ మెట్టు గోవిందరెడ్డి (స్థానిక సంస్థలు, అనంతపూర్): అధ్యక్షా, మధ్యాహ్న భోజన పథకాన్ని సరిగా నిర్వహించకపోవడంవల్ల డ్రాపవుట్స్ ఎక్కువగా జరుగుతున్నాయని ఈరోజు ఈనాడు దినపత్రికలో కూడా వచ్చింది. నిత్యావసర సరుకులు, కూరగాయల ధరలు బాగా పెరగడంవల్ల కూడా మధ్యాహ్న భోజనం అందించేవారు పౌష్టికాహారాన్ని సరిగా ఇవ్వలేకపోతున్నారు. అలాగే వాళ్ళకి ఆరు నెలలకు ఒకసారి పేమెంట్స్ ఇవ్వడంవల్ల అప్పులు చేయాల్సి వస్తోంది. ఆదాయం లేకపోతే ఆటోమేటిక్‌గా పప్పులు, కాయగూరల పరిమాణం తగ్గిపోతోంది. ప్రభుత్వ పాఠశాలలకు వెళ్ళే విద్యార్థుల్లో బడుగు, బలహీనవర్గాలవారు ఎక్కువగా ఉంటారు కాబట్టి వాళ్ళందరికీ మంచి భోజనమందిస్తే వాళ్ళు బాగా చదువుకుంటారనేది ప్రభుత్వ ఉద్దేశం. కానీ అది నెరవేరడం లేదు.

అదేవిధంగా టాయిలెట్స్‌లో నిరంతరమూ నీళ్ళు ఉండడంలేదు. టాయిలెట్స్ కడుతున్నా వాటిని సరిగా మెయింటెయిన్ చేయడంలేదు. వంటశాలలు కూడా సక్రమంగా లేదు. చిన్న గది కట్టి వంటచేయమంటారు. ఆ గదిలోకి ఎవరూ వెళ్ళలేరు. ఏదో తూ తూ మంత్రంగా కాకుండా ఒక పది సంవత్సరాలు ఉండే విధంగా వంటగది కట్టాల్సి ఉంది. ఏది చేసినా రాష్ట్రంలో ఉండే బడుగు, బలహీనవర్గాలకు ఉపయోగపడే విధంగా చేయాలని కోరుకుంటున్నాను.

శ్రీ వెంకట సతీష్‌కుమార్ రెడ్డి సింగారెడ్డి (శాసనసభ నియోజకవర్గం): అధ్యక్షా, ఆర్. వి.యస్.యం. కార్యక్రమం ద్వారా చాలా పాఠశాలలకు భవనాలు నిర్మించారు. కానీ ఇంతవరకూ పేమెంట్ చేయని కారణంగా అవన్నీ కూడా ఆగిపోయాయి. వాటికి పేమెంట్స్ ఏమైనా ఇచ్చే అవకాశాలున్నాయా? ఈ విషయమై ఎందుకు జాప్యం జరుగుతుందో తెలియజేయమని మీద్వారా మంత్రిగారిని కోరుతున్నాము.

డా.బచల పుల్లయ్య (ఉపాధ్యాయ నియోజకవర్గం, కడప, అనంతపూర్, కర్నూలు): అధ్యక్షా, ప్రభుత్వం చాలా మంచి ఉద్దేశంతో బీదపిల్లలకు విద్యనందించాలనే అభిప్రాయంతో ఆదర్శపాఠశాలలను ఏర్పాటు చేసినా, వాటిలో సౌకర్యాల కొరత ఎక్కువగా ఉంది.

మిస్టర్ ఛైర్మన్: పుల్లయ్యగారూ, మీరు ప్రిన్సిపాల్‌గా చేశారు. సప్లిమెంటరీ వేయండి.

డా.బచల పుల్లయ్య: ఈ మధ్య నేను అనంతపురం జిల్లా ధర్మవరంలోని ఒక ఆదర్శ పాఠశాలకు వెళ్ళినప్పుడు అక్కడి అమ్మాయిల బాతూరూమ్‌కు తలుపులు లేకపోవడంవల్ల వారు ఇబ్బంది పడుతుండడాన్ని చూశాను. ఆదర్శపాఠశాలలంటే ఆదర్శంగా ఉండాలి. ఆదర్శపాఠశాలల్లో మంచి టాయిలెట్స్ ఉండేవిధంగా, వాటికి తలుపులు ఉండేవిధంగా చూడాలని మీద్వారా మంత్రిగారిని కోరుతున్నాను. అదేవిధంగా ఆదర్శ పాఠశాలల్లో హాస్టల్స్ ఏర్పాటు చేశారు. వాటిని ఈ విద్యా సంవత్సరం ప్రారంభంలోనే చేయాల్సి ఉంది. కానీ, ఇప్పటివరకూ వాటిని ప్రారంభించిన దాఖలాలు లేవు. ఎప్పుడు ప్రారంభిస్తారో తెలియజేయమని మీద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ విటపు బాలసుబ్రహ్మణ్యం: మీరు కట్టిన వంటగదులలో ప్రస్తుతం ఎన్నింటిలో వంట చేస్తున్నారు? నిజంగా అక్కడ వంట చేయడం జరుగుతోందా? ఎందుకంటే రూ.60వేలు, రూ.70వేలు ఇచ్చి వంటగదులు కట్టమంటే ఇప్పుడున్న ధరలలో ఇప్పుడున్న కాంట్రాక్టర్లు ఎంత మేరకు వంటగది షెడ్డును కడతారు. అలా కట్టినా అందులో వంట చేయడం సాధ్యమవుతుందా? అసలు ఈ మొత్తం ప్రాజెక్టే అర్థంలేని ప్రాజెక్టుగా మారింది. ప్రకాశంజిల్లాలో ఈ సమస్య ఉత్పన్నమైనప్పుడు మొత్తం నా సి.డి.పి ఫండ్స్‌ను అంతా వంటగది షెడ్స్‌కు మ్యాచింగ్ గ్రాంట్‌గా ఇవ్వడమేగాకుండా, అదనంగా ఒక యాభైవేల రూపాయల వంతున ఇచ్చాను. అక్కడ ఆ రెండు నిధులను కలిపి కట్టుకున్న చోట మంచి నిర్మాణాలు జరిగాయి. మిగిలినచోట్ల ఇప్పటివరకూ కట్టినవి ఏవీ కూడా ఉపయోగంలో లేవు. సామాన్లు ఆ గదులలో పెట్టుకోవడానికికానీ, ఇతరత్రా ఉపయోగించుకోవడానికి తప్ప అందులో వంటచేస్తే వంటమనిషి మళ్ళీ బయటకు వస్తుందనే నమ్మకం లేదు.

శ్రీ బొడ్డు నాగేశ్వరరావు: అధ్యక్షా, మీ ద్వారా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసేది ఒకటి. రెండవ దశలో వంటగది షెడ్డుకు వచ్చిన అమౌంట్ ల్యాప్స్ అయిపోయింది. తిరిగి మళ్ళీ ఇవ్వాల్సిన అవసరమున్నది. అలాగే నిర్మాణంలో ఉన్నవాటికి కూడా నిధులు లేని పరిస్థితిలో ఉన్నది. గత విద్యా సంవత్సరంలో విద్యాశాఖ స్వీపింగ్, క్లీనింగ్ ఛార్జెస్ కొరకు యాభై మంది పైబడి ఉన్న పిల్లలకు రూ.1000, వందమంది పైబడి ఉన్న అప్పర్ ప్రైమరీ పాఠశాలలకు రూ.1500, 150మందిపైన విద్యార్థులున్న హైస్కూల్స్‌కు రూ.2500 చొప్పున ఇవ్వడం జరిగింది. ఈ సంవత్సరం కూడా ఆ విధంగా వస్తాయని ఆ స్కూల్స్ హెడ్‌మాస్టర్స్ అందరూ డబ్బులు ఖర్చు పెడుతున్నారు. ఆ నిధులను ఇచ్చే అవకాశం ఉన్నదా, లేదా చెప్పగలరు.

డా. పల్లె రఘునాథరెడ్డి: అధ్యక్షా, సభ్యులు శ్రీమతి శమంతకమణిగారు, డా. ఎం.వి.ఎస్ మూర్తిగారు, శ్రీ గోవిందరెడ్డిగారు, శ్రీ పుల్లయ్యగారు, శ్రీ బాల సుబ్రహ్మణ్యంగారు, శ్రీ నాగేశ్వరరావుగారు, వైస్‌ఛైర్మన్‌గారు చాలా ప్రశ్నలు అడిగారు. వాటన్నింటికి సమాధానం చెప్తున్నాను. ఈ రాష్ట్ర ప్రభుత్వం హైస్కూల్స్‌లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలి. మధ్యాహ్నం పూట పౌష్టికాహారాన్ని ఇవ్వాలనే ఆలోచనతో ముందుకుపోతోంది. మొట్టమొదటిసారిగా 2003వ సంవత్సరంలో ప్రాథమిక పాఠశాలలకు మధ్యాహ్నభోజన పథకం ఇవ్వాలని నిర్ణయించారు. అదేవిధంగా 2008వ సంవత్సరంలో ఆరు నుంచి ఎనిమిదవ తరగతి విద్యార్థులకు, 2008వ సంవత్సరం అక్టోబర్ నుంచి 9, 10 తరగతులు చదివే విద్యార్థులకు రాష్ట్రంలో 100 శాతం రాష్ట్రప్రభుత్వ నిధులతో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలుచేయాలని నిర్ణయం తీసుకోవడం జరిగింది. 2010వ సంవత్సరంలో బాలకార్మికుల పాఠశాలల్లో ప్రారంభించాం. 2013-14 సంవత్సరంలో ఆదర్శపాఠశాలల్లో ఈ మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని ఆలోచన చేశాం. ఒకసారి మీరంతా అభినందించాల్సిన అంశమేమంటే రాష్ట్ర వ్యాప్తంగా 37494 ప్రాథమిక పాఠశాలలలోని 23,77,221 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని అమలు చేస్తున్నాం. నేషనల్ ఛైల్డ్ లేబర్ ప్రాజెక్టులో 75 సంస్థలుండగా, వీటిలోని 5353 మందికి మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్నాం. అదేవిధంగా 5662 అప్పర్

ప్రైమరీ స్కూల్స్‌లోని 13,90,470 మంది, 5343 హైస్కూల్స్‌లోని 7,35,732 మంది, 150 ఆదర్శ పాఠశాలలలోని 36,000 మంది మధ్యాహ్న భోజనం చేస్తున్నారు. అంటే రాష్ట్ర వ్యాప్తంగా అనితర సాధ్యంగా ఎప్పుడూ, ఏ ప్రభుత్వాలూ చేయలేనంతగా 48727 సంస్థలలో 45,44,776 మంది భోజనం చేస్తున్నారు. ఒక్కసారి అభినందించాలి.

శ్రీ విటపు బాలసుబ్రహ్మణ్యం: సార్ ఇవన్నీ గత ప్రభుత్వాల నుంచే ఉన్నాయి. కొత్తగా ఏమీ పెట్టింది కాదు.

డా. పల్లె రఘునాథరెడ్డి: శమంతకమణిగారు అనంతపురం జిల్లా గురించి స్పెసిఫిక్‌గా అడిగారు. ఫేజు-1లో 2410 టాయిలెట్స్‌ను మంజూరు చేశాము. దాంట్లో 2216 టాయిలెట్స్‌కి అడ్మినిస్ట్రేటివ్ శాంక్షన్స్ ఇచ్చాము. వాటిలో 1647 పూర్తిచేయగా, 56 నిర్మాణ దశలో ఉన్నాయి. 707 టాయిలెట్స్ ఇంకా మొదలుపెట్టలేదు. వీళ్ళకు మామూలుగా మొదటి దశలో రూ.13.10 కోట్లు అవసరమైతే అదనంగా ఫేజు-2లోని డబ్బులు కూడా దాంట్లోకి మళ్ళించి రూ.18,70,93,000 మంజూరు చేయడం జరిగింది. ఫేజు-1 ఇబ్బంది లేకుండా రాష్ట్రంలోని అన్నిచోట్ల చేయడం జరిగింది. ఫేజు-2లో 1298 టాయిలెట్స్ మంజూరు చేశాము. ఈ 707కు అడ్మినిస్ట్రేటివ్ శాంక్షన్ వచ్చినా మొదలుపెట్టాలంటే ఫేజు-2లోని అమౌంట్‌ను ఫేజు-1లోకి మళ్ళించడంవల్ల ఈ అమౌంట్ కోసం వెయిట్ చేస్తున్నాము. కేంద్ర ప్రభుత్వం నుంచి దాదాపు రూ.232 కోట్లు రావలసి ఉంది. ఆ నిధులు రిలీజ్ అయిన వెంటనే ఫేజ్-2ను కూడా మొదలుపెడతాము.

ఉ. 10.30 & 10.40

గౌరవ సభ్యులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఆర్.ఎమ్.ఎస్.ఏ బిల్డింగులకు రూ.200కోట్లు కేంద్ర ప్రభుత్వం రిలీజ్ చేయాల్సి ఉంది. ఆ నిధులు విడుదల అయిన తరువాత ఆర్.ఎమ్.ఎస్.ఏ. బిల్డింగులు పూర్తి చేస్తాము. అంతేకాకుండా మిడ్ డే మీల్స్ సరిగ్గా అమలు చేస్తున్నారా, లేదా అని అడిగారు. ఈ ప్రభుత్వం ఎల్లప్పుడూ కూడా మిడ్ డే మీల్స్ మీద ప్రత్యేక దృష్టి పెడుతుంది. Interactive voice response system (IVRS) స్కూల్ ఎడ్యుకేషన్ సిస్టమ్ ప్రకారం భోజనం బాగుందా లేదా అని వివరాలు సేకరించాము, అవి ఈ విధంగా ఉన్నాయి – అనంతపురం జిల్లాలో 47శాతం బాగుందని, 27శాతం ఫరవాలేదని చెప్పారు. చిత్తూరు జిల్లాలో 49శాతం బాగుందని, 26శాతం ఫరవాలేదని చెప్పారు. తూర్పు గోదావరిలో 47శాతం బాగుందని, 24శాతం ఫరవాలేదని, గుంటూరులో 46శాతం బాగుందని, 25శాతం ఫరవాలేదని, కడపలో 47శాతం బాగుందని, 24శాతం ఫరవాలేదని, కృష్ణా 49శాతం బాగుందని, 21శాతం ఫరవాలేదని, కర్నూలు 43శాతం బాగుందని, 29శాతం ఫరవాలేదని, నెల్లూరు 44శాతం బాగుందని, 27శాతం ఫరవాలేదని, ప్రకాశంలో 50 శాతం బాగుందని, 24 శాతం ఫరవాలేదని, శ్రీకాకుళం 52శాతం బాగుందని, 23శాతం ఫరవాలేదని, విశాఖపట్నం 49శాతం బాగుందని, 23శాతం ఫరవాలేదని, విజయనగరం 51శాతం బాగుందని, 24శాతం ఫరవాలేదని, పశ్చిమ గోదావరి 49శాతం బాగుందని, 23శాతం ఫరవాలేదని, మొత్తం 48శాతం మంది భోజనం బాగుందని, 24శాతం మంది ఫరవాలేదని నివేదిక వచ్చింది. అంటే సగానికంటే ఎక్కువ మంది భోజనం బాగుందని చెప్పారు. Anyhow, we want to improve the system

also. ప్రతీ నెలకు ఒకసారి ఈ IVRS సిస్టమ్ ద్వారా భోజనం బాగుందా, లేదా అనే వివరాలు సేకరిస్తున్నాము.

అదేవిధంగా త్రాగునీటి గురించి గౌరవ సభ్యులు అడిగారు. అన్ని పాఠశాలల్లో ప్రహరీగోడలు, మరుగుదొడ్లు, మంచినీటి సౌకర్యం దశల వారీగా పూర్తి చేయాల్సి ఉంది, ఎడ్యుకేషన్‌లో రెవల్యూషన్ తీసుకురావాలి. సాంకేతికంగా కూడా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం భావిస్తున్నది. తరువాత వంట గదులు సరిపోవని బాలసుబ్రహ్మణ్యం గారు చెప్పారు, తప్పకుండా ఆ అంశం గురించి పరిశీలన చేస్తాము. మరుగుదొడ్లకు తలుపులు, ఇతర మౌలిక సదుపాయాలు రిపేర్లు చేయమని చెప్పాము, వీలైనంత త్వరలో చేస్తారు. సభ్యులు శ్రీ నాగేశ్వర రావు గారు రెండవ ఫేజ్ గురించి అడిగారు, రెండవ ఫేజ్‌లో రూ.232కోట్లు కేంద్ర ప్రభుత్వం నుండి రావాల్సి ఉంది. ఆ నిధులు విడుదల అయిన వెంటనే రెండవ ఫేజ్ పనులు ప్రారంభిస్తాము. అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేసి ఎడ్యుకేషన్ సిస్టమ్‌ను అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది.

శ్రీమతి పమిడి శమంతకమణి : అధ్యక్షా, నేను అడిగిన ప్రశ్న వంటగదుల గురించి. వంటగదులు లేవనే విషయం అందరికీ తెలుసు. ఈ మధ్యనే జనచైతన్య యాత్రకు మంత్రిగారు కూడా వెళ్లారు, మంత్రిగారి వద్ధకు ఎవరినీ రానివ్వరు కాబట్టి మంత్రిగారి దృష్టికి ఈ అంశం బహుశా వచ్చి ఉండదు. భోజనం బాగుందా, లేదా అనేది OMR Sheets లో చూసేది కాదు. ప్రత్యక్షంగా అక్కడి ఆడపిల్లలు ఇబ్బంది పడుతున్నారు. ఎక్కడా కూడా నీటి సరఫరా జరగడం లేదని, ఆ సమస్యకు పరిష్కారం సూచించమంటే 50శాతం, 40శాతం అని చెబుతున్నారు. గత ఐదు నెలల నుండి ఈ రోజుకు కూడా ఏజెన్సీలకు భోజన బిల్లులు రాలేదు, వాళ్ల పరిస్థితి ఎలా ఉంది అంటే విడవమంటే పాముకు కోపం, కరవమంటే కప్పకు కోపం అన్నట్లు వదిలితే వాళ్ల ఏజెన్సీలు పోతాయి, అలాగే ఉంటే అప్పుల భారం పెరిగిపోతోంది. పప్పు చూస్తే చారు రూపంలో ఉంది, చారు చూస్తే నీళ్ల రూపంలో ఉంది. దయచేసి దానిమీద చర్యలు తీసుకోమని మీ ద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

డా. పల్లె రఘునాథ రెడ్డి : కూర, పప్పు బాగున్నాయా, నీళ్లు వస్తున్నాయా లేదా, ఉపాధ్యాయులు వస్తున్నారా లేదా, పాఠాలు చెబుతున్నారా లేదా అన్నీ అడిగి తెలుసుకుంటున్నాము. కుకింగ్ ఏజెంట్స్‌కు రూ.398కోట్లు రిలీజ్ అయ్యాయి. బిల్స్ క్లియర్ చేయడం జరుగుతుంది. నవంబరు 2015వ సంవత్సరం వరకూ బిల్లులు మొత్తం క్లియర్ చేస్తాము. మొత్తం ఆంధ్రప్రదేశ్‌లో520 హైస్కూల్స్ ఉంటే 377 స్కూల్స్ మొదటి ఫేజ్‌లో పూర్తి చేశాము. మోడల్ స్కూల్స్ 25ఉన్నాయి, అడ్మినిస్ట్రేటివ్ శాంక్షన్ చేశాము, డబ్బులు రిలీజ్ అయిన వెంటనే ఆ పనులు పూర్తి చేస్తాము.

శ్రీ యండపల్లి శ్రీనివాసులు రెడ్డి : మిడ్‌డే మీల్స్‌కు బిల్లులు సంవత్సరానికి ఒకసారి రిలీజ్ చేస్తే ఎలా సార్? ఇస్కాన్ లాంటి వాళ్లకు అప్పగిస్తే, భోజనం బాగోక పిల్లలు వాంతులు చేసుకుంటున్నారు.

శ్రీ పల్లె రఘునాథ రెడ్డి : స్పెసిఫిక్‌గా ఎక్కడ జరిగిందీ మీరు సమాచారం ఇవ్వండి, విచారణ జరిపించి తగిన చర్యలు తీసుకుంటాము.

## విజయనగరం జిల్లాలో జూనియర్ కళాశాలలు

ప్రశ్న నెం. 8741 (22)
శ్రీమతి గుమ్మిడి సంధ్యా రాణి, ఎం.ఎల్.సి.

గౌరవనీయులైన మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా?

అ) విజయనగరం జిల్లా మంటాడ మండలంలో జూనియర్ కళాశాలను, సాలూరు మునిసిపాలిటీలో మహిళా జూనియర్ కళాశాలను ఏర్పాటు చేసే ప్రతిపాదన ఏదైనా ఉన్నదా?
ఆ) తగినంత భూమి లభ్యంగా ఉన్నదా ?

గౌరవనీయులైన మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రిగారి తరఫున సమాచార పౌర సంబంధాలు, మైనారిటీల సంక్షేమం మరియు సాధికారత శాఖా మంత్రి : (డా. పల్లె రఘునాథ రెడ్డి):

అ) లేదండీ.
ఆ) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.
ఇ) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

శ్రీమతి గుమ్మిడి సంధ్యారాణి (శాసనసభ నియోజకవర్గం) : అధ్యక్షా, విజయనగరం జిల్లాలోని మంటాడ మండలంలో జూనియర్ కళాశాలను, సాలూరు మునిసిపాలిటీలో మహిళా జూనియర్ కళాశాలను ఏర్పాటు గురించి ప్రతిపాదనలు పెట్టడం జరిగింది. మా జిల్లాలో మొత్తం 34 మండలాలు ఉన్నాయి. 33 మండలాలకు జూనియర్ కళాశాలలు ఉన్నాయి, మంటాడ మండలంలో మాత్రం లేదు. సాలూరు నియోజకవర్గం మొత్తం ట్రైబల్ ప్రాంతము. అక్కడ మహిళా కళాశాలను ఎందుకు అడిగాము అంటే అక్కడ విద్యార్థినుల పాఠశాల 10వ తరగతి వరకూ ఉంది. అది చాలా ఎక్కువ విస్తీర్ణంలో ఉంది. స్థలం కూడా అందుబాటులో ఉంది కాబట్టి అక్కడ కళాశాల నిర్మించాల్సిందిగా మంత్రివర్యుల దృష్టికి తీసుకువెళ్లడం జరిగింది. అక్కడ బిల్డింగ్ శాంక్షన్ చేస్తే బిల్డింగ్ నిర్మించడానికి ఎక్కువ ఖర్చు కూడా కాదు. అలాగే మంటాడ ఎస్టీ మండలం. అక్కడ 10వ తరగతి పాస్ అయిన తరువాత కాలేజ్‌కు వెళ్లాలి అంటే గజపతినగరం అనే పట్టణానికి వెళ్లాల్సి వస్తోంది. అందువల్ల డ్రాపవుట్స్ ఎక్కువ అవుతున్నాయి. కాబట్టి అక్కడ కూడా ఒక కాలేజీ కావాలి. అక్కడ కూడా హైస్కూల్ 3ఎకరాల విస్తీర్ణంలో ఉంది, కాలేజీ నిర్మాణానికి స్థలం కూడా అందుబాటులో ఉంది. ఎమ్మార్వో గారికి స్థలం కూడా చూపించడం జరిగింది. అది కూడా మంత్రివర్యులకు లేఖ పెట్టడం జరిగింది. కాబట్టి ఈ రెండు జూనియర్ కాలేజీలను

ప్రభుత్వం మంజూరు చేస్తే అక్కడి ఎస్టీ పిల్లలు చదువుకోవడానికి వీలవుతుంది. అక్కడ ఉన్న బిసిలు పేదవారు. విజయనగరం జిల్లా అంటే వెనుకబడిన జిల్లా. అందులో సాలూరు ఎస్టీ నియోజకవర్గం. దయచేసి ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు అని అనకండి. ఎందుకంటే ప్రతిపాదన పెట్టడం జరిగింది. రెండు కాలేజీలు మా నియోజకవర్గానికి అత్యవసరం. సాలూరు నియోజక వర్గంలో మహిళా కళాశాలను ఎందుకు అడుగుతున్నాము అంటే చుట్టూ ఉన్న మండలాలలో 10వ తరగతి పూర్తయిన విద్యార్థినులు పై చదువులకు వెళ్లడం లేదు. అంత ఆర్థిక స్తోమత ఉన్నవారు లేరు. కాలేజీకి వెళ్లాలంటే విజయనగరం జిల్లాలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కాలేజీకి వెళ్లాల్సి ఉంటుంది. అక్కడ పిల్లలకు సరిపోయినన్ని సీట్లు లభ్యం కావడం లేదు. దయచేసి ఆ రెండు కాలేజీలకు అనుమతులు ఇప్పించమని మీ ద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

డా. పల్లె రఘునాథరెడ్డి : అధ్యక్షా, సంధ్యారాణి గారు రెండు జూనియర్ కళాశాలల గురించి అడగడం జరిగింది. విజయనగరం జిల్లా, మంటాడ మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మించడానికి ఎటువంటి ప్రతిపాదన ప్రభుత్వ దృష్టికి రాలేదు. అదే విధంగా సాలూరు మున్సిపాలిటీలో మహిళా జూనియర్ కళాశాల నిర్మించడానికి ప్రపోజల్ ప్రభుత్వ దృష్టికి రాలేదు. ఈ ప్రభుత్వం సాధ్యమైనంత వరకూ అన్ని మండలాలలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు నిర్మించాలని కృత నిశ్చయంతో ఉంది. మీరు ఒకసారి గమనిస్తే కొత్తగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్‌లో 444 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. 1780 ప్రైవేటు జూనియర్ కళాశాలలు, 130ఎయిడెడ్ కళాశాలలు ఉన్నాయి. మొత్తం ఈ రాష్ట్రంలో 672 మండలాలకు గాను 2,354 జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ఇంతవరకూ జూనియర్ కళాశాలలు లేని మండలాలు కేవలం 19మాత్రమే ఉన్నాయి. సాలూరు మున్సిపాలిటీలో కో-ఎడ్యుకేషన్ కళాశాల ఉంది. అక్కడ విద్యార్థుల సంఖ్య కేవలం 221. వీరిలో విద్యార్థినులు 112, విద్యార్థులు 109మంది ఉన్నారు. ఇంకా దానిలో సీట్లు మిగిలి ఉన్నాయి. ఏదైనా జూనియర్ కళాశాల మొదలు పెట్టాలంటే 200మంది పైచిలుకు విద్యార్థినీ, విద్యార్థులు చుట్టుప్రక్కల 15 కిలోమీటర్ల దూరంలో ఉండాలి. అదే విధంగా కాలేజీ డెవలప్‌మెంట్ కమిటీ ఏర్పడాలి, కార్పస్ ఫండ్ 3.12లక్షలు కో-ఎడ్యుకేషన్ కాలేజీకి, మహిళా కాలేజీ అయితే 1.5లక్షలు కట్టాలి. కనీసం 2ఎకరాల భూమి కావాలి, 17,723స్క్వేర్ ఫీట్ బిల్డింగ్ ఉండాలి, టీచింగ్ స్టాఫ్ 15 మంది, నాన్ టీచింగ్ స్టాఫ్ 12మంది ఉండాలి. కాలేజీ కోసం అప్లికేషన్ పెట్టిన తరువాత District Vocational Education Officer (DVEO) ఎంక్వైరీ చేయాలి, వారు ఫీజిబులిటీ రిపోర్టు ఇచ్చిన తరువాత కాలేజీ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తాము. ఇప్పటికైనా వారు అప్లికేషన్ పెడితే DVEO కు పంపిస్తాము, ఫీజిబులిటీ చూసి రూల్స్‌కు అనుగుణంగా ఉంటే తప్పకుండా మంజూరు చేస్తాము.

శ్రీ విటపు బాలసుబ్రహ్మణ్యం : అధ్యక్షా, మంత్రిగారు మాట్లాడుతూ జూనియర్ కళాశాలకు 2ఎకరాల స్థలం ఉండాలని అంటున్నారు, రాష్ట్రంలో ఉన్న ప్రైవేటు జూనియర్ కళాశాలలలో ఎన్ని కాలేజీలకు 2 ఎకరాల స్థలం కలిగి ఉన్నాయి. మీరు చెప్పిన రూల్స్ ప్రకారం 200మంది పిల్లలు ఉండాలని చెప్పారు. ఎన్ని కాలేజీలలో 200మంది విద్యార్థులు ఉన్నారు? ప్రైవేటు కాలేజీలకు ఏ నిబంధనలు పాటించకుండానే అనుమతులు ఇస్తారు,

మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మించమని అడిగితే రూల్స్ గురించి మాట్లాడుతున్నారు.

శ్రీమతి గుమ్మిడి సంధ్యారాణి : అధ్యక్షా, గంటా శ్రీనివాసరావు గారు విజయనగరం జిల్లాకు వచ్చినప్పుడు నేను స్వయంగా కాలేజీల నిర్మాణం గురించి రిప్రజెంటేషన్ ఇచ్చాను మరియు సచివాలయంకు వెళ్లి రిప్రజెంటేషన్ ఇవ్వడం జరిగింది. సాలూరు నియోజకవర్గంలో వొకేషనల్ కోర్సులు పెట్టారు. అక్కడ లెక్చరర్స్ లేక చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఆడపిల్లలు ఎక్కువగా ఉన్న నియోజకవర్గంలో ఒక కాలేజీ నిర్మిస్తే అది ఎస్టీ పిల్లలకు చాలా ఉపయోగపడుతుందని నా అభిప్రాయం. అదేవిధంగా మంటాడ మండలంలో 3ఎకరాల స్కూల్ స్థలం మరియు దాని ప్రక్కనే ప్రభుత్వ స్థలం కూడా ఉంది. దయచేసి శాంక్షన్ చేస్తే అక్కడి విద్యార్థులకు చదువుకోవడానికి అవకాశం ఉంటుంది. ముఖ్యమంత్రిగారు 10వ తరగతిలో మంచి మార్కులు తెచ్చుకున్న వారికి తిరుపతిలో సన్మానం చేశారు. మా నియోజక వర్గంనుండి 12మంది విద్యార్థులు ఉన్నారు. అంతబాగా చదువుతున్నారు. అటువంటి ప్రాంతంలో కాలేజీ లేకపోతే, వారు ఎక్కడికి వెళ్లి చదువుకుంటారనేది మంత్రివర్యులను ఆలోచించాల్సిందిగా మీ ద్వారా కోరుతున్నాను.

శ్రీ బి. చెంగల్‌రాయుడు (శాసనసభ నియోజకవర్గం) : అధ్యక్షా, గతంలో ఇదే సభలో ప్రొఫెసర్ నాగేశ్వర్ గారు రంగారెడ్డి జిల్లాలో ఒక్క జూనియర్ కళాశాల కూడా లేదని చెప్పగా, ఆర్థిక శాఖా మంత్రిగా ఉన్న శ్రీ రోశయ్య గారు అప్పటికప్పుడు ముఖ్యమంత్రిగారితో ఫోన్‌లో మాట్లాడి, అప్పుడే రంగారెడ్డి జిల్లాకు ప్రభుత్వ జూనియర్ కాలేజీ మంజూరు చేస్తున్నట్లు సభలో ప్రకటించారు. గౌరవ మంత్రిగారు ఇక్కడే ఉన్నారు కాబట్టి ముఖ్యమంత్రి గారితో మాట్లాడి వెంటనే ప్రకటిస్తే మేము సంతోషిస్తాము.

శ్రీ గాదె శ్రీనివాసులు నాయుడు (ఉపాధ్యాయ నియోజకవర్గం, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం): అధ్యక్షా, జూనియర్ మరియు డిగ్రీ కళాశాలల విషయంలో మా విజయనగరం జిల్లా కొంత నిరాదరణకు గురవుతోంది. జూనియర్ కళాశాలలు లేకపోవడం వల్ల డిగ్రీ కాలేజీలలో విద్యార్థుల సంఖ్య తగ్గిపోతోంది. అయితే డిగ్రీ కాలేజీలు మొత్తం 3 ఉన్నాయి. కొత్తవలసలో ఏర్పాటు చేయాలని అడిగాము కానీ రాలేదు, సాలూరులో సైన్స్‌గ్రూప్, ఎస్.కోటలో ఆర్ట్స్ గ్రూప్ ఉంది. కాబట్టి దయచేసి జూనియర్, డిగ్రీ కళాశాలల సంఖ్య పెంచుకున్నట్లయితే తప్పనిసరిగా విద్యావ్యవస్థ మెరుగుపడుతుంది. గతంలో ప్రభుత్వం కమిటీ వేసింది. ప్రభుత్వ స్కూల్స్, కాలేజీలు ఏర్పాటు గురించి కమిటీ ఏర్పాటు చేసి ప్రభుత్వానికి నివేదిక ఇస్తే ముఖ్యమంత్రిగారు విద్య పట్ల ఆసక్తిగా ఉన్నారు కాబట్టి విద్యా హబ్‌గా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్ధడానికి అవకాశం ఉంటుందని మీ ద్వారా మంత్రి గారికి తెలియజేస్తున్నాను.

డా. పల్లె రఘునాథ రెడ్డి : అధ్యక్షా, విజయనగరంకు నేను ఇన్‌ఛార్జ్‌గా ఉన్నాను, నాకు కూడా బాధ్యత ఉంది. సంధ్యారాణి గారు ప్రపోజల్ ఇచ్చి ఉంటే దానిని పరిశీలిస్తాము. ఫీజిబులిటీ ఉంటే తప్పకుండా పరిశీలిస్తాము. రెండవది శ్రీ విటపు బాలసుబ్రహ్మణ్యం గారు అడిగారు, ప్రైవేటు జూనియర్ కాలేజీలకు అనుమతులు

ఇచ్చేటప్పుడు ఎటువంటి పక్షపాతం లేకుండా రెండు ఎకరాలు ఉంటేనే అనుమతులు ఇస్తున్నాము. ప్రభుత్వ కాలేజీలకు అనుమతులు ఇచ్చేటప్పుడు ఒక ఎకరం, అర ఎకరం ఉన్నా పట్టించుకోవడం లేదు.

శ్రీ విటపు బాలసుబ్రహ్మణ్యం: నేను అడిగింది 1400 జూనియర్ కాలేజీలలో ఎన్నింటికి 2 ఎకరాల స్థలం ఉంది? కొత్తవి కాదు, ప్రస్తుతం ఉన్న కాలేజీలలో ఎన్నింటికి 2 ఎకరాలు స్థలం ఉంది?

డా.పల్లె రఘునాథ రెడ్డి : పర్మిషన్ తీసుకునే వారు 2 ఎకరాలు చూపించక పోతే పర్మిషన్ ఇచ్చే అవకాశం లేదు. అటువంటిది ఏమైనా మీ దృష్టికి వస్తే చెప్పండి, వారి పర్మిషన్స్ క్యాన్సిల్ చేస్తాము.

శ్రీ విటపు బాలసుబ్రహ్మణ్యం : మీరు నియమించిన నీరజారెడ్డి కమిషన్ కాలేజీల పరిస్థితి ఏవిధంగా ఉందనేది నివేదిక అందించింది.

శ్రీ యండపల్లి శ్రీనివాసులు రెడ్డి : చాలా జూనియర్ కాలేజీలు అపార్టుమెంట్‌లలో నడుస్తున్నాయి.

డా.పల్లె రఘునాథ రెడ్డి : మీరు చెప్పింది నిజమే, వారు స్థలం ఎక్కడో ఒక చోట చూపించి ఉంటారు. ప్రభుత్వంకు కొన్ని రూల్స్ ఉంటాయి, అప్లికేషన్ రావాలి, ఇన్‌స్పెక్షన్ జరగాలి,ఫీజిబులిటీ రిపోర్టు రావాలి, శాంక్షన్ చేయాలి. రిపోర్టు వస్తే తప్పకుండా పాజిటివ్‌గా స్పందిస్తాము. తరువాత శ్రీనివాసులు నాయుడు గారు ప్రైవేటు సిస్టమ్ కంటే ప్రభుత్వ సిస్టమ్ ఇంప్రూవ్ చేయాలని కోరారు. అందుకే మీ అందరి అనుమతితో మోడల్ స్కూల్స్ ఏర్పాటు చేసి కార్పోరేట్ స్థాయికి తగ్గకుండా టీచర్స్‌ని నియమించి, మౌలిక సదుపాయాలు కల్పించి, ఎడ్యుకేషన్ హబ్‌గా మార్చేందుకు కృషి చేస్తున్నాము. ప్రస్తుతం 48శాతం ప్రైవేటు స్కూల్స్‌లో, 52శాతం ప్రభుత్వ స్కూల్స్‌లో ఉన్నారు, దీనిని ప్రైవేటు స్కూల్స్‌లో 20శాతం, ప్రభుత్వ స్కూల్స్‌లో 80శాతం విద్యార్థులు ఉండేవిధంగా చూసేందుకు ప్రయత్నిస్తున్నాము.

CHAIRMAN: Third Question (Question No.8542) postponed at the request of the Member. Fourth Question (Question No.8612) also postponed at the request of the Member. Fifth Question (Question No.8707).

## అద్దె లేదా లీజుకు వక్ఫ్ ఆస్తులు

ప్రశ్న నెం. 8707 (25)
శ్రీ షరీఫ్ మహమ్మద్ అహ్మద్, ఎం.ఎల్.సి.

గౌరవనీయులైన సమాచార పౌర సంబంధాలు, మైనారిటీల సంక్షేమం మరియు సాధికారత శాఖా మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా?

అ) దేవాదాయ చట్టం పరిధిలో ఉన్న దుకాణాలు, భూములను ఇతర మతాల ప్రజలకు అద్దెకు లేదా కౌలుకు ఇవ్వరాదన్న విషయం వాస్తవమేనా?

ఆ) అయితే, వాటిని వక్ఫ్ సంస్థలకు ఇచ్చే ప్రతిపాదన ఏదైనా ఉన్నదా ?

ఇ) అయితే, ఈ విషయంలో అట్టి ఉత్తర్వులను ఎప్పటిలోగా జారీ చేయడమవుతుంది?

గౌరవనీయులైన సమాచార పౌర సంబంధాలు, మైనారిటీల సంక్షేమం మరియు సాధికారత శాఖా మంత్రి : (డా. పల్లె రఘునాథ రెడ్డి):

అ) హిందూ యాక్ట్ ప్రకారం హిందూ మతానికి సంబంధించిన దేవాదాయ ప్రాపర్టీస్‌లో లీజుకు కాని, కాంప్లెక్స్‌లు కట్టేందుకు గానీ మరే ఇతర విషయాలకు ఇతర మతస్తులకు ఇచ్చేందుకు అవకాశం ఉంది.

ఆ) వక్ఫ్‌బోర్డు పర్మిషన్ తీసుకోవాల్సి ఉంటుంది.

ఇ) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

శ్రీ షరీఫ్ మహమ్మద్ అహ్మద్ (శాసనసభ నియోజకవర్గం) : అధ్యక్షా, మంత్రిగారి వద్దనుండి సమాధానం సూటిగా రాలేదు. సమాధానం ఇచ్చిన పేపర్‌లో దేవాదాయ చట్టం పరిధిలో ఉన్న దుకాణాలు, భూములను ఇతర మతాల ప్రజలకు అద్దెకు ఇవ్వరాదు అన్నప్రశ్నకు అవునండీ అని సమాధానం ఉంది. కానీ, ఇప్పుడు మంత్రిగారు సమాధానం చెప్పినప్పుడు మాత్రం, ఇతర మతస్థులకు ఇవ్వవచ్చని చెబుతున్నారు. అదేవిధంగా వక్ఫ్ ఆస్తుల విషయంలో ఇది వర్తింప చేస్తారా? అంటే ఆ ఆలోచన లేదన్నారు, ప్రశ్న ఉత్పన్నం కాదని వ్రాతపూర్వక సమాధానంలో అన్నారు.

ఉ. 10.50

అధ్యక్షా, 2011వ సంవత్సరంలో ఉన్న ఆనాటి ప్రభుత్వం, నాటి ఎండోమెంట్ డిపార్టుమెంటు వారు ఒక ఉత్తర్వు ఇచ్చారు. అది A-1/21289/2011, dated 02-08-2011న వేరే మతస్థులకు దేవాలయాలకు సంబంధించి భూములు కానీ, దుకాణాలు కానీ ఇవ్వకూడదని ఉత్తర్వులు ఇచ్చారు. ఈనాడు స్వాతంత్ర్యం వచ్చిన 65 సంవత్సరముల తరువాత కూడా అనేక భూములు, దుకాణాలలో అవి వక్ఫ్ ఆస్తులైనా, దేవాలయాల ఆస్తులైనా కావచ్చు, ఇతర మతస్థులనే తేడా లేకుండా, ఎవరైతే భారతీయ పౌరులై ఉన్నారో, వారు ఈ ఆస్తులను లీజుకు తీసుకుంటున్నారు. దాదాపు 30, 40 సంవత్సరముల నుంచి ఆ లీజులు కొనసాగుతూనే ఉన్నాయి. కానీ, ఈనాడు దేవాదాయ శాఖ వారు 2011 నాడు ఆనాటి ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులు ఏవైతే ఉన్నాయో, వాటిని ఈనాడు కూడా అమలు చేయడం జరుగుతోంది. వాటివలన మైనారిటీ వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఇబ్బందులన్నింటిని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం మరియు మైనారిటీ వెల్ఫేర్ డిపార్టుమెంటు కూడా మైనారిటీ వర్గాల సంక్షేమం, వికాసం కోసం మరియు వారి ఇబ్బందులను దూరం చేసే ఆలోచనలు చేయవలసి ఉంది. కాబట్టి, ఇటువంటి ఉత్తర్వులు

ఉన్నాయని తెలిసి కూడా మైనారిటీ వర్గాలకు ఇబ్బంది కలుగుతుందనే ఆలోచనలు ఉన్నప్పుడు వీటిని సవరించడానికి గానీ, ఇటువంటి మైనారిటీ వ్యతిరేక ఉత్తర్వులను అధిగమించడానికి ప్రభుత్వం ఏమైనా ప్రయత్నాలు చేసిందా అని సభాముఖంగా తమ ద్వారా గౌరవ మంత్రిగారిని అడుగుతున్నాను. సుమారు 65,000 ఎకరాల వక్ఫ్ ఆస్తులు ఈనాడు మన రాష్ట్రంలో ఉన్నాయి. ఆ ఆస్తులన్నీ చాలా వరకూ అన్యాక్రాంతమయ్యాయి. ప్రభుత్వ లెక్కల ప్రకారం కేవలం 35,000 ఎకరాల వక్ఫ్ ఆస్తులు మాత్రమే ఉన్నాయని అంటున్నారు. కాబట్టి, వక్ఫ్ ఆస్తులను కూడా వెనక్కి రాబట్టుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. అదేవిధంగా, వక్ఫ్ ఆస్తులను లీజుకు, అద్దెకు ఇచ్చేదానిలో కనీసం మైనారిటీ వర్గాల వారికి ప్రాధాన్యత ఇస్తామని చెప్పవలసిందిగా కోరుతున్నాను. అలాగే, ఒకే మతానికి ఇవ్వమని కూడా నేను అడగడం లేదు. కానీ, మైనారిటీ వర్గాల వారికి మాత్రం వక్ఫ్ ఆస్తుల విషయమై ప్రాధాన్యత ఇవ్వాలని ఆలోచన చేసే ఉద్దేశం ప్రభుత్వానికి ఉందా లేదా తెలియజేయాలని తమ ద్వారా గౌరవ మంత్రిగారిని కోరుతున్నాను. ఈ విషయాన్ని మంత్రిగారు సూటిగా చెప్పవలసిందిగా తమ ద్వారా కోరుతున్నాను.

డా. పల్లె రఘునాథ రెడ్డి : అధ్యక్షా, As per Rule 9 of Andhra Pradesh Charitable and Hindu Religious Institutions and Endowment (Lease of Agricultural Lands) Rules, 2003 (Amendment Notification) “No person professing other than Hinduism as his religion is entitled to obtain lease either through tender-cum-public auction or otherwise. ఈ రూల్ 9, రెలీజియస్ యాక్ట్ ప్రకారం హిందూ మతానికి సంబంధించిన ఆస్తులు, హిందూ మతస్థులకు తప్ప ఇతర మతస్థులకు టెండరు భూములలో గానీ, లీజుగాని ఇచ్చే అవకాశం లేదని హిందూ రిలీజియస్ యాక్ట్ ఉంది. అలాగే, వక్ఫ్ భూములకు సంబంధించి వక్ఫ్ యాక్ట్ (సెంట్రల్) ప్రకారం ఎవరికైనా రూ.1,000ల లోపు లీజు ఉంటే, రూ.1,000ల వరకు ముతావలీ ఇవ్వవచ్చు. అలాగే, రూ.1000 – 3,000 లకు మధ్యలో లీజు ఉంటే వాటిని వక్ఫ్ బోర్డు ఇవ్వవచ్చు. అదే లీజు రూ.30,000 పైన ఉంటే కేంద్రప్రభుత్వం ఇవ్వవలసి ఉంటుంది. ఇందులో ఎవరైనా ఈ–టెండరులో పాల్గొనవచ్చు. ఇది ట్రాన్స్‌పరెంటుగా ఉండాలని వక్ఫ్ యాక్ట్‌లో పెట్టడం జరిగింది. వీటికి సంబంధించి ఏదైనా నిర్ణయాలు తీసుకోవాలంటే, కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉంటుంది కాబట్టి, గౌరవ సభ్యులు చెప్పిన ప్రతిపాదనలను రాష్ట్రం ప్రభుత్వం ద్వారా కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకువెళతాము. గౌరవ సభ్యులు చెప్పిన అంశంలో కూడా చాలా అర్థం ఉంది. వక్ఫ్‌కు సంబంధించి ముస్లిం మతస్థులు, ఇక్కడకు సంబంధించి హిందూ మతస్థులు చేసుకోవలసి ఉంది. అలా కాకుండా, ఇతర మతస్థులు చేసుకోవడంలో ధర్మం లేదు. కానీ, వక్ఫ్ యాక్ట్ ముందు నుంచీ ఉన్నది కాబట్టి, ఇందులో ఏవైనా మార్పులు, చేర్పులు చేయాలన్నా కేంద్ర ప్రభుత్వమే చేయవలసి ఉంటుంది కావున ఆ ప్రతిపాదనలలో నిర్దిష్టంగా ఈ యాక్ట్‌ను కూడా పెట్టి, తప్పకుండా కేంద్రప్రభుత్వానికి పంపిస్తామని మీ ద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను. గౌరవ సభ్యులు అడిగిన దానిలో నూటికి నూరు శాతం న్యాయం ఉంది. ఈ అంశాలు కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉన్నాయి కావున తప్పకుండా మేము కేంద్రం దృష్టికి తీసుకువెళతామని తమ ద్వారా సభ్యులకు తెలియజేస్తున్నాను. అదేవిధంగా వక్ఫ్ ఆస్తులకు సంబంధించి కూడా సభ్యులు అడగడం జరిగింది. నవ్యాంధ్రప్రదేశ్‌లో వక్ఫ్ ఆస్తులకు సంబంధించి గుర్తించిన మసీదులు సుమారు 13,500, దర్గాలు – సుమారు

316, అసుర ఖానా అండ్ పంజాలు సుమారు 1548, మరుభూములు సుమారు 43, ఈద్గాలు సుమారు 66, ఇతరములు 64 వరకు ఉన్నాయి. వీటిల్లో సుమారు 65,770 ఎకరాల వక్ఫ్ ఆస్తులు ఉన్నాయి.

అధ్యక్షా, దురదృష్టమేమిటంటే, వక్ఫ్ ఆస్తుల దురాక్రమణలలో సుమారు 31,594ఎకరాలు ఉన్నాయి. తరువాత ప్రభుత్వం వీటిని అక్వైర్ చేయడం, వక్ఫ్ బోర్డు అమ్మటం మొదలైన వాటి ద్వారా ప్రస్తుతం ఉన్న ఆస్తులు సుమారు 4,611 ఎకరాలు ఉన్నాయి. Free from Encroachment 29,565 acres. అంటే, సగానికి పైగా వక్ఫ్ ఆస్తులన్నీ అన్యాక్రాంతమయ్యాయి. హైకోర్టు నుంచి మేము అక్వైర్ చేసిన సమాచారం మేరకు దాదాపు 1261.91 ఎకరాలు ఇంతవరకు ఆక్రమణలకు గురయ్యాయి. ఈ వక్ఫ్ ఆస్తులు అన్నీ వ్యక్తులకు సంబంధించినవి కావు. సమాజానికి, వ్యవస్థకు సంబంధించిన ఆస్తులు. ఇవన్నీ అల్లా కు సంబంధించిన ఆస్తులు కావున జీ.ఓ. నెం. 18ను 2014 అక్టోబర్‌లో ఇవ్వడం జరిగింది. దీనికి కలెక్టర్‌ను అధ్యక్షులుగాను, ఎస్.పి. గారిని కన్వీనర్‌గా పెట్టి, ఎటువంటి పరిస్థితులలో కూడా వక్ఫ్ ఆస్తులు అన్యాక్రాంతం కాకూడదని వారిని నియమించడం జరిగింది. ఎవరైనా వక్ఫ్ ఆస్తులు ఆక్రమిస్తే వారిపై నోటీసులు ఇచ్చి, క్రిమినల్ కేసులు పెట్టి, ఎటువంటి పరిస్థితులలోనూ ఆ ఆస్తులను అక్వైర్ చేయమని కలెక్టర్లకు కూడా ఆదేశాలు ఇవ్వడం జరిగింది. మొన్న జరిగిన జిల్లా కలెక్టర్ల సమావేశంలో కూడా ముఖ్యమంత్రిగారి సమక్షంలో ఈ విషయాన్ని చాలా గట్టిగా చెప్పడం జరిగింది. వక్ఫ్ ఆస్తులు ఒక్కటి కూడా వృధా కాకూడదు. కొన్ని వేల కోట్ల రూపాయల విలువ చేసే ఆస్తులు ఉన్నాయి. ఆ వక్ఫ్ ఆస్తులన్నింటిని వెనక్కి తీసుకుని, తిరిగి మైనారిటీలకు లీజుకు ఇవ్వడం లేదా అక్కడ కాంప్లెక్సులు కట్టడం మొదలైనవి చేయడం ద్వారా ముస్లిమ్ మైనారిటీలకు ప్రయోజనం కలుగుతుంది కాబట్టి, ఆ ఆలోచనతోనే ఈ ప్రభుత్వం ముందుకు వెళుతోంది. దీనికి ఇక్కడ ఉన్న సభ్యులందరూ సహకరించాలి. ఎందుకంటే, ఇది చాలా బాధాకరమైన విషయం. ఇన్ని వేల కోట్ల రూపాయల ఆస్తులు ఈ విధంగా అన్యాక్రాంతమయిపోవడం, నిరర్థకంగా ఉండడం, ఆక్రమించడం కరెక్టు కాదు. వీటిపై ఉక్కుపాదం మోపుతాము. ఎటువంటి పరిస్థితులలో వెనక్కు తగ్గేది లేదు. గౌరవ సభ్యులు ఇంకా ఏమైనా సూచనలు, సలహాలు ఇస్తే, వాటిని కూడా అమలుచేసి ఈ ఆస్తులన్నీ అక్వైర్ చేస్తాము. అంతేగాకుండా, దర్గాలకు సంబంధించిన ఆస్తుల వివరాలకై ఆడిట్ జరగడం లేదు. దర్గాలకు సంబంధించిన డబ్బులను వారు విపరీతంగా ఖర్చు చేస్తున్నారు. వాటికి కూడా ఆర్టికల్స్ పెడతాము. వాటి యొక్క సొమ్ములను కూడా లీగలైజ్ చేసి, రెగ్యులరైజ్ చేసి, ఇతర వక్ఫ్ ఆస్తుల మరమ్మత్తులు మొదలైన వాటికి ఉపయోగించే ఏర్పాటు చేస్తాము. గౌరవ సభ్యులు అడిగిన అంశాన్ని కేంద్రం దృష్టికి తీసుకువెళ్ళడంతోబాటు, వక్ఫ్ ఆస్తులను తప్పకుండా పరిర క్షిస్తామని మీ ద్వారా తెలియజేస్తున్నాను.

శ్రీ సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి (నామినేటెడ్): అధ్యక్షా, కసునూర్ దర్గా, రొట్టెల పండగ దర్గాలు రెండు ఉన్నాయి. వీటికి సంబంధించి తమకు ఒక ఉదాహరణ చెపుతాను. ఈ కసునూరు దర్గా వెంకటాచలం మండలం సర్వేపల్లి హెడ్ క్వార్టర్స్‌లో ఉంది. ఆ దర్గాలకు హిందువులు, ముస్లిములు అందరూ వస్తారు. దర్గాలలో ప్రతి సంవత్సరం ఉత్సవాలు జరిగేటప్పుడు వాటికి సంబంధించిన టెండర్లను వక్ఫ్ బోర్డు, హైదరాబాదులో పిలుస్తారు.

గత సంవత్సరం కోటి, పది లక్షల రూపాయలకు టెండర్లు పిలిచారు. ప్రతి సంవత్సరం ఈ టెండరు విధానం జరుగుతుంది. అందులో సొమ్ము మొత్తాన్ని వక్ఫ్ బోర్డు తీసేసుకుంటుంది. కసునూరులో ఉండే వారు టెక్నికల్ పదం మజుందార్లు అనుకుంటాను. ఆ మజుందార్లకు మాత్రం ఇందులో వన్‌థర్డ్ నిధిని విడుదల చేస్తారు. వారు ఈ నిధులను షేర్ చేసుకుంటారు. అక్కడ ఉండే స్వీపర్లకు రూ.3,000, 4,000ల జీతం ఇస్తారు. చాలా తక్కువగా, దారుణమైన జీతాలు ఇస్తారు. ఈ ఉత్సవాలకు వచ్చే భక్తులకు ప్రవేశ ద్వారం వద్దనే హుండీ పెట్టేస్తారు. అక్కడ భక్తులు చాలా ఇరుకుగా నడిచి దర్శనానికి వెళ్ళవలసి ఉంటుంది. భక్తులు హుండీలో డబ్బులు వేయకుండా వెళితే, అక్కడ కొంతమంది కర్రలు పట్టుకుని మనుషులు నిలబడి, హుండీలో డబ్బులు వేసిన వారినే లోపలకి పంపిస్తారు. డబ్బులు వేయని భక్తులను స్త్రీ, పురుషులు ఎవరినైనా చులకనగా చేసి మాట్లాడతారు. దీనిని నేను ప్రత్యక్షంగా చూశాను. మరొక అంశం ఏమిటంటే, భక్తులు లోపలకి వెళ్ళి వచ్చే దారిలో అక్కడ వినేవారి చెవులు పగిలిపోయేంతగా మైకులు పెట్టడమే కాకుండా, పెద్దగా సౌండ్ పెట్టి, హుండీలో డబ్బులు వేయమని చెపుతూ ఉంటారు. అసలు ఆ ప్రాంతానికి వెళ్ళిన పవిత్రత కూడా దెబ్బతినిపోయే పరిస్థితి వస్తోంది. ఇది చాలా దారుణంగా ఉంది. అసలు కోటి రూపాయలకు డెబ్బది శాతం మేర నిధులను వక్ఫ్ బోర్డు ఎందుకు తీసుకోవాలి? ఆ సొమ్మును అక్కడే ఉండే ట్రస్టు బోర్డుకు వదిలివేయమనండి. అక్కడ ఎవరైనా అధికారులను నియమించమనండి. మరొక విషయం ఏమిటంటే, మేవార్ దర్గా అని క్రొత్త దర్గా వచ్చింది. దానికి పెద్ద పెద్ద హిందీ యాక్టర్స్ కూడా వస్తూ ఉంటారు. ఆ దర్గాకు కలెక్షన్ పెరిగింది. అక్కడ ఉండే సర్పంచులు ఆ సొమ్మును తినేస్తున్నారు. అక్కడ ఉండే కలెక్టర్‌తో చెప్పి, దానిని కంట్రోల్ చేయించి, వారిని అరెస్ట్ చేయించి, ఒక కమిటీని వేయించాము. అక్కడి మేనేజర్ మరియు కొంతమంది గ్రామస్థులు కలిసి ఈ రోజున అక్కడ వచ్చే డబ్బులను, అక్కడి అభివృద్ధికే ఖర్చు పెడుతున్నారు. అసలు భక్తులు వేసే డబ్బులు వక్ఫ్ బోర్డు ఎందుకు తీసుకోవాలో నాకు అర్థం కావడం లేదు. మంత్రిగారికి నేను ముందుగా అభినందనలు తెలియజేస్తున్నాను. నేను ఈ విషయాన్ని ఆయనకు చెపితే, ఆయన దానిని నిలుపుదల చేసి, ఆ ఆక్షన్స్‌ని ఆపించారు. రేపటి నుంచి ఆక్షన్స్ జరపకుండా ఎక్కడి దర్గాలకు అక్కడే హుండీలో డబ్బులను వాటి అభివృద్ధికి ఖర్చు పెట్టే విధంగా చర్యలు తీసుకుంటారా అని తమ ద్వారా గౌరవ మంత్రిగారిని ప్రశ్నిస్తున్నాను.

ఉ.11.00

MR.CHAIRMAN: Venkateswarlu garu, I will allow only one single supplementary Sir. Already, it is 11-00 a.m. I have to close the Question Hour. క్వశ్చన్ అవర్ ఈ ప్రశ్నతో పూర్తి చేద్దాము. I am not going to next question.

శ్రీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు : సార్, ఇందాక స్పెషల్ మెన్షన్ ఒకటి ఇచ్చాను. ఇంక ఆ స్పెషల్ మెన్షన్ అక్కర్లేదు. ఇది ఎట్లాగూ దానికి రిలేటెడ్ క్వశ్చన్. ఈ సందర్భంగా నేను ఒక స్పెసిఫిక్ ఇష్యూని మీ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తాను. శ్రీశైలంలో కూడా 70, 80 సంవత్సరాల నుండి కొన్ని ల్యాండ్స్, షాపులు ముస్లిం మైనారిటీలకు సంబంధించినవి ఉన్నాయి. అవి నిన్న, ఇవాళ ఇచ్చినవి కాదు. 70, 80 సంవత్సరాల నుండి ఉన్నాయి. వాటిని ఇప్పుడు ఖాళీ చేయాలని, అన్యమతస్తులకు అక్కడ ఉండటానికి వీల్లేదనే నిబంధన ఒకటి తీసుకువస్తున్నారు. మనది ఒక సెక్యులర్ కంట్రీ, లౌకిక వ్యవస్థలో మనం ఉన్నాము.

నిన్నా, మొన్నా కాకుండా ఎప్పటి నుండో 70, 80 సంవత్సరాల క్రిందట నుండి ఉన్నటువంటి వాళ్లను కూడా ఇప్పుడు ఖాళీ చేయమని అంటే అది కరెక్టు కాదని మా అభిప్రాయం. దాన్ని సెట్‌రైట్ చేయాల్సిందిగా కోరుతున్నాను.

ఈ సందర్భంగా మీకు ఒక ఉదాహరణ చెబుతున్నాను. గుంటూరులో మస్తానయ్య దర్గా అని ఉంది. ఆ మస్తానయ్య దర్గాకి ముస్లిం వ్యవస్థ అయినా కూడా దానికి ఉన్నటువంటి మేనేజింగ్ బోర్డు ఛైర్మన్ ఒక హిందువు. అందుచేత, ఈ దర్గాల వంటి వాటి దగ్గర ఈ హిందూ అనే దానికి ఇబ్బంది ఏమీ రాదు గానీ, షాపుల విషయానికి వచ్చేసరికి, అక్కడున్నటువంటి కొన్ని ల్యాండ్స్‌కు సంబంధించి ముస్లింలను ఖాళీ చేయమని నోటీసులిస్తున్నారు. దయచేసి, ఆ విషయాన్ని పరిశీలించాల్సిందిగా మీ ద్వారా మంత్రి గారిని కోరుతున్నాను.

MR.CHAIRMAN: Changal Rayudu garu, put last supplementary.

శ్రీ బి.చెంగల్ రాయుడుః వక్ఫ్‌బోర్డు ప్రాపర్టీస్‌కి సంబంధించి యాన్యువల్ అక్కౌంట్స్ తయారు చేస్తున్నారా? తయారుచేస్తే, స్టేట్ లెజిస్లేచర్‌కు ఏమన్నా సబ్మిట్ చేసేందుకు వీలుందా? వక్ఫ్‌బోర్డుకు సంబంధించిన యాన్యువల్ అక్కౌంట్స్ మీరు ప్రిపేర్ చేసే పరిస్థితి ఉంటే..

డా.పల్లె రఘునాథరెడ్డిః మళ్లీ ఒకసారి రిపీట్ చేయండి.

శ్రీ బి.చెంగల్ రాయుడుః వక్ఫ్‌బోర్డు యొక్క యాన్యువల్ బడ్జెట్ మీరు తయారు చేస్తున్నారా? అంటే యాన్యువల్ ఆడిట్ రిపోర్టు.. దాన్ని స్టేట్ లెజిస్లేచర్‌కు సబ్మిట్ చేసేలా సంబంధిత అధికారులకు డైరెక్షన్స్ ఇవ్వవలసిందిగా కోరుతున్నాను. అలాగే, పేపర్స్ లెయిడ్ కమిటీకి కూడా.

మిస్టర్ ఛైర్మన్ః అవన్నీ కమిటీలో డిస్కస్ చేయొచ్చు కదా?

శ్రీ బి. చెంగల్ రాయుడుః అధ్యక్షా, కమిటీలో కూడా డిస్కస్ చేసినదే మీకు చెబుతున్నాను.

MR.CHAIRMAN: However, this House is the supreme authority. No problem.

శ్రీ మహమ్మద్ అహ్మద్ షరీఫ్ః సార్, ఒక చిన్న క్లారిఫికేషన్. మంత్రి గారు మొత్తం బాధ్యతను సెంట్రల్ గవర్నమెంట్ మీద తోసేస్తున్నారు. సెంట్రల్ యాక్టు ఉంది. అది నేను కూడా ఒప్పుకుంటాను. కానీ, సెంట్రల్ అమెండ్‌మెంట్ ద్వారా సెంట్రల్ యాక్టు వచ్చింది. అయితే, పరిపాలనా సౌలభ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏ రకమైన నిర్ణయాలైనా తీసుకుని అమలుపరచవచ్చు. ఆ అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉంది. ఇది మొత్తం కేంద్ర ప్రభుత్వమే నిర్ణయించేందుకు అధికారం ఉంటే ఇక్కడ మంత్రివర్గం ఎందుకు, ఆఫీసులు ఎందుకు సార్? రాష్ట్ర ప్రభుత్వం ఆధీనంలో నడిచే వక్ఫ్‌బోర్డు సంస్థ ఇది. దీంట్లో కనీసం ముస్లింలకు ప్రాధాన్యత కల్పించాలనే ఒక ఆలోచన చేయమని ప్రభుత్వాన్ని అడిగితే, నేను సెంట్రల్

గవర్నమెంట్‌కు రాస్తామని అంటే ఇదెక్కడి న్యాయం? ఇది పద్ధతి కాదు. సెంట్రల్ గవర్నమెంట్ యాక్టుని నేను ఒప్పుకుంటాను. కానీ, పరిపాలనా సౌలభ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏ నిర్ణయమైనా తీసుకునేందుకు వారికి అధికారముందనేది మంత్రి గారు గుర్తించాల్సిందిగా మనవి చేస్తున్నాను.

డా. పల్లె రఘునాథరెడ్డిః అధ్యక్షా, గౌరవ సభ్యులు శ్రీ మహమ్మద్ అహ్మద్ షరీఫ్ గారు చెప్పిన విషయాన్ని తప్పకుండా పరిశీలిస్తాము. ఆయన్ని కూడా మీటింగ్‌కి పిలుస్తాము. ఆయన చెప్పిన సూచనల్ని తప్పకుండా పరిగణనలోకి తీసుకుంటాము. మైనారిటీ శాఖా మంత్రిగా ఈ రాష్ట్రంలో ఉండే 50 లక్షల మంది ముస్లింలకు మేలు జరుగుతుందంటే, వాళ్లకంటే ఎక్కువ సంతోషపడే వాళ్లలో మొట్టమొదటి వాడిని నేను. ఆయన సజెషన్ తప్పకుండా తీసుకుంటాము, ఆయన్ని ఇన్‌వాల్వ్ చేస్తాము. ఐఏఎస్ ఆఫీసర్లు, ఐపిఎస్ ఆఫీసర్లతో మీటింగ్ ఏర్పాటు చేసి, what best we can do from the Government side to the Muslim community, definitely we can extend the full support.

తరువాత, సోదరులు శ్రీ సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి గారు మాట్లాడుతూ కసునూరు దర్గా హుండీ గురించి మాట్లాడటం జరిగింది. ఈ రాష్ట్రంలో ఉండేటటువంటి దర్గాల్లో వచ్చే అమౌంట్ మొత్తం రెగ్యులరైజ్ చేయాలనే ఆలోచనతో ప్రభుత్వం ఉంది. ఒకవేళ వక్ఫ్‌బోర్డులో యాడ్ అయినా కూడా ఆ దర్గాకు సంబంధించి ఎంత అమౌంట్ ఇవ్వాలో, అంత అమౌంట్ శాంక్షన్ చేస్తాము. దాన్ని వేరే విధంగా భావించవలసిన అవసరం లేదు. ఎందుకంటే, హుండీల ద్వారా వచ్చే డబ్బుని ఒకచోట పూలప్ చేసి, ఎక్కడ ఎక్సెస్ అయితే అక్కడ నుండి వీక్‌గా ఉన్నచోట్ల డిస్ట్రిబ్యూట్ చేయాల్సి వస్తుంది కాబట్టి రెగ్యులరైజ్ చేయాలి.

అలాగే, సభ్యులు శ్రీ చెంగల్ రాయుడు గారు చెప్పినట్లు ఆదాయవ్యయాలన్నింటినీ కూడా ఆడిటింగ్ చేసే ప్రయత్నం చేస్తాము. ఇంతకుముందు కూడా ఉన్నాయి. ఇంకా దాన్ని మోడ్రనైజ్ చేసి, దాంట్లోని లోపాలు కూడా సవరించి ఈ దర్గాలన్నింటినీ రెగ్యులరైజ్ చేయాలని భావిస్తున్నాము.

శ్రీ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిః ఆక్షన్ తీసెయ్యండి. బాక్సులు పెట్టి, వాళ్లు వచ్చి హుండీల దగ్గర కర్రలు పట్టుకుని నిలబడటం, మైకులు పెట్టే పరిస్థితుల్లో భక్తులు ఇబ్బందిపడుతున్నారు. కాబట్టి, ఆక్షన్ తీసేసి వచ్చిన డబ్బు వచ్చినట్లుగా ఆ దర్గాల కోసం ఖర్చుపెట్టండి. తిరుమలలో హుండీల ద్వారా డబ్బు వస్తుంది. దానికేమీ ఆక్షన్ లేదు కదా? ఆ విధంగానే దర్గాల్లో కూడా పెట్టమని మంత్రి గారికి మీ ద్వారా విజ్ఞప్తి చేస్తున్నాను.

డా. పల్లె రఘునాథరెడ్డిః డెఫినెట్‌గా హుండీల్లో డబ్బులు వేయమని బెదిరించడం గానీ, లేదా, చెవులు పగిలిపోయేలా మైకులు ఉపయోగించడం గానీ ప్రతి ఒక్కరి దృష్టికి వచ్చింది. మైనారిటీ కమీషనర్ గారు కూడా ఇక్కడే ఉన్నారు. దాని మీద ఎంక్వైరీ చేయమని ఆదేశాలు జారీ చేసి, ఏ విధంగా చేస్తే బాగుంటుందో ఆ విధంగానే చేస్తాము. కాబట్టి, దర్గా కమిటీలను మార్చాలన్నారు, అది కూడా తప్పకుండా మారుస్తాము.

తరువాత పెద్దలు శ్రీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు గారు శ్రీశైలంకు సంబంధించి చాలా మంచి విషయం చెప్పారు. ఎందుకంటే 70, 80 సంవత్సరాల నుండి వాళ్లు అక్కడ ఉన్నారు కాబట్టి, దానికి సంబంధించిన యాక్టు ఏ విధంగా ఉంది అనేది చూడకుండా వేగ్‌గా చెప్పేందుకు వీలు లేదు. ఇది సున్నితమైన సమస్య కాబట్టి, ఏ విధంగా చేస్తే వాళ్లకు బెనిఫిట్ ఉంటుందో, ఆ విధంగా చేసేందుకు తప్పకుండా ఆలోచన చేస్తామని ఈ సందర్భంగా మనవి చేస్తున్నాను.

MR.CHAIRMAN: Now, it is already 11.05 a.m. We will go for Tea break. అజెండా చాలా పెద్దదిగా ఉంది. నారాయణ గారూ.. అజెండా చాలా పెద్దదిగా ఉంది కాబట్టి, ఇంతటితో ఆపేసి, we will go for tea break and then we will take up the remaining Agenda.

శ్రీ పి. నారాయణః నాకు సంబంధించిన ఒక్క ప్రశ్న కంప్లీట్ చేస్తాను సార్.

MR.CHAIRMAN: Then, I will call single name. Single supplementary only.

శ్రీ విటపు బాలసుబ్రహ్మణ్యం : మంత్రి గారు చెబుతానంటే చెప్పనివ్వండి సార్.

మిస్టర్ ఛైర్మన్ : వాళ్లు రెడీగా ఉంటే మనం కూడా రెడీగా ఉండాలి కదా. Agenda is also there. It is a long Agenda. Today, it is a very big and lengthy Agenda. One single supplementary with printed name only.

Next Question No.8579 (26) is postponed at the request of the Member Sri Kolagatla Veera Bhadra Swamy.

Now, Question No.8640 (27)

## రాజధాని కోసం సేకరించిన భూమి

ప్రశ్న నెం.8640 (27)
శ్రీ టి.డి.జనార్ధన్, ఎం.ఎల్.సి.,

గౌరవనీయులైన పురపాలక పరిపాలన & పట్టణాభివృద్ధి శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా?

అ) రాజధాని కోసం రైతుల నుండి భూమిని సేకరించినందున అట్టి రైతులకు ఎప్పటిలోగా భూమిని సమకూర్చడమవుతుంది ;
ఆ) భూముల అభివృద్ధి కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలేమిటి?

గౌరవనీయులైన పురపాలక పరిపాలన & పట్టణాభివృద్ధి శాఖ మంత్రివర్యులు (శ్రీ పి.నారాయణ):

అ) రాజధాని నగరం కోసం తుది బృహత్ ప్రణాళికన ప్రకటించిన తేదీ నుండి 195 రోజుల లోపు రైతులకు భూమిని సమకూర్చడమవుతుంది.

ఆ) బృహత్ ప్రణాళికను అనుసరించి మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడానికి అవసరమయిన చర్యలన్నింటిని రాష్ట్ర ప్రభుత్వం చేపడుతుంది.

శ్రీ పి.నారాయణ : అధ్యక్షా, రాజధాని కోసం తీసుకున్న భూముల్ని ఎప్పటిలోపు రైతులకు ఇస్తామని అడిగారు. డ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్ నోటిఫై చేసిన తరువాత సీఆర్‌డిఏ యాక్టు ప్రకారం 190 రోజుల్లోపల ప్లాట్స్‌కు సంబంధించి రైతులకు సర్టిఫికెట్స్ ఇవ్వడం జరుగుతుంది. ఎప్పటిలోపు సదుపాయాలు డెవలప్ చేస్తారని అడిగారు. మాస్టర్ ప్లాన్ పూర్తి అయిన తరువాత, ప్లాట్ ఎలాట్ చేసిన తరువాత వెంటనే సిఆర్‌డీఏ యాక్టు ప్రకారం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్ చేయడం జరుగుతుంది.

శ్రీ టి.డి. జనార్ధన్ (నామినేటెడ్): అధ్యక్షా, out of the Question. మీరొక మాట అన్నారు. మొదట్లో ఉన్న ప్రశ్నలన్నింటిపై ఎలాబరేటివ్‌గా డిస్కషన్‌కు టైమిచ్చి, మిగిలిన ప్రశ్నలను వాయిదా వేసేదానికంటే..

MR.CHAIRMAN: We will discuss in the Tea-break. Let’s use the valuable time of the House.

శ్రీ టి.డి. జనార్ధన్: అందరికీ సమాన ప్రాతినిధ్యం ఇవ్వాలని కోరుతున్నాను.

మిస్టర్ ఛైర్మన్: టీ బ్రేక్‌లో లీడర్ ఆఫ్ ది హౌస్ ఉంటారు, మినిస్టర్‌గారు ఉంటారు. We will sort out. There is no problem. You will be there. I will call you also. దాని గురించి ఇప్పుడెందుకు? మనం అన్ని ప్రశ్నలు పూర్తి చేయాలనుకుంటాము. కానీ, కథ మళ్లీ మొదటికే వస్తుంది.

శ్రీ టి.డి. జనార్ధన్: ఎందుకంటే, క్వశ్చన్ అవర్ చాలా ఇంపార్టెంటు కాబట్టి సార్.

మిస్టర్ ఛైర్మన్: క్వశ్చన్ అవర్ చాలా ఇంపార్టెంటు. అందుకే సింగిల్ సప్లిమెంటరీ అన్నాను. ఎవరైనా విన్నారా? నేను చెబుతాను. కానీ, పాటించడం కష్టం. అందుకే, ముందు మీరు పాటించి ఇతరులకు చెప్పాలని మహాత్మాగాంధీ గారు అన్నారు. వారిని చూస్తూనే గుర్తుకు వచ్చే విషయమది. Practise and ask them to follow. Practise and then teach. మన దగ్గర మాత్రం ఉల్టా ఉంది. నేను మిమ్మల్ని చేయమని చెబుతాను, కానీ నేను మాత్రం చేయను.

శ్రీ టి.డి.జనార్ధన్: అధ్యక్షా, మంత్రి గారు ఇప్పుడే చెప్పారు. డ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్ నోటిఫికేషన్ ఇచ్చిన తరువాత అన్నారు. నోటిఫికేషన్ ఎప్పుడు ఇవ్వాలనేది ఏమన్నా ప్లాన్ చేశారా? రెండవదేమంటే, ప్రపంచ చరిత్రలోనే ఎక్కడా లేని విధంగా 30,000 మంది రైతుల నుండి, వాళ్ల నమ్మకంతో ల్యాండ్ పూలింగ్ ప్రక్రియను చేపట్టడమనేది చూస్తే, ఈ ప్రాజెక్టులకు భూసేకరణలో ఒక కొత్త విధానాన్ని శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు రూపొందించారు. అందుకు వారిని, వారి మంత్రివర్గాన్ని అభినందించాలి. ఇదే పద్ధతి ఇతర

రాష్ట్రాల్లో, ఇతర దేశాల్లో కూడా అమలు చేయాలని ఆలోచిస్తున్నారు. అయితే, ఇంత నమ్మకంతో రైతులు భూమిని ఇచ్చారు గనుక వారికి అభివృద్ధి చేసిన భూములని, కావాల్సిన ప్లాట్లను అందజేయడంలో కూడా టైంబౌండ్‌గా అందజేస్తే ఇంకా మంచి పేరు వస్తుంది. అంతేకాకుండా, రాజధానికి కూడా ప్రజా రాజధాని అని పేరు పెట్టారు, దానికి సార్థకత ఉంటుందని తెలియజేస్తున్నాను.

ఉ. 11.10

డా. పి. నారాయణ : అధ్యక్షా, ఇరవై తొమ్మిది గ్రామాల ప్రజలు 33,000 ఎకరాలు ల్యాండ్ పూలింగ్ క్రింద ఇవ్వడం జరిగింది. ఈ విషయం రాష్ట్ర ప్రజలందరికీ తెలిసిన విషయమే. ఇది ఒక వినూత్న ప్రయోగం. అయితే రైతులకు డ్రాఫ్ట్ రూపంలో ఏదైతే ఇస్తామన్నామో దాన్ని ఇవ్వాలంటే డ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్‌ను నోటిఫై చేయాలి. అది రూల్ నెం.10(1) ప్రకారం రాబోయే పది,పదిహేను రోజుల్లో డ్రాఫ్ట్ ప్లాన్‌ని నోటిఫై చెయ్యడానికి ప్రయత్నిస్తున్నాము. తరువాత రూల్ నెం.10(2) ప్రకారం వారికి ఏమైనా అభ్యంతరాలు ఉన్నట్లయితే తెలియపరచడానికి 30 రోజుల సమయం ఇవ్వడం జరుగుతుంది. అదే విధంగా రూల్ నెం.10(3) ప్రకారం నిర్ణయం తీసుకుని వారి అభ్యంతరాలకు క్లారిఫికేషన్స్ ఇస్తాము. రూల్ నెం.10(4) లో ఫైనల్ మాస్టర్ ప్లాన్‌ని ప్రచురించడం జరుగుతుంది. దాని తరువాత రూల్ నెం. 11(2) ప్రకారం పెగ్ మార్కింగ్ జరుగుతుంది. తరువాత రూల్ నెం.11(3) ప్రకారం లాటరీ సిస్టమ్ ద్వారా వారికి ప్లాట్లు ఇవ్వడం జరుగుతుంది. రూల్ నెం.11(4) ప్రకారం వారికి ల్యాండ్ పూలింగ్ బోనస్ సర్టిఫికెట్ ఇవ్వడం జరుగుతుంది. దాని తరువాత రూల్ నెం.12(3) ప్రకారం ఒక ఏడాది లోపల basic road infrastructure ఏర్పాటు చేయడం జరుగుతుంది. రూల్ నెం.12(6) ప్రకారం మూడు ఏళ్లలోపు total infrastructure ఏర్పాటు చేయడం జరుగుతుంది. ఈ కార్యక్రమం అంతా ఒక ప్రణాళిక ప్రకారం చేయగలమని తెలియచేస్తున్నాను.

MR. CHAIRMAN: The next three questions i.e. Q.Nos. 8697 (28), 8723 (29) and 8669 (30) are postponed at the request of the Members.

Now, the House is adjourned for Tea Break for 15 Minutes.

(Then, the House adjourned at 11-12 a.m.)

ఉ. 11.40 & 11.50

(తేనీటి విరామానంతరం సభ ఉ. 11.47 ని.లకు పునః ప్రారంభమైంది.)

(గౌరవ అధ్యక్షులు అధ్యక్షస్థానం వహించారు)

Mr. CHAIRMAN: Now, Special Mentions.

## ( 3 ) ప్రత్యేక ప్రస్తావనలు:

శ్రీ ఎం.వి.యస్. శర్మ (పట్టభద్రుల నియోజకవర్గం, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం): అధ్యక్షా, గురజాడ అప్పారావు గారు మహా కవి, దార్శనికుడు. వారి శత వర్ధంతి సంవత్సరం ఈ సంవత్సరం. ఈ సందర్భంగా రాష్ట్రమంతటా కూడా ఆ ఉత్సవాలను

జరిపారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఉత్సవాలు జరిపింది. అయితే, ఈ సందర్భంగా నేను ఆయన జన్మస్థలం ఎస్. రాయవరం వెళ్లాను. అక్కడ ప్రజలందరూ కోరిందేమిటంటే.. ఆయన ఒక స్మృతి చిహ్నాన్ని అక్కడ నిర్మించాలని కోరారు. అక్కడ స్థలం కావాలంటే మేము చూపిస్తామని గ్రామస్తులు చెప్పారు. ప్రభుత్వం ఒక చిన్న స్థలం తీసుకొని మందిరం కట్టి ఆయన జ్ఞాపకార్థం అక్కడ ఆయన వ్రాసినటువంటి గ్రంథాలు కాని, ఆయన చరిత్రకు సంబంధించిన ఘట్టాలు కాని, పటాలు కాని మొదలైనవి పెడితే బాగుంటుంది. గురజాడ అంటే అభిమానం ఉన్న వారు ప్రపంచంలో అనేక ప్రాంతాలలో ఉన్నారు. కాని, ఆయన పుట్టిన ఊరుకి వస్తే అక్కడ ఆయనకు సంబంధించినవి ఏమీ లేవు. కాబట్టి ఒక స్మృతి చిహ్నం నిర్మించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని చెప్పి మీ ద్వారా కోరుతున్నాను. మన ఆర్థిక మంత్రి గారు కూడా ఆ ప్రాంతానికి చెందిన వారు కాబట్టి వారు పరిశీలించి తగు చర్యలు తీసుకుంటారని ఆశిస్తున్నాను.

శ్రీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు : అధ్యక్షా, ముస్లిం మైనార్టీస్ విషయంలో శ్రీశైలంలో షాపుల గురించి మెన్షన్ చేశాను. అక్కడ ఉన్న షాపులలో ముస్లిం మైనార్టీస్ 70, 80 సంవత్సరాల నుండి ఉన్నారు కాబట్టి వారిని తొలగించకుండా ఏ జీ.ఓలు వచ్చినా, తరువాత వచ్చినా కూడా రెట్రాస్పెక్టివ్ ఎఫెక్ట్ అనేది అనకుండా ప్రాస్పెక్టివ్ ఎఫెక్ట్ ఉండేలా చూసి వారిని తొలగించకుండా వాళ్లను కొనసాగించవలసిందిగా కోరుతున్నాను.

శ్రీమతి పమిడి శమంతకమణి : అధ్యక్షా, జిల్లాలోని చాలా హాస్టళ్లలో పిల్లలకు సరైన విధానంలో దుప్పట్లు, యూనిఫార్మ్స్ మొదలైనవి సరైన సమయంలో అందడం లేదు. ముఖ్యంగా అనంతపురం జిల్లా కరవు జిల్లా. ఈ మధ్య కాలంలో నేను మీకు పిటీషన్ ఇవ్వడం జరిగింది. అక్కడ ఉండే పిల్లలందరూ కూడా అక్కడ ఉన్న ట్రంకు పెట్టెలను ఏర్పాటు చేసుకొని చలిలో వాటి మీద పడుకోలేక ఇబ్బంది పడుతున్నారు. దయచేసి, మంత్రి గారిని పరిశీలించి, పర్యవేక్షించాలని కోరుతున్నాను. హాస్టల్ బిల్డింగులు చాలా శిథిలావస్థలో ఉన్నాయి. తక్షణమే వాటి మీద తగు చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా వారికి చలి కాలంలో దుప్పట్లు సక్రమంగా ఇవ్వవలసిందిగా కోరుతున్నాను.

శ్రీమతి కావలి ప్రతిభా భారతి (శాసనసభ నియోజకవర్గం): అధ్యక్షా, నేను ఇప్పుడు తమరి దృష్టికి తీసుకువచ్చే సబ్జెక్ట్ ఏమిటంటే.. గౌరవ మాజీ శాసన సభ్యులు, మాజీ కౌన్సిల్ సభ్యులు, కొంతమంది ప్రస్తుతం ఉన్న సభ్యులకు కూడా ప్రభుత్వం మెడిసిన్స్ ఇస్తోంది. ప్రభుత్వం ఇచ్చే మెడిసిన్స్ ఎం.ఎల్.ఏ క్వార్టర్స్‌లో ఉన్న డిస్పెన్సరీలో సక్రమంగా ఇవ్వడం లేదు. చాలామంది వృద్ధులున్నారు. వారికి డయాబిటిస్, హైపర్‌టెన్షన్ అలాగే, గుండె సమస్యలు ఉన్న సభ్యులు ఉన్నారు. అటువంటి వారికి రెగ్యులర్‌గా మంత్లీ ఇవ్వవలసిన మెడిసిన్స్ ఇవ్వకుండా కొన్ని ఇచ్చి, కొన్ని మానేసి, అలాగే అడిగినటువంటి మెడిసిన్స్ ఇవ్వకుండా మామూలు క్రోసిన్ లాంటివి కాని, లేదా డూప్లికేట్ మెడిసిన్స్ ఇస్తుంటే సభ్యులు చాలా ఇబ్బంది పడుతున్నారు. అలాగే, మాజీ సభ్యులు కూడా చాలా ఇబ్బంది పడుతున్నారు. దూర ప్రాంతాల నుండి వచ్చే వారు ఇక్కడకు వచ్చేసరికి మెడిసిన్స్ లేకపోతే ఇబ్బంది పడుతున్నారు. తక్షణమే దీని మీద తగు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని తమరి ద్వారా మనవి చేస్తున్నాను.

మిస్టర్ ఛైర్మన్ ః అర్థిక శాఖ మంత్రి గారిని ఉద్దేశించి... బడ్జెట్ సమస్య ఉన్నట్లున్నది. దాని గురించి చూడండి. డ్యూటీ డాక్టర్లు ఇక్కడకు వచ్చినప్పుడు బడ్జెట్ కేటాయించడం లేదని చెబుతున్నారు.

శ్రీ యనమల రామకృష్ణుడు ః అధ్యక్షా, గౌరవ సభ్యురాలు చెప్పిన అంశం మీద సమాచారం తెప్పిస్తాం. దీని వరకు బడ్జెట్ సమస్య ఏమీ ఉండదు. ఎందుకంటే.. మెంబర్స్‌కు ఇవ్వవలసిన మెడికల్ ఫెసిలిటీ కాబట్టి రూల్సు ప్రకారం ఇచ్చేటట్లు చూస్తాం. మాజీ సభ్యులకు కూడా ప్రొవిజన్ ఉంది కాబట్టి ఆ ప్రొవిజన్ ప్రకారం ఏర్పాటుచేయడానికి తగిన చర్యలు తీసుకుంటాం.

శ్రీ పిల్లి సుభాష్ చంద్రబోస్ (శాసనసభ నియోజకవర్గం) ః అధ్యక్షా, తూర్పు గోదావరి జిల్లాను కిరోసిన్ ఫ్రీ జిల్లాగా చేయాలని కేంద్ర ప్రభుత్వం జీ.ఓ జారీ చేసింది. అంటే.. ఇంకా ఎన్ని గ్యాస్ కనెక్షన్లు అవసరం ఉంది, మొత్తం అందరికి ఇవ్వాలని జీ.ఓ జారీ చేసింది. తూర్పు గోదావరి జిల్లాలో దాదాపు 15 లక్షల తెల్లకార్డులున్నాయి. 15 లక్షల తెల్లకార్డులుకు గాను 8.65 లక్షల మందికి గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. ఇంక ఇవ్వవలసినవి దాదాపు 6.35 లక్షల మందికి గ్యాస్ కనెక్షన్‌లు ఇవ్వాలి. మొత్తం అన్ని తెల్లకార్డులవారందరికి గ్యాస్ కనెక్షన్లు ఇస్తామని కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలను జారీ చేస్తే, రాష్ట్ర ప్రభుత్వం దీపం కనెక్షన్స్‌కు కూడా జన్మభూమి కమిటీల ఆమోదం కావాలని ఒక సర్క్యులర్ ఇచ్చారు. This is quite contradictory to the guidelines given by the Government of India. తక్షణం ఆ సర్క్యులర్‌ను విత్‌డ్రా చేయాలని కోరుతున్నాను. తూర్పు గోదావరి జిల్లాలో ఉన్న తెల్లకార్డుల వారందరికి ఇస్తామని కేంద్ర ప్రభుత్వం అంటుంటే మరల ఈ విధంగా జన్మభూమి కమిటీల ఆమోదం కావాలని అనడం అనేది అన్యాయం. తూర్పు గోదావరి జిల్లాను కిరోసిన్ ఫ్రీ జిల్లాగా చేయాలని కేంద్ర ప్రభుత్వం ఒక ప్రక్కన ఆదేశాలు ఇస్తుంటే మాకు వద్దు బాబోయ్ అని అనడం ఏ మాత్రం సమంజసం కాదు. దయచేసి, వెంటనే ఆ సర్క్యులర్‌ను విత్‌డ్రా చేయవలసిందిగా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

శ్రీ ఆదిరెడ్డి అప్పారావు (శాసనసభ నియోజకవర్గం)ః అధ్యక్షా, దేవాదాయ శాఖలో చాలామంది ఉద్యోగస్తులకు ప్రమోషన్లు వచ్చే అవకాశం ఉన్నా, అర్హత ఉన్నటువంటి ఉద్యోగులకు ఇంతవరకు కూడా ప్రమోషన్లు ఇవ్వకుండా ఆపు చేయడం జరుగుతోంది. వాళ్లు మొరపెట్టుకోగా డిపార్టుమెంటల్ ప్రమోషన్ కమిటీని కూడా వేయడం జరిగింది. కాని, ఆ కమిటీ ఇంతవరకు అర్హత ఉన్న ఉద్యోగులకు ప్రమోషన్లు ఇవ్వడానికి చర్యలు తీసుకోకుండా ఉండడమనేది సమంజసం కాదు. అందుకని, ఎవరైతే ప్రమోషన్లకు అర్హత కలిగి ఉన్నారో వారందరికి ప్రమోషన్లు ఇచ్చే విధంగా చేయాలని తమరి ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

శ్రీ మేకా శేషుబాబు (స్థానిక సంస్థలు, పశ్చిమగోదావరి)ః అధ్యక్షా, మొన్న కురిసిన అకాల వర్షాల వల్ల పశ్చిమ గోదావరి జిల్లాలో కాని, ఇతర జిల్లాలలో కాని 80 శాతం వరకు పంట నష్టం జరిగింది. దానికి సంబంధించినటువంటి ఇన్‌పుట్ సబ్సిడీ కాని, మిగతా ప్రయోజనాలు కాని రైతులకు ఎక్కడా కూడా ఇంతవరకు అందలేదు. వెంటనే అందించే

విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను. మరొకటి ఏమిటంటే.. రెండవ పంటకు నీటి గురించి రైతులు ఇబ్బంది పడే పరిస్థితి ఉంది. తొందరగా నారుమళ్ళు వేసుకోమని ప్రభుత్వం చెబుతోంది. అక్కడ కెనాల్స్‌లో నీటిని వదలకపోవడం వల్ల రైతులందరూ ఇబ్బంది పడుతున్నారు. రెండవ పంటకు ఎంతవరకు నీరు అందిస్తారనే విషయాన్ని ప్రభుత్వం రైతులందరికి తెలియజేయాలని మీ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

MR. CHAIRMAN: Presentation of Petitions.

## (4) అర్జీ సమర్పణ :

డా. బచల పుల్లయ్యః అధ్యక్షా, కడప జిల్లా IIIT కళాశాలకు సంబంధించిన అంశం ఇది. కళాశాలల్లో ఉన్నటువంటి లెక్చరర్లను ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు అని పిలవబడాలి. కాని, అక్కడ అటువంటి designations ఏమీ లేకుండా కేవలం లెక్చరర్ అని పిలుస్తున్నారు.

రెండవ అంశం ఏమిటంటే.. అక్కడ ఉన్నటువంటి ఉద్యోగులందరికి 25 శాతం ఐ.ఆర్ ఇవ్వడం జరిగింది. కేవలం ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేసే అధ్యాపకులకు మాత్రం ఇవ్వడం లేదు. మిగతా వారందరికి ఇస్తున్నారు. అదే విధంగా, కేడర్ల వారీగా క్వార్టర్ల కేటాయింపు జరపవలసి ఉన్నా ఆ విధంగా కేటాయించడం లేదు. ఈ అంశాలను తమరికి పిటీషన్ ద్వారా సమర్పిస్తున్నాను.

(పిటీషన్‌ను గౌరవ ఛైర్మన్‌కు అందజేశారు)

MR. CHAIRMAN: Item No.II. All the papers listed in the Agenda are deemed to have been laid on the Table of the House.

## ( 5 )PAPERS LAID ON THE TABLE:

1. A copy in each of the 2nd, 3rd and 4th Annual Reports of the Vizag Apparel Park for Export, for the Years, 2005-06, 2006-07 and 2007-08 respectively, as required under Section 619-A(3) of the Companies Act, 1956, along with the reasons for delay.

## (6 ) డా. బి.ఆర్. అంబేద్కర్ 125వ వార్షికోత్సవంపై ప్రసంగం కొనసాగింపు :

శ్రీమతి పమిడి శమంతకమణి : అధ్యక్షా, భారతరత్న డా. బి.ఆర్. అంబేద్కర్ గారి 125 వ జన్మదిన వేడుకల సందర్భంగా ఈ సభలో మాట్లాడానికి నాకు అవకాశం ఇచ్చినందుకు ముందుగా మీకు ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను.

అధ్యక్షా, డా. బి.ఆర్. అంబేద్కర్ వంటి మహోన్నత వ్యక్తి గురించి మాట్లాడడం ఎంతవరకైనా, ఎంతమంది మాట్లాడినా, ఇంకా ఆయన కీర్తిప్రతిష్టలు మిగిలే ఉంటాయేమోననిపిస్తోంది. ఆ మహానుభావుడు నిమ్నజాతులలో పుట్టి ఒక శిఖరాగ్రాన్ని

ఎక్కారు.  ఆయన కీర్తి నలుదిశలా వ్యాపించిందంటే ఆయన చిన్న నాటి లేత హృదయానికి తగిలిన గాయమే దీనికంతటికి మూల కారణమని నేను అనుకుంటున్నాను. ఆ రోజులలో కుల రుగ్మతతో ఉన్న సమాజంలో ఆ చిన్న పసి ప్రాయంలో ఆయన ఎదుర్కొన్న అనేక దాడులైతేనేమి, అనేక హింసలైతేనేమి, కుల వివక్షణా పరిజ్ఞానంతో ఆరోజు  సమాజంలో ఉన్న పెద్దలు ఆయన మీద చూపినవన్నీ కూడా ఆయనలో ఒక కసిని పెంచింది. ఏ నాటికైనా నేను ఒక వ్యక్తిగా ఎదగాలి. ఈ యొక్క సమాజంలో ఉన్న కుల వివక్షణను, అంటరానితనాన్ని నిర్మూలన చేయాలని ఆనాడే ఆయన మనస్సులో లిఖించబడింది కాబట్టే ఎన్ని ఒడుదుడుకులున్నా, ఎన్ని దాడులు జరిగినా, సమాజంలో తాను ప్రత్యక్షంగా ఎన్ని చూసినా అవన్నీ కూడా ఆ  మనస్సులో లిఖింపబడ్డాయి కాబట్టే ఎత్తు పల్లాలను అనుభవిస్తూ, ఒక మహోన్నత వ్యక్తిగా ఎదగడం జరిగింది. ముఖ్యంగా,  సమీకరించు, బోధించు, ఉద్యమించు అనే మూడు సూత్రాలను ఆయన మన యువత ముందుంచారు. ఈనాడు మనం గమనిస్తే, నలుగురు మనుష్యులను వేసుకొని జిందాబాద్ అనగానే ఆ వ్యక్తి ఒక నాయకుడైనట్లు ప్రవర్తిస్తారు. ఏదైనా ఒక సమస్య ఉంటే ఆ సమాజంలో ఉన్న వారిని ముందుగా సమీకరించు, ఆ సమస్య గురించి వారికి  బోధించు తరువాత నీవు ఉద్యమించు అప్పుడే నీకు మంచి ఫలితాలు దక్కుతాయి కాని, ఊరికే అనవసరంగా కేకలు వేయడం కాదు, మాట్లాడడం కాదని ఆయన తొలి పాఠం మన యువతకు నేర్పించడం జరిగింది. ముఖ్యంగా, ఆయన మేదస్సును మనం ఒకసారి గమనించినట్లయితే, ఆనాటి పార్లమెంట్‌లో మేధావులున్నారు. రాజకీయ దురంధరలున్నారు. అంతమంది ఉన్నా కూడా అయన మేదస్సును గమనించిన మహానుభావులు రాజ్యాంగ రచనను ఆయనకు అప్పచెప్పారంటే ఆయన మేదస్సును మనమందరమూ కీర్తించవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఆ రోజుల్లో కూడా ఆయన అంత ఉన్నత స్థితికి వచ్చినా సమాజంలో అంటరానితనమనేది, కుల వివక్షణ అనేది ఉంది. కాని, వాటన్నింటిని పెద్దలు గమనించలేదు. ఆయన మేధస్సును గమనించిన మహానుభావులందరూ కూడా రాజ్యాంగాన్ని నీవు రచించు, నీ ద్వారానే ఆ రాజ్యాంగాన్ని ఏర్పాటుచేయమని అంటే.. నిజంగా ఆయన అమర జీవుడని నేను చెబుతాను. ఈ రోజుకు కూడా ఆయన లిఖించిన రాజ్యాంగం ఆధారంగానే ప్రభుత్వాలు నడుస్తున్నాయి. నడిపింపబడుతున్నాయి. ప్రజలందరూ కూడా ఆయన చెక్కిన  రాజ్యాంగం ఫలితాలను ఈరోజు అనుభవిస్తున్నారు.

మ.12.00

అధ్యక్షా, ఏ కోణంలో చూసినా ఆయన డాక్టరేట్ అని చెప్పవచ్చు. రాజ్యాంగ పరంగా, ఆర్థిక శాస్త్ర పరంగా, సమసమాజ స్థాపన విషయంలో, సాంఘిక వ్యవస్థ విషయంలో కూడా ఆయన డాక్టరేట్ అని చెప్పవచ్చు. చిన్ననాటి గాయాన్ని మనసులో ఉంచుకుని భవిష్యత్తులో  ఈ విధంగా నిమ్న జాతులకు రిజర్వేషన్ అనే విధానాన్ని ఏర్పాటు చేస్తే తప్ప తన వారసులు సమాజంలో పౌరులుగా మనుగడ సాగించలేరని భవిష్యత్ తరాలకు మార్గాన్ని  ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో రాజ్యాంగాన్ని, చట్టాన్ని ఏర్పాటు చేసి నిమ్నజాతుల వారికి రిజర్వేషన్ ఏర్పాటు చేశారు కాబట్టే, మాలాంటి వారమందరం కూడా ఈ రోజు ఈ చట్ట సభలలో ఉండేందుకు వీలవుతున్నది. లేకుంటే, మా పరిస్థితి ఏ విధంగా ఉండేదో తెలియడం లేదు. ఈనాడు చాలామంది రిజర్వేషన్ తీసెయ్యాలి, ఇంక చాలు, ఎన్ని సంవత్సరాలైంది, ఇంకా

ఎందుకు, ఐఎఎస్ చదువుతున్న పిల్లలకు, ఐఎఎస్ చదివిన వారి పిల్లలకు, ఐపిఎస్ చదివిన వారి పిల్లలకు రిజర్వేషన్ ఎందుకు ఉండాలి అని అంటున్నారు. ఐఎఎస్, ఐపిఎస్ చదవాలంటే ఆ పిల్లవాడు రోజుకు 18 గంటలు కష్టపడి చదవాలి. తన మేధ ఉపయోగించి సివిల్స్ వ్రాయాలి, ఇంటర్వ్యూకి అంటెండ్ కావాలి, చదువుకునే ఆ స్థాయికి చేరుకోవాల్సిందే గానీ, ఈ రిజర్వేషన్ల ద్వారా కాదని నేను ఈ సందర్భంగా మనవిచేస్తున్నాను. ఈ సభలో ఉన్నటువంటి సాంఘిక సంక్షేమ శాఖా మంత్రిగారు ఐఆర్ఎస్ పాసయ్యారు. తాను చదువుకొని సివిల్స్ పాసై అందులో మార్కులు తెచ్చుకున్న తరువాతనే ఆయన ఐఆర్ఎస్ అయ్యారు. కాబట్టి ఈ రిజర్వేషన్ విధానం ఇంకా కొనసాగాలని నేను మీ ద్వారా మనవిచేస్తున్నాను. రాజ్యాంగం రచించే బాధ్యతను ఆయనకు అప్పజెప్పినప్పుడు ఆయన ఇంట్లో కూర్చుని రాయలేదు. అనేక దేశ విదేశాలు పర్యటించారు. ఆయా దేశాలు వారి వారి రాజ్యాంగం ప్రకారం ఏ విధంగా నడుస్తున్నాయో గమనించారు. ఆయా దేశాల వారు వివిధ సంక్షేమ కార్యక్రమాలను ఏ విధంగా చేపట్టారో, ప్రజలను అభివృద్ధి మార్గంవైపు ఏ విధంగా నడిపిస్తున్నారో పరిశీలించి, ఆయా దేశాల రాజ్యాంగాలను, చట్టాలను కూలంకషంగా అధ్యయనం చేసిన తరువాతనే మన దేశ రాజ్యాంగాన్ని వ్రాశారు. 2 సంవత్సరాల 11 నెలల 18 రోజులలో రాజ్యాంగాన్ని వ్రాశారని ఈనాడు మనం అనుకుంటున్నాము కానీ, ఆ రెండు సంవత్సరాలు ఆయన ఏకలవ్యుడిగా శ్రమపడి వ్రాశారు కాబట్టే ఈనాడు మన రాజ్యాంగాన్ని పవిత్ర గ్రంథంగా పేర్కొంటున్నాము. భూత భవిష్యత్ వర్తమాన కాలాల్లో మనం ఏ విధంగా చట్టాలు చేయాలి, ప్రభుత్వాన్ని ఏ విధంగా నడపాలి, ఏ విధంగా పేద ప్రజల అభ్యున్నతికి తోడ్పడాలనే విధానాలు అనేకం అందులో లిఖించబడ్డాయి కాబట్టే, మన రాజ్యాంగం పవిత్ర గ్రంథంగా తయారయింది. ఆయన చేసిన విధానాల వల్లనే నిమ్న జాతులకు ఆయన ఆరాధ్యదైవమయ్యారు. ఆయన లేకుంటే ఈనాటికీ నిమ్న జాతులవారు అలాగే ఉండేవారేమో!

మహిళా చట్టాన్ని తీసుకురావడానికి కారణం కూడా ఆయనే అధ్యక్షా! జనాభాలో సగభాగం ఉన్న మహిళలకు ఆయన చూపిన విధానం వల్లనే ఈరోజున ఇంతమంది మహిళలం చట్టసభలలో కూర్చోవడానికి అవకాశమేర్పడింది. నేడు ఏ దేశంలో చూసినా ఆయన చూపిన విధానాలనే కొనియాడుతున్నారు. ఈనాడు కేవలం ఒక వారం రోజులు ఆయన విగ్రహాలకు రంగులు వేసి, పూలదండలు వేసి, కార్యక్రమాలు జరిపి చేతులు దులుపుకున్నంత మాత్రాన ఆయనకు నివాళులర్పించినట్లు కాదు. కీ.శే. శ్రీ ఎన్.టి. రామారావు గారు డా. బి.ఆర్. అంబేద్కర్ గారిని స్ఫూర్తిగా తీసుకుని మహిళలకు అనేక అనేక సంక్షేమ కార్యక్రమాలను చేపట్టారు. శ్రీ ఎన్.టి. రామారావు గారి కాలంలో దళిత యువకులకు భారీ వాహనాలకు లైసెన్సులను ఇచ్చి వారిని ప్రోత్సహించారు. లారీలు, eichers, tankers వంటివాటికి లైసెన్సులు ఇచ్చారు. Economically backward గా ఉన్నవారికి economically equality ఉంటే తప్ప Social equality రాదనే మంచి ఉద్దేశంతో లక్షల కొలది రూపాయలు ఖర్చయినా కూడా SFDC ద్వారా ఆయన ఇవ్వడం జరిగింది. అనేకమంది పేద దళిత యువతీ యువకులు శ్రీ ఎన్.టి.రామారావు గారి ప్రభుత్వ హయాంలో లబ్ధి పొందారు. కానీ, తరువాత అవన్నీ కూడా బినామీలకింద మారిపోయాయి. ఏ లబ్ధిదారునికైతే చేరాలో, ఏ లబ్ధిదారులు వాటి ద్వారా అభివృద్ధి చెందాలో అవి మాయమైపోయాయి. కొన్ని ప్రభుత్వాలు మేం ఎంతో చేశామని

చెబుతున్నాయి. లక్ష రూపాయలు ఇచ్చినంత మాత్రాన ఒకరిని మనం పైకి తీసుకురాగలమా? రాష్ట్రంలో ఈనాడు ఒక్క మేజర్ ఇండస్ట్రీ అయినా ఏ ఒక్క దళితునికైనా ఉందా? పాతసామాన్లకు కొత్తసామాన్లు అని, బక్కెట్లు, ప్లాస్టిక్ బిందెలు, విరిగిపోయిన వాటిని రిపేరు చేసేవి ఉన్నాయి తప్ప మా దళితులకు మేజర్ ఇండస్ట్రీ ఇచ్చే విధానంలో ఎవరైనా ఉన్నారా? నా జాతి పిల్లలు చదువుకోలేదా, నా జాతి పిల్లలు మేధావులు కారా? నా జాతి పిల్లల్లో ఇండస్ట్రీలు నడిపేవారు లేరా? ఉన్నారు అధ్యక్షా. వారికి కావలసిన విధానాలలో ప్రభుత్వాలు చేయూతనిచ్చి వారిని పైకి తీసుకువచ్చి, బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పిస్తే, వారు కూడా సమాజంలో గొప్ప ఇండస్ట్రియలిస్ట్‌లుగా మారతారు. లక్ష రూపాయల చొప్పున ఇంతమందికి ఇన్ని ఆటోలు ఇచ్చామని నిన్న మంత్రిగారు ప్రకటించారు. బి.ఎ. చదివిన విద్యార్థి ఈనాడు ఆటోడ్రైవర్‌గా ఉంటున్నాడు. ఈ పరిస్థితి మారాల్సిన అవసరం ఉంది. మనం మారాలి. సమాజం మారాలి. మన మనోభావాలు మారినప్పుడే సమసమాజం అవుతుంది. మైక్ పట్టుకుని సమసమాజం రావాలి అందరూ పైకి రావాలని మాట్లాడడం కాదు. ప్రాక్టికల్‌గా ఆలోచించాలి. నిమ్న జాతివారైనా, ఏ జాతి వారైనా కానీ ఈ సమాజంలో సమాన పౌరులే. ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ విధానాలు లభించే విధంగా ఆలోచించాలి. అప్పుడే డా.బి. ఆర్. అంబేద్కర్ గారికి నిజమైన నివాళులర్పించినట్లు అవుతుంది.

MR. CHIARMAN : Rest of the speakers చాలామంది ఉన్నారు. కాబట్టి ఈరోజు అంబేద్కర్ గారి అంశంపై మాట్లాడి ముగిద్దాము. Next item we will take up.

మ. 12.10

శ్రీ యనమల రామకృష్ణుడు: అధ్యక్షా, డెమోక్రటిక్ సిస్టమ్‌లో House importance అనేది ప్రతిపక్షంపైనే ఎక్కువగా ఆధారపడి ఉంటుంది. రామచంద్రయ్య గారు ఓ.కె. అంటే అందరూ ఓ.కె., నో ప్రాబ్లం.

శ్రీ సి.రామచంద్రయ్య (శాసనసభ నియోజకవర్గం): అధ్యక్షా, ఒక లీడర్‌గా ఆయన నాకు లేని గౌరవం ఇస్తున్నారు. నిన్న ఏమన్నారంటే, గవర్నమెంట్ నడుపుతుందని అన్నారు. నేను మళ్లీ రెక్టిఫై చేస్తున్నాను. నేను లోక్‌సభకు ఫోన్‌చేసి కూడా కనుక్కున్నాను. ఇక్కడ జరిగే deliberations అన్నీ Presiding Officer అనుమతితోనే జరగాలి. Thank you Sir.

సార్, సభలో నేడు బ్రహ్మాండమైన ప్రసంగం చేస్తున్నందుకు నేను మాసోదరిని అభినందిస్తున్నాను. ఆమెకు కొంచెం ఎక్కువ సమయం ఇవ్వండి.

మిస్టర్ ఛైర్మన్: ఆ అంశాన్ని సోమవారం టేకప్ చేద్దాము.

శ్రీ ఉమ్మారెడ్డి వేంకటేశ్వర్లు: అధ్యక్షా, బిల్లులు కూడా చాలా ఉన్నాయి. సభను సాయంత్రం కూడా నడిపితే తప్ప పూర్తి కావు.

శ్రీ యనమల రామకృష్ణుడు: అధ్యక్షా, సోమవారం రోజు బిల్లులు ఆ సభలో పాసైన తర్వాత సోమవారం రాత్రికి ఈ సభకు వస్తాయి. మంగళవారం సాయంత్రం కూడా సభను నడిపించి ఈ సభలో బిల్లులను పాస్ చేసుకుందాము.

శ్రీ ఉమ్మారెడ్డి వేంకటేశ్వర్లు: అధ్యక్షా, నిత్యావసర వస్తువులు, కాల్‌మనీపై స్టేట్‌మెంట్ లాంటి పెండింగ్‌లో ఉన్న అంశాలను సోమవారం సాయంత్రం కూడా సభను నిర్వహించి చేసుకుంటే కొన్ని అంశాలపై చర్చ పూర్తవుతుంది. మంగళవారం బిల్లులపై చర్చను చేపట్టవచ్చు. అందువల్ల సోమవారం మరియు మంగళవారం నాడు కూడా సభను సాయంత్రం కూడా నిర్వహించండి.

SRI YANAMALA RAMAKRISHNUDU: Whatever decision is taken in the BAC, that can be followed.

శ్రీ సి.రామచంద్రయ్య: అధ్యక్షా, మా వల్ల ప్రభుత్వానికి ఎటువంటి ఇబ్బంది ఉండదు. సభలో ఎంత చర్చించాలో అంత చర్చిద్దాము.

శ్రీ యనమల రామకృష్ణుడు: అధ్యక్షా, రామచంద్రయ్య గారు ఇబ్బంది పెట్టినా మేము ఇబ్బందిపడము. అవసరమైతే సోమవారం సాయంత్రం కూడా సభను నడుపుకోవచ్చు. నో ప్రాబ్లం.

మిస్టర్ ఛైర్మన్: చూద్దాము లెండి.

శ్రీమతి పమిడి శమంతకమణి: అధ్యక్షా, ప్రభుత్వాలు కూడా ఆలోచించవలసిన అవసరం ఎంతైనా ఉంది. గతంలో శ్రీ చంద్రబాబు నాయుడు గారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అంటరానితనం ఇంకా సమాజంలో ఉందనే ఉద్దేశ్యంతో ఒక కమీషన్‌ను నియమించి ఆ కమిటీకి ఛైర్మన్‌గా హైకోర్టు మాజీ జడ్జి శ్రీ పున్నయ్యగారిని నియమించి రాష్ట్రమంతటా పర్యటించి హోటళ్లలో రెండు గ్లాసుల విధానాన్ని గమనించి దానిపై ఒక నివేదికను సమర్పించాలని ఆయనను రాష్ట్రంలో అన్ని జిల్లాలకు పంపించడం జరిగింది. ఆయన జిల్లాలకు వచ్చి ఎక్కడో గెస్ట్‌హౌస్‌లో ఉండకుండా మారుమూల గ్రామాలలో కూడా పర్యటించి అక్కడున్న హోటళ్లలో రెండు గ్లాసుల విధానం ఉన్నదా, లేదా పరిశీలించి ప్రభుత్వానికి ఒక నివేదికను ఆయన సమర్పించడం జరిగింది. ఆ నివేదికను ఒకసారి గమనిస్తే, 69 సంవత్సరాల క్రితం కొందరికి మాత్రమే స్వాతంత్ర్యం వచ్చిందేమోగానీ మారుమూల గ్రామాల్లో ఉన్న నిమ్నజాతులకు ఈనాటికి కూడా స్వాతంత్ర్యం అనేది రాలేదేమోనని నేను భావిస్తున్నాను.

అధ్యక్షా, దళితులు వివాహాది శుభకార్యములు చేసుకుంటే ఊరేగింపు ఊరిలో జరగడానికి వీలులేదు. ఉత్సాహంతో వారు ఊరేగింపు చేసుకోవడానికి వారికి కొన్ని పల్లెల్లో ప్రవేశమే లేదు. ఎందుకని అంటే, దేవాలయం ఆ వీధిలో ఉన్నది కాబట్టి దళితులు అక్కడ

ఊరేగింపు చేసుకోకూడదని అంటున్నారు.  దేవుడనే వాడు గుడిలో ఉంటాడు కానీ వీధిలో ఉండడు కదా?  దేవాలయం ఉన్న వీధిలో ప్రవేశించడానికి కూడా నా జాతికి స్వాతంత్ర్యం లేదంటే ఇంకా ఎక్కడుంది? ఆనాడు శ్రీ చంద్రబాబునాయుడు గారు స్వర్గీయ శ్రీ బాలయోగి గారిని లోక్‌సభ స్పీకర్‌గా, శ్రీమతి ప్రతిభా భారతి గారిని శాసనసభ స్పీకర్‌గా చేయడం జరిగింది.  కనుక ముందుగా ప్రభుత్వాల ఆలోచనా విధానం మారాలి, ప్రభుత్వ విధానాలు మారాలి, చట్టాలు మారాలి. ఎస్సీ కార్పోరేషన్  మరియు ఇతర పథకాల ద్వారా నిధులను అసలైన లబ్దిదారులకు అందేవిధంగా చేయాలి. అక్కడ కూడా మాకు న్యాయం జరగడం లేదు.

నేడు నేను ప్రతి ఒక్కరినీ ప్రశ్నిస్తున్నాను. నేడు ఒక ఎస్సీ ప్రజా ప్రతినిధికి స్వంతంగా ఇన్ని లోన్లు మంజూరు చేసే వీలుందా?  ఇంతమందికి పెన్షన్లు ఇవ్వడానికి వీలుందా? చివరికి అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లను నియమించడానికి కూడా  మాకు అవకాశం లేదు. ఏదైనా అంటే, మాపై అవినీతి ముద్ర వేయడం జరుగుతోంది. మేము ఒక పట్టుచీర కట్టుకోవడానికి కూడా యోగ్యత లేదా?  మేము ఒక పట్టుచీర కట్టినా అవినీతి అని అంటున్నారు. కాబట్టి ముందు మనం మారి పది మందికి మార్గదర్శకంగా ఉండాలి. చట్టసభలను చూస్తుంటే ఈనాడు సమాజం తలవంచుకునే విధంగా ఉంది. చట్టబద్ధంగా, న్యాయబద్ధంగా, గౌరవప్రదంగా ఉండవలసిన చట్టసభలు నేడు అల్లరిచిల్లరగా మారి ఎటువంటి చట్టం చేసుకోవడానికి కూడా వీలులేకుండా ఉంది.  ఆనాడు మేము కూడా చట్టసభల్లో కొత్తగా శాసనసభ్యులుగా ఎన్నిక కావడం జరిగింది. ఆనాడు స్పీకర్‌గారంటే మాకు ఎంతో గౌరవం ఉండేది. ఆయన జీరో అవర్‌లో ప్రతి ఒక్క కొత్త శాసనసభ్యునికి పది నిమిషాలు సమయమిచ్చి మీ నియోజకవర్గంలో ఎటువంటి సమస్యలున్నాయో చెప్పాలని అనేవారు. ఆ రోజుల్లో చట్టం అంటే ఏమిటి, ప్రజా సమస్యలు అంటే ఏమిటి, ఏవిధంగా చట్టసభల్లో మాట్లాడాలని కొత్తగా ఎన్నికైన సభ్యులంతా నేర్చుకోవడం జరిగేది.  ముందుగా మనం నేర్చుకుని మార్గదర్శకునిగా సమాజంలోకి వెళితే బాగుంటుంది కానీ, ఇక్కడ అల్లరిచేసి అక్కడ సమాజంలోకి పోయి మాట్లాడితే ఏముంటుంది?  కాబట్టి  ముందుగా మన మనోభావాలు మారి, మనం మారి, సమాజాన్ని మనం మార్చగలిగినప్పుడే  ఆయనకు గొప్ప నివాళి అర్పించినట్లవుతుంది. ఆచంద్ర తారార్కం ఉన్నంతవరకూ ఆయన కీర్తి నలుమూలలా వ్యాపించి ఉంటుందని నేను భావిస్తూ, ఈ అవకాశం ఇచ్చిన తమరికి నా ధన్యవాదాలను తెలియజేస్తున్నాను.

మిస్టర్ ఛైర్మన్:  చట్టసభలకు ఉండే హోదాను ఎవ్వరూ తగ్గించలేరు, పెంచలేరు. ప్రతిసారి దానిగురించి మనం మాట్లాడుకోవడం బాగుండదు.

మ. 12.20

శ్రీమతి అంగూరి లక్ష్మీశివకుమారి (శాసనసభ నియోజకవర్గం): అధ్యక్షా, ముందుగా 'అందుకో దండాలు బాబా అంబేద్కరా, అంబరాన్నంటిన చుక్కల రూపంలో'.  మొన్న పార్లమెంట్‌లో ప్రధానమంత్రిగారు,  నిన్న శాసనసభలో గౌరవ ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడుగారు,  ఈరోజు తమరు డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్‌గారి గురించి ఒక

మంచి చర్చను పెట్టడంవల్ల మా దళితుల జీవితాలను, బడుగు బలహీన అట్టడుగు వర్గాలైన మా దళితుల కోరికలను తెలుసుకునే విధంగాను, వారికి న్యాయంచేయాలనే ఉద్దేశంతోను, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్‌గారి 125వ జయంతి వేడుకలు జరుపుకునే సందర్భంలో ఈ సభలో చర్చించడం ద్వారా మాకిచ్చినటువంటి ఈ అవకాశానికి ఛైర్మన్‌గారికి నా ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను.

అధ్యక్షా, నిన్న, మొన్న కూడా చాలామంది చాలా చక్కగా డాక్టర్ అంబేద్కర్‌గారి గురించి చర్చించారు. మా జిల్లాకు చెందిన బోసుగారు అంబేద్కర్‌గారి గురించి చాలా అద్భుతంగా చెప్పారు. అలాగే ఈరోజు మా సోదరి శమంతకమణిగారు కూడా చాలా వివరణ ఇచ్చారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్‌గారు అంబరాన్ని అంటి ఉన్నా ఆయన ఆశయాలను దళితులమైన మాకు ఎవరైతే అందిస్తారో వారిలో మాకు అంబేద్కర్‌గారే కనిపిస్తారు. మా జీవితాలు అలాంటివి. ఎవరైతే మాకు చిన్న మేలు చేస్తారో వారిని జీవితాంతం దైవంగా కొలుచుకు, జీవితాంతం ఋణపడి ఉంటామనే మాటతో, కట్టుబాటుతో దళితులమైన మేము చాలా వినయంగా, విధేయతగా ఈ రాష్ట్రంలో ఉన్నటువంటి పెద్దలను, అందర్నీ గౌరవించుకుంటూ ముందుకుపోయే విధంగా మా జీవితాలుంటాయి. అలాగే మా సమస్యలు పరిష్కరించుకునేవిధంగా అంబేద్కర్‌గారి చర్చలో మా దళితులకు ఇచ్చినటువంటి అవకాశానికి మరొకసారి గౌరవ ముఖ్యమంత్రివర్యులకు నా నమస్కారములు తెలియజేసుకుంటున్నాను.

నాకు తెలిసున్నంతవరకు మా జిల్లా నుండి బాలయోగిగారిని స్పీకర్‌గా పెట్టారు. అలాగే నేను పదవిలోకి వచ్చేసరికి ప్రతిభా భారతి గారి గురించి చాలాగొప్పగా విని ఉన్నాను. సభలో వారు ఎంతో చక్కగా మాట్లాడిన మాటలు విన్నాము. ఈరోజు మా ఎస్.సిలకు న్యాయం జరగాలనే ఉద్దేశంతో గౌరవ ముఖ్యమంత్రివర్యులు రావెల కిషోర్‌బాబుగారికి ఒక మంచి పదవిని ఇచ్చి మాకు అండగా నిలబెట్టినందుకు, ఈ గొప్ప ప్రాధాన్యతకు మేము ఈ ప్రభుత్వానికి ఋణపడి ఉంటాము.

అధ్యక్షా, అంబేద్కర్‌గారి గురించి చెప్పడానికి చాలా సమయం పడుతుంది. వీరి ఆశయాలు పూర్తిస్థాయిలో అమలుచేయడానికి ఒక విధానాన్ని రూపొందించాలి. కొన్నిచోట్ల చాలామంది ఎస్.సిలు, ఎస్.టిలకు అసలు ఇళ్ళులేని పరిస్థితి ఉంది. వర్షం వస్తే ఎక్కడుండాలో తెలియక, తినడానికి తిండికూడాలేని పరిస్థితిలో చాలాచోట్ల మారుమూల ప్రాంతాల్లో ఉన్నారు. గౌరవ మంత్రివర్యులుకూడా అక్కడి పరిస్థితిని చూశారు. చాలాచోట్ల మాట్లాడారు. అయితే, దళితులపేర్ల మీద ఇళ్ళు ఉన్నాయో లేదో చూడండి. దళితుల పేర్లమీద కాకుండా ఇతరులు స్కీములు పెట్టుకుని మంచి మంచి ఇళ్ళుకట్టుకుని కాపురాలు చేస్తున్నవారిని చాలామందిని ఈరోజు చూస్తున్నాము. మొన్ననే గౌరవ ముఖ్యమంత్రిగారు ప్రకటించిన రూ.2.75లక్షలకు ఇళ్ళ పథకంలో దళితులు దరఖాస్తులు పెట్టుకోవాలని చూస్తే అయ్యో మీకు ఇళ్ళు వచ్చేశాయి. ఇప్పుడు అవకాశం రాదని చెప్తున్నారు. ఎలా అధ్యక్షా? ఎలా ఉండాలి? ఇళ్ళెప్పుడు వస్తాయి? ఒక పెంకుటిల్లులో అయినా దళితులు ఉండడానికి అవకాశంలేదా? లేకపోతే ఒక మంచి ఇల్లు కట్టుకుని, పిల్లల్ని చదివించుకొని ఉండడానికి అవకాశంలేదా? ఇదేనా అంబేద్కర్‌గారి స్ఫూర్తి. ఇది

కాదు అధ్యక్షా. ప్రజలు మంచి ప్రభుత్వాన్ని ఎన్నుకున్నారు. ఈ ప్రభుత్వంద్వారా మంచి ఇళ్ళు కట్టుకుని వాటిలో నివసించేలాగా మార్గం చూపిస్తారని, ఆయన ఆశయం నెరవేరుస్తారని నేను మనవి చేసుకుంటున్నాను.

ముఖ్యంగా చాలాచోట్ల ఎస్.టిలు ఉన్నారు. మా ప్రత్తిపాడు నియోజకవర్గంలో కూడా ఎస్.టిలు ఉన్నారు. వారికి మంచినీళ్ళుకానీ, ఇళ్ళుకానీలేవు. అసలు కరెంటులేక చీకట్లో ఎక్కడో కొండలమీదకు వెళ్ళి అక్కడున్న తేనె, జిగురు లాంటివి సేకరించి, వాటిని అమ్ముకుని జీవనోపాధి చేసుకుంటున్నారు. ఆ చోటుకి వెళ్తే చాలా భయంకరమైన పరిస్థితి. ఆ పరిస్థితుల్లో మేమేం సమాధానం చెప్పాలో మాకైతే తెలియదు. చాలా ఘోరాతిఘోరమైన జీవితాల్లో ఈరోజు బడుగు, బలహీన వర్గాలవారున్నారు. దీనినంతటినీ నిర్మూలనచేస్తే నిజంగా అంబేద్కర్ గారు మాకు కనబడకపోయినా ఆయన రూపంలో అందర్నీ చూసుకునే భాగ్యం మాకు కలుగుతుందని ఆశపడుతున్నాము.

మొన్న మంత్రివర్యులు ఈనాడు దినపత్రికలో ఒక స్టేట్‌మెంట్ ఇచ్చారు. పేద దళితుల కుటుంబాలలో చాలామంది మహిళలు గల్ఫ్ దేశాలకు దుబాయి, కువాయింట్‌లాంటి చోట్లకు వలస వెళ్ళిపోతున్నారు. అక్కడేమో ఆడవాళ్ళు కష్టపడి డబ్బులు పంపిస్తుంటే ఇక్కడ మగవాళ్ళు జల్సా చేస్తున్నారు. ఈ దుర్లభమైనటువంటి జీవితం ఎందుకు? పిల్లలు ఒకచోట, భార్య ఒకచోట, భర్త ఒకచోట. ఇలాంటి జీవితాలు ఎప్పుడు మారతాయి మాకు. నేను మూడు, నాలుగుసార్లు దుబాయి వెళ్ళినప్పుడు తెలుగు మహిళలంతా వచ్చి పిల్లలక్కడ, మేమిక్కడ ఉంటూ, బ్రతకడానికి బతుకుతెరువులేక చాలా భయంకరమైన జీవితంలో ఉన్నామని మొరపెట్టుకున్నారు. చాలా ఏడుపు వచ్చింది. ఎంత ఘోరమంటే. ఇలాంటి పరిస్థితులు మనం అధిగమించలేమా? అంబేద్కర్ రచించినటువంటి రాజ్యాంగానికి స్ఫూర్తిగా మనం దీనిని అధిగమించలేమా? దీనిని అమలుచేయలేమా? ఆచరణలో పెట్టలేమా? అనే ఆలోచన చేస్తే తప్పనిసరిగా మాకైతే ఆశ ఉంది. ఎందుకంటే నిన్నా, మొన్నా ఈ చర్చ జరిగినప్పుడు ఈ రాష్ట్ర దళితులందరూ ఫోన్లుచేసి అబ్బా ఎంత భాగ్యం. ఎంత ఆనందం మనకు. మన దేవుడైనటువంటి డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్‌గారి గురించి చర్చ జరగడమంటే దేశంలోనే ఏ ముఖ్యమంత్రివర్యులూ కూడా పెట్టనటువంటి పరిస్థితిలో మన రాష్ట్రంలో ఈ గొప్ప చర్చను పెట్టడం చాలా ఆనందదాయకమని అంటున్నారు. వారి స్పందన చూస్తే చాలా ఆనందంగా ఉంది. ఈ ఆశయాలన్నింటినీ ముందుకు తీసుకెళ్ళే బాధ్యత ఈ ప్రభుత్వం మీద ఉంది. అలా చేస్తుందని మేము నమ్ముతున్నాము.

చంద్రన్న ఋణమేళా పెట్టారు. చాలా మంచి పథకమది. అయితే, గతంలో చాలా ప్రభుత్వాలు చేస్తున్నాయి కానీ ఎవరికీ కూడా ఋణాలు ఇవ్వని పరిస్థితిలో ఉండేది. ఆస్తులు, డిపాజిట్లు ఉంటేనే ఋణాలిస్తున్నారు. లక్షరూపాయల ఋణం ఇవ్వాలంటే ఇరవైవేలు డిపాజిట్ కట్టమంటున్నారు. ఎక్కడ్నించి తెచ్చి డిపాజిట్ కడతారు? టెన్త్, ఇంటర్మీడియట్, బి.ఏ, బి.టెక్, కనీసం మెడిసిన్ చదువుదామన్నా పేద దళితపిల్లలు ముందుకెళ్ళలేని పరిస్థితి. మరి ఇలాంటి పరిస్థితిలో చక్కటి రాజ్యాంగ స్ఫూర్తితో ముందుకు తీసుకెళ్ళాలని కోరుకుంటున్నాం.

అందమైన అమరావతిలో సుందరమైన నగరాన్ని కట్టే విధివిధానాల్లో మన రాష్ట్రం పనిచేస్తుంది. మన ముఖ్యమంత్రివర్యులు పనిచేస్తున్నారు. నా మనవి ఏమంటే కొంత స్థలాన్ని అక్కడ కేటాయించి డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్‌గారి విగ్రహాన్ని భారీ ఎత్తులో కట్టి ఒక మంచి మ్యూజియంను పార్కుగా చేయాలని కోరుతున్నాను.

శ్రీ వెంకట సతీష్‌కుమార్ రెడ్డి సింగారెడ్డి: ఇప్పటికే అక్కడ అనౌన్స్ చేశారు.

శ్రీమతి అంగూరి లక్ష్మీశివకుమారి: అధ్యక్షా, ఈ సందర్భంగా మన ముఖ్యమంత్రివర్యులకు ఈ రాష్ట్ర దళితులందరి తరఫున కూడా ప్రత్యేక అభినందనలు తెలియజేసుకుంటున్నాము. అలాగే ఎస్.సిలకు ఋణాలు ఇవ్వడానికి కనీసం జిల్లాకు ఒక్కటైనా ప్రత్యేక బ్యాంకులను ఏర్పాటుచేయడం, ఎక్కడికక్కడ కమిటీలు వేయడంవంటి అంశాల గురించి మంత్రివర్యులు ఆలోచన చేసి గౌరవ ముఖ్యమంత్రి వర్యుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్ళి అమలుజరిగేలా చేయాలని మీద్వారా కోరుకుంటున్నాను.

అధ్యక్షా, మీరు మా నెత్తిమీద చెయ్యివేసి ఆశీర్వదించినప్పుడల్లా మీలో మేము అంబేద్కర్‌గారిని చూసుకుంటున్నాము. ఇది చాలా ఆనందదాయకం. మీ దీవెనలు, ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని కోరుకుంటూ, అంబేద్కర్‌గారి ఆశయాల మేరకు అన్ని పనులూ పూర్తిస్థాయిలో జరిగేలాగా మనస్ఫూర్తిగా విన్నవించుకుంటూ, ఈ అవకాశాన్నిచ్చినటువంటి మీకు మా ధన్యవాదాలు తెలియజేసుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

మ. 12.30

శ్రీ టి. డి. జనార్ధన్ : అధ్యక్షా, రాజ్యాంగ నిర్మాత డా. బాబా సాహెబ్ అంబేద్కర్ గారి గురించి మాట్లాడుకోవడం చాలా సంతోషకరమైన విషయం. ఆయన రాజ్యాంగ నిర్మాణం చేసి, ప్రపంచంలోనే అతి గొప్ప ప్రజాస్వామ్య దేశానికి అవకాశం కల్పించారు. ఈరోజున ప్రజాస్వామ్యంలో ఇంతమందికి అవకాశాలు వచ్చి, ఈ సమాజంలో ఉంటే, వారి యొక్క కృషి మెచ్చుకోదగింది, మరచిపోలేనటువంటిది. వారికి భారత జాతి ఋణపడవలసి ఉంది. ఈ విషయాన్ని గతంలో పెద్దలు కూడా చెప్పారు. అంతేకాదు, ఆయన బ్రిటీష్ కాలం నుంచీ కూడా అన్యాయాలను, అసమానతలను ఎదిరించి, పోరాడారు. అందరికీ అవకాశం కల్పించే విధంగా మన రాజ్యాంగాన్ని రచించడం జరిగింది. అయితే, రాజ్యాంగం యొక్క ఫలితాలు, వాటిని అమలు చేసే తీరుని బట్టి ఉంటాయి. మనం రాజ్యాంగాన్ని అయితే వ్రాసుకున్నాము కానీ, అమలు చేసే తీరు బావుండకపోతే సరైన ఫలితాలు రావు. ఈరోజున అంబేద్కర్ గారి చరిత్ర అందరికీ తెలిసినటువంటి విషయమే. మనకు స్వతంత్ర్యం వచ్చి 67 సంవత్సరములు అయింది. ఈ సమయంలో ప్రస్తుతం జరుగుతున్న లోపాలను సరిచూసుకుంటే బావుంటుంది. అయితే, మన రాజ్యాంగంలోని అన్ని అవకాశాలను తెలుసుకునే పరిస్థితి లేదు. చాలామందికి ఆదేశిక సూత్రాలు, ప్రాథమిక హక్కులు మున్నగు వాటికి సంబంధించి కొన్ని అంశాలు

తెలియనటువంటి పరిస్థితి ఉంది. 125వ సంవత్సరం సందర్భంగా సమీక్షా సమావేశాలు, అవగాహనా సదస్సులను ఏర్పాటు చేస్తే ఏమైనా ఉపయోగం ఉంటుంది. మన ధ్యేయం సమసమాజ స్థాపన అని చెపుతున్నాము.

(ఆ సందర్భంలో గౌరవ డెప్యూటీ ఛైర్మన్ అధ్యక్ష స్థానం వహించారు.)

ఈ సమసమాజ స్థాపన కోసం మనం పనిచేస్తూ, దాదాపు 67 సంవత్సరముల అనంతరం చూస్తే, స్వతంత్ర్యం వచ్చినప్పుడు ఉన్న పరిస్థితుల కంటే, ఇంకా ఎక్కువ పరిస్థితులు, అసమానతలు నేటి సమాజంలో ఉన్నాయి. పేదవారు, మరింత పేదవారుగా అయిపోతున్నారు, ధనవంతులు మరింత సంపన్నులు అవుతున్నారు. కోటి రూపాయలు ఉన్న వ్యక్తి, సుమారు 1000 కోట్లు సంపాదించడం తేలికయింది. కానీ, 10 రూపాయలు సంపాదించే పేదవాడు 20 రూపాయలు సంపాదించడం కష్టమవుతున్న పరిస్థితులు ఉన్నాయి. ఇవి సమాజంలో చాలా కీలకమైన అవసరాలు. ప్రభుత్వాలు ఈ సమస్యలను అడ్రెస్ చేయనంతవరకూ, ఈ స్వాతంత్ర్యానికి అర్థం లేదు. రాజకీయ స్వాతంత్ర్యం వచ్చిందే కానీ, ప్రజలకు ఆర్థిక స్వాతంత్ర్యం రావలసిన అవసరం ఎంతైనా ఉంది. అందుకోసం మన ప్రభుత్వాలు ఈ సంవత్సరం ఊరికే కార్యక్రమాలు చేయడం కాకుండా, ఇంతకాలం వరకూ అమలు జరిగిన పథకాలు, వాటి అమలు తీరులో ఎటువంటి లోపాలున్నాయి? అన్ని అవకాశాలు అందరికీ అందాలంటే ఏం చేయాలి? ఎలా చేస్తే ఇది సార్థకత అవుతుందనే దానిపైన దృష్టి పెట్టవలసిన అవసరం ఉంది.

అధ్యక్షా, ప్రస్తుతం మన సమాజంలో ఒక ధోరణి వచ్చింది. చట్టాలను అమలు జరిపే వారు పనికి రాని వారి క్రింద, చట్టాలను అతిక్రమించే వారికి హీరో వర్షిప్ ఇచ్చే ధోరణి ఉంది. చాలా విపరీతమైన ధోరణి ఉంది కాబట్టి, ప్రభుత్వాలు వీరిపైన సీరియస్‌గా దృష్టి పెట్టవలసిన అవసరం ఎంతైనా ఉంది. ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా చట్టాలను అమలుచేయడాన్ని హుందాతనంగా, గౌరవంగా ఫీలవ్వాలి. ఎక్కడైతే చట్ట ఉల్లంఘనలు జరుగుతున్నాయో, వాటిని మనం సీరియస్‌గా అడ్రస్ చేయాలి. చాలా దేశాలలో చట్టాలను అమలు చేయడం ఒక గౌరవంగాను, కల్చర్‌గాను వస్తోంది. కానీ, మన దేశంలో ఆ చట్టాలను ఉల్లంఘించే కల్చర్‌కు అడ్డుకట్ట వేయవలసిన సమయం ఆసన్నమయింది. తప్పనిసరిగా దీనిమీద అందరూ దృష్టిపెట్టాలి. మనం కులాలు, మతాలు, ప్రాంతాలు ఇలాంటివన్నీ కూడా పరిపాలన సౌలభ్యం, లేకపోతే సమాజంలో కొంత వెసులుబాటు కోసం పూర్వం నుంచి వచ్చిన వాటిని మనం మంచి కోసం ఉపయోగించుకోవాలి. అలాగే, ప్రతి అంశానికి ఒక ప్రక్క మంచి, మరొక ప్రక్క చెడు ఉంటుంది. అయితే, మంచిని తక్కువగా చూసి, చెడును ఎక్కువగా చూసే కాలం వచ్చింది.

నేను ఒకసారి జపాన్ వెళ్ళినప్పుడు అక్కడ ఒక సూపరింటెండెంట్ లెవెల్ ఆఫీసర్‌తో ఇంటరాక్ట్ అయి మాట్లాడుతుంటే, అతను ఏమన్నార ంటే, భారతదేశం వచ్చి చాలా రాష్ట్రాలను టాప్ టు బాటమ్ చూశాను. 'You have created enough barriers among yourselves in the name of caste, creed and regions, what not.' అని అన్నారు. ఈ కులాలు, మతాలు, ప్రాంతాలు వీటి ద్వారా మనలో మనం పోట్లాడుకోవడమే

సరిపోతోంది కానీ, ఈ దేశ అభివృద్ధి ఎలా జరగాలి? ప్రపంచంలోని మిగతా దేశాలతో ఏ విధంగా పోటీ పడాలి? అలాగే, మన జాతికి సర్వ సౌకర్యాలు ఎలా కల్పించాలి? మన దేశంలో పేదవాడు సంతోషంగా ఉండే రాజ్యాన్ని ఏ విధంగా స్థాపించాలి అనే ధోరణులు బాగా తగ్గిపోతున్నాయి. ఏది ఏమైనప్పటికీ, ఇటువంటి సందర్భాలలో మనం ప్రజలందరిలోకి ఈ ఆలోచనలు తీసుకుపోవడమే కాకుండా, ప్రభుత్వాల పనితీరులో కూడా లోపాలను సమీక్షించి, మార్పు వస్తేనే సార్థకత ఉంటుందని, అప్పుడే అంబేద్కర్ గారికి నిజమైన నివాళి ఉంటుందని తెలియజేస్తూ, నాకు ఈ సందర్భంగా మాట్లాడే అవకాశం ఇచ్చినందుకు మీ అందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ వాకాటి నారాయణ రెడ్డి (స్థానిక సంస్థలు, నెల్లూరు): అధ్యక్షా, సభలో డా. బాబా సాహెబ్ అంబేద్కర్ గారిపై మాట్లాడే అవకాశం కల్పించినందుకు ముందుగా మీకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. అందరూ అంబేద్కర్ గారి గురించి ఎన్నో విషయాలు చెప్పడం జరిగింది. నాకు తెలియని ఎన్నో విషయాలను నేను ఈ సందర్భంగా తెలుసుకున్నాను. కానీ, ఈరోజున కొన్ని విషయాలను మీ ముందుకు తీసుకువస్తున్నాను. మనమందరం డా. బాబా సాహెబ్ అంబేద్కర్ గారి ఆశయాలను, ఆయన రాజ్యాంగంలో పొందుపరచిన ప్రతి విషయాన్ని ప్రజలకు తెలియజేయాలనే ఆలోచనతో, వారి ఆశయాలకు అనుగుణంగా అందరూ నడుచుకోవాలనే ఆలోచనతో అందరూ ముందుకు వెళ్ళాలనే విషయాన్ని మనమందరం చెప్పుకుంటున్నాం.

ఇప్పటికీ చట్ట సభలలో రిజర్వేషన్ వ్యవస్థ ఉంది కాబట్టే, ఇప్పటికీ వాటికి గౌరవం కలిగించి, మనతో సమానంగా మనమందరం కూడా ఈరోజు వ్యవహరిస్తున్నాము కానీ, గ్రామాలలోను, పట్టణాలలో దళితులకు పూర్తిగా న్యాయం జరగడంలేదని ఈ సభా ముఖంగా మీ ద్వారా సభ్యుల దృష్టికి తీసుకువస్తున్నాను. ఎందుకంటే, ఈరోజున ఎక్కడైనా గ్రామాలలో ఒక దళిత వాడను ఊరిబయట, అంటరాని వాళ్ళకు కట్టినట్లు నిర్మిస్తున్నారు. అది కేవలం దళితులకు సంబంధించిన కాలనీ కనుక దళితులే ఉండాలనే ఆలోచనతో మనం కడుతున్నాము. హైదరాబాదు నగరంలో కానీ, ప్రస్తుత రాజధానికి దగ్గరగా ఉన్న విజయవాడలో కానీ లేదా మా నెల్లూరు ప్రాంతంలో దళిత వాడలు నిర్మిస్తే, అక్కడ కేవలం దళితులే ఉంటున్నారు. అంటే, ఈనాటికీ మనం వివక్షత చూపిస్తున్నాం. వారిని గ్రామాలకు దూరంగా పెట్టడం, లేక ప్రక్కగా ఉంచడం, వారికి నాగరికతతో ఉండే అవకాశాన్ని కల్పించడం లేదనే అంశాన్ని ఈ సభ ద్వారా తెలియజేస్తున్నాను. ఇంకా ఈ సమాజం మారాలి. ఇప్పటికైనా గ్రామాలలో ఎక్కడైనా ఖాళీ ప్రదేశాలు ఉంటే, వాటిల్లో కానీ, నగరం నడిబొడ్డున ఖాళీ ఉంటే ఇప్పటికైనా ఎస్సీ, ఎస్టీలకు న్యాయం జరగాలంటే, అక్కడ వారికి ఇళ్ళు కట్టించినప్పుడు డా. బాబా సాహెబ్ అంబేద్కర్ గారి ఆశయం ముందుకు వెళుతుందని ఈ సందర్భంగా సభ దృష్టికి తీసుకువస్తున్నాను. సభలో ఉన్న గౌరవ సభ్యులందరూ ఈ విషయంపైన ముందుకు వచ్చి తమ తమ జిల్లాలలో అంబేద్కర్ గారి ఆశయాలను ముందుకు తీసుకువెళ్ళే విషయంలోను, వారికి సంబంధించిన ఇళ్ళను మన మధ్యనే కట్టించి, మన పిల్లలు, వాళ్ళ పిల్లలు కలసి మెలసి ఆడుకునేలా, నాగరికత నేర్చుకునేలా ఉండాలని ఈ సభ ద్వారా మిమ్మల్ని కోరుతున్నాను.

మ.12.40

శ్రీ వాకాటి నారాయణ రెడ్డిః ఇకపోతే చదువు విషయం. అసలు ఈ రోజున మన అంబేద్కర్ గారు ఆలోచించిన సర్వమానవ సమానత్వం అనేది ఏవిధంగా వస్తుంది అధ్యక్షా? విద్యను అభ్యసించిన రోజునే అది వీలౌతుంది. కానీ, ఇవాళ ఏమౌతోంది? డబ్బుండే వాడు కార్పోరేట్ స్కూల్‌కి వెళుతున్నాడు. డబ్బుండే వాడు కార్పోరేట్ కాలేజీకి వెళుతున్నాడు. డబ్బుండే వాడేమో పైచదువులు చదువుతున్నాడు. డబ్బులేని నిరుపేద వాడు మాత్రం ముఖ్యంగా దళితుల్లో ఉండే విద్యార్థులు మాత్రం గవర్నమెంటు స్కూళ్లకు వెళుతున్నారు. అక్కడికే పరిమితమైపోతున్నారు. ఈ విషయంలో దయచేసి కార్పోరేట్ విద్యాసంస్థల్లో రిజర్వేషన్లు కల్పించి, దళిత విద్యార్థులకు కూడా నాణ్యమైన మంచి విద్యను అందించే విధంగా మనమంతా చూడాలని తెలియజేస్తున్నాను.

ఇంకా చెప్పుకుంటూపోతే, ఇవాళ చదువురాని డ్రాపౌట్స్ ఎక్కడున్నారని చూస్తే, ఎస్సీ, ఎస్టీ కులాల్లో దాదాపు 40 నుండి 60 శాతం మంది చదువుకోనటువంటి పరిస్థితులున్నాయి. కాబట్టి, వీటన్నింటినీ క్రోఢీకరించి ఆ విషయంలో ఆలోచన చేసి ఇకనైనాసరే దళితులకు, నిమ్నజాతి వర్గాల వారందరికీ కూడా న్యాయం చేసినప్పుడే అంబేద్కర్ గారి ఆశయాలు ముందుకు వెళతాయని నేను మీకు తెలియజేస్తున్నాను. ఇకపోతే, ఈ యొక్క ఇంటిగ్రేటెడ్ హాస్టల్స్. మనం కూడా చూస్తున్నాము. ఒక కాలేజీకి సంబంధించి గానీ, స్కూలుకు సంబంధించి గానీ ఎక్కడైనా హాస్టల్‌కు వెళితే, అది ఎస్టీ హాస్టల్ అనో, ఎస్టీ హాస్టల్ అనో లేక బీసీ హాస్టల్ అనో కడుతున్నాము. దీనివల్ల ఏమౌతోందంటే ఆ స్కూల్లో అప్పటిదాకా కలిసి ఉన్నటువంటి విద్యార్థి కూడా, ఎప్పుడైతే ఒక విద్యార్థి ఎస్సీ హాస్టల్‌కు పోయాడో అప్పటి నుండి వాణ్ణి తక్కువగా చూడటం, వాణ్ణి కలుపుకోలేకపోవడం వంటివి జరుగుతున్నాయి. ఇవన్నీ పోవాలంటే ఈ హాస్టళ్లను కూడా ఇంటిగ్రేటెడ్ హాస్టల్స్ అని పిలిస్తే బాగుంటుంది. కానీ, కొంతమంది అనుకోవచ్చు. ఇంటిగ్రేటెడ్ హాస్టల్ అని పెడితే డబ్బు ఉన్నవాళ్లకు కూడా అక్కడ సీట్లు వస్తాయని అనుకుంటారు. అలాకాకుండా, దాంట్లో కూడా రిజర్వేషన్ వసతి కల్పించి 20 శాతం ఓసీలకిచ్చినా, 40 శాతం బీసీలకిచ్చినా, మిగతా 40 శాతాన్ని ఎస్సీలకివ్వడం ద్వారా విద్యార్థులంతా కలిసిమెలిసి ఉండేందుకు మనం ప్రయత్నం చేసినప్పుడే అంబేద్కర్ గారి ఆశయాలు ముందుకు వెళతాయి.

నేను ఒక్కటే మనవి చేస్తున్నాను. మనందరం కూడా సభ్యులుగా ఈ సభకు వచ్చాము. మన ప్రాంతాలకు వెళ్లినప్పుడు దళితులందరికీ, నిమ్నజాతుల వారందరికీ కూడా సమానమైన చదువుతోబాటు, సంఘంలో మనతో కలిసే అవకాశం కల్పించిన రోజునే అంబేద్కర్ గారి నిజమైన ఆశయం బ్రతుకుతుందని తెలియజేస్తూ, ఈ అవకాశం ఇచ్చిన మీకు చేతులెత్తి నమస్కరిస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ విటపు బాలసుబ్రహ్మణ్యం ః అధ్యక్షా, వాస్తవానికి జీవితంలో ఇది చాలా గొప్ప అవకాశం. ఒక సందర్భంలో కరుణశ్రీ గారు మన అంబేద్కర్ గారి గురించి ఒక మాట అంటారు. “ఆతడనంత యుద్ధముల ఆరియుతేరిన ధర్మయుద్ధ” అని అంటారు. అంటే ఆ

యుద్ధానికి ఆదియు లేదు, అంతము లేదు. నిరంతరము ఆ యుద్ధం జరుగుతూ ఉండాల్సిందే. అదొక ధర్మ యుద్ధం. ఆ ధర్మ యుద్ధంలో ఆరితేరిన వాళ్లు ఎవరైనా ఉన్నారా అనంటే ఒక్క అంబేద్కర్ గారేనని ఒక దళిత కవి అనలేదు. కరుణశ్రీ జంధ్యాల పాపయ్యశాస్త్రి గారు అన్నారన్నమాట. కాబట్టి, అంబేద్కర్ గారి గురించి మనం మాట్లాడుకునేటప్పుడు జీవితంలో ప్రతి సందర్భంలో ఆయన చేసిన పోరాటం, పడినటువంటి ఆవేదన వంటివి లేకుండా అంబేద్కర్ గారిని మనం చూడలేము. మంచినీళ్ల కోసం పోరాడాల్సి వచ్చింది. బడి కోసం పోరాడాల్సి వచ్చింది. బండి కోసం పోరాడాల్సి వచ్చింది. ఉద్యోగంలో వివక్ష కోసం పోరాడాల్సి వచ్చింది. మంత్రి వర్గంలో నిలదొక్కుకోవడం కోసం పోరాడాల్సి వచ్చింది. మతంలో నిలదొక్కుకోవడం కోసం పోరాడాల్సి వచ్చింది. చిట్టచివరికి దళితులతో కూడా పోరాడాల్సి వచ్చింది. అది వాస్తవం. చిట్టచివరికి వచ్చేటప్పటికి దళితుల్లో ఉన్నటువంటి తేడాలను చూసి, క్రింది దళితులను పై దళితులు పట్టించుకోరు అనేటటువంటి విషయంలో కూడా ఆయన అంతే అసంతృప్తి వ్యక్తం చేశాడు. అంతపెద్ద ఎత్తున జీవితమనే కొలిమిలో పుటం పెట్టిన బంగారంగా ఆయన అభివృద్ధి అయ్యాడు కాబట్టే, ఆయన జీవితాన్ని గురించి ఎవరైనా లోతుగా అధ్యయనం చేసేటప్పుడు మొదటి భాగం ఆయన జీవితంలో చేసిన పోరాటాన్ని ఉటంకించకుండా ఉండలేరు.

రెండవదేమంటే – అంబేద్కర్ అధ్యయనం. ప్రపంచంలో బ్రిటీషు లైబ్రరీని పూర్తిగా చదివినటువంటి వాళ్లు ముగ్గురే ముగ్గురు ఉన్నారు. వారిలో అంబేద్కర్ గారు ఒకరు. వాళ్లు కార్ల్‌మార్క్స్, ముస్సోలిని, అంబేద్కర్ గార్లు. ఆ రోజున ఫ్రెంచి విప్లవం దగ్గర నుండి సోవియట్ విప్లవం దాకా, వాల్టేరు దగ్గర నుండి మొత్తం అంబేద్కర్ గారు వడపోసినట్లు చదివారు. ఆయన అర్థశాస్త్రవేత్త మాత్రమే కాదు, పెద్ద ఎత్తున సామాజిక ఉద్యమాలను కూడా ఆయన అధ్యయనం చేశాడు. అధ్యయనానికి అంతం లేకుండా చివరి దాకా మీరు అధ్యయనం చేయండి, బోధించండి, ఉద్యమించండి అని చెప్పుకుంటూనే ఆయన వచ్చారు. అధ్యయనం లేని అంబేద్కర్‌ని ఊహించడమనేది కష్టం.

మూడవదేమంటే – అంబేద్కర్ చుట్టూ ఉన్న ప్రపంచం. ఈ ప్రపంచంతో నిమిత్తం లేకుండా ఆకాశం నుండి అంబేద్కర్ రాలేదు. అంబేద్కర్ కాలంలో పెద్ద ఎత్తున ఫ్రెంచి విప్లవం తరువాత వచ్చిన ప్రజాస్వామ్య వీచికలు ఒకపక్కన ఉన్నాయి. జాతులు తమ విముక్తి కోసం చేస్తున్న తీవ్రమైన పోరాటాలు ఒకవైపున ఉన్నాయి. రెండవ ప్రపంచ యుద్ధం తరువాత ప్రతి దేశం కూడా ప్రజాస్వామ్యం కోసం పోరాటం, ప్రతి చిన్న వర్గం కూడా ఇప్పటిదాకా వినిపించని గొంతు వినిపించడం అనేది ప్రారంభం కావడం అనే నేపథ్యం కూడా ఆయన చుట్టూ ఉంది. ఈ మూడు అంశాల చుట్టూ అంబేద్కర్ అనేటటువంటి ఒక వెయ్యి రేకల పద్మం వికసించింది. అయితే, ఇంత గొప్ప అవకాశం వచ్చినటువంటి అంబేద్కర్ ఒక అర్థశాస్త్రవేత్తగానే మిగిలిపోయి ఉండొచ్చు కదా. అలా అర్థశాస్త్రవేత్తగా మిగిలిపోయి ఉంటే ఆయనకు నోబెల్ పురస్కారం ఏమన్నా వచ్చుండేదేమో. నాకైతే తెలీదు గానీ, అంత గొప్ప అర్థశాస్త్రవేత్త ఆయన. లేదా ఒక న్యాయవేత్తగా మిగిలిపోయి ఉండొచ్చు కదా. ఏ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి హోదాలోనో రిటైర్ అయ్యి ఉంటే కూడా అయ్యుండొచ్చు. లేదంటే మంత్రివర్గంలో మంచి అవకాశం వచ్చింది కాబట్టి ఘర్షణ పడకుండా జాగ్రత్తగా ఉంటే భారతదేశానికి రాష్ట్రపతి కూడా అయ్యుండేవాడేమో. అయ్యుండొచ్చు. అంబేద్కర్ గారు

అవకాశాలు వచ్చిన తరువాత కూడా ఘర్షణ వాతావరణాన్నే వెతుక్కున్నాడు. అదే అతనికున్నటువంటి గొప్పతనం. ఎక్కడా ఇమిడిపోవడానికి గానీ, ఎక్కడా సర్దుబాటు కావడానికి గానీ, ఎక్కడా జాగ్రత్తపడటానికి గానీ ఆయన ప్రయత్నం చేయలేదు. చిట్టచివరి దాకా పోరాడాడు. ఆఖరికి ఎంత దూరం పోరాడారంటే నాకీ హిందూ మతం వద్దు, హిందూ మతంలో ఉన్నంత కాలం నాకీ వివక్ష తప్పదు అని ఆయన ఒకటే మాట అంటాడు. అసలు హిందూ మతం కులాలు లేకుండా ఉంటుందా? కులాలు లేని హిందూ మతాన్ని ఊహించలేను అంటాడు ఆయన.

జాషువా గారి కథ అయిన నాలుగు పడగల హైందవ నాగరాజులో హిందూ మతం ఉండే కులాల్ని నేను ఊహించలేను అన్నట్టు, ఆఖరికి ఆయన ఆ హిందూ మతంలో నుండి తెగ్గొట్టుకోవడానికి లక్షలాది మందిని సమీకరించి బౌద్ధమతంలోకి వెళ్లారు. బహుశా భారతదేశంలో బౌద్ధమతాన్ని గురించి మొట్టమొదట ముందుకు తెచ్చిన మహానుభావుడు కూడా అంబేద్కరే. బౌద్ధమతమే గనుక ఈ దేశంలో కొనసాగి ఉంటే ఈ దేశ చరిత్ర ఇంకొక రకంగా ఉండేదనేటటువంటి పరిశీలన చేసిన వ్యక్తి కూడా అంబేద్కరే. ఆ రకంగా ఆయన చిట్టచివరి దాకా అంత పెద్ద ఘర్షణ పడినటువంటి మహానుభావుడు. మాక్కూడా ఒక్కోసారి అనిపిస్తూ ఉంటుంది. ఆయన ఎంత గొప్ప రచయిత. మహారాష్ట్ర ప్రభుత్వం అంబేద్కర్ గారి రచనలన్నింటినీ వరస పెట్టి ముద్రించింది. ఈ రోజుకి కూడా అంబేద్కర్ గారి రచనలు ఏవైనా కావాలంటే, మహారాష్ట్ర ప్రభుత్వం ప్రచురించినవి మాత్రమే ఉన్నాయి. కాబట్టి, నేను ఈ సందర్భంగా ఇక్కడ ప్రస్తావిస్తాను. అంబేద్కర్ గారి రచనలన్నింటినీ తెలుగులోకి అనువదించి సోషల్ వెల్ఫేర్ డిపార్టుమెంటో, మరొక డిపార్టుమెంటో మంచి తెలుగులోకి అంటే బైబిల్‌లో ఉండే తెలుగులోకి కాదు. ఇంగ్లీషులో చదువుకుంటే బాగుంటుందిరా, ఈ తెలుగుకంటే అనిపించే తెలుగులోకి కాదు. మంచి తెలుగులోకి అంటే జాను తెలుగులోకి ఎవరి చేతనైనా ట్రాన్స్‌లేట్ చేయించి, ఒక సంవత్సరం, రెండేళ్ల ప్రాజెక్టుని తెలుగుదేశం ప్రభుత్వం తీసుకోగలిగితే ఉపయోగకరంగా ఉంటుందని భావిస్తున్నాను. మంత్రి గారు కూడా ఇక్కడే ఉన్నారు కాబట్టి చెబుతున్నాను. అంబేద్కర్ గారు అంత గొప్ప రచయిత, దార్శనికుడు ఆయన.

నేను అనుకుంటాను. ఒక మాగ్నాకార్టా, ఒక కమ్యూనిస్ట్ మ్యానిఫెస్టో, ఒక ఎనిహిలేషన్ ఆఫ్ క్యాస్ట్ ఇవన్నీ కూడా ఇప్పటికీ కూడా మాస్టర్ పీసెస్. అద్భుతమైనటువంటి ఒక 40, 50 పేజీలు కూడా మించనటువంటి గ్రంథాలు, ప్రపంచపు గతిని మార్చడానికి ఉపయోగపడినటువంటి గ్రంథాలు అవి. ఆ గ్రంథాల్లో ఉపయోగించిన భాష, ఆ పదును, ఆ వ్యక్తీకరణ, ఆ సబ్జెక్టు మొత్తం చూచినట్లయితే అసలు ఇంత చిన్న పుస్తకంలో ఈ భాషతో ఇంత గొప్ప భావాన్ని, ఇంత పవర్‌ఫుల్‌గా వ్యక్తీకరించడమన్నది సాధ్యమౌతుందా అనిపించేంతగా 'ANNIHILATION OF CASTE' అన్న పుస్తకంలో రాశారు. నేను కూడా మంత్రి గారిని కోరుతున్నాను. అంబేద్కర్ గారి 125 వ జయంతి జరుగుతున్న సందర్భంలో అది పెద్ద పుస్తకం కాదు. దాన్ని చాలా మంది బాగా ట్రాన్స్‌లేట్ చేశారు. ఆ పుస్తకాన్ని మన రాష్ట్రంలో ఉండేటటువంటి ప్రతి గ్రాడ్యుయేట్ విద్యార్థి చదివే విధంగా ఏమన్నా చేయగలరేమో చూడండి.

మ.12.50

శ్రీ విటపు బాలసుబ్రహ్మణ్యం : (కం) ఆ రకంగా చేయడం ద్వారా ఆయనకు నివాళులు అర్పించినట్లు అవుతుంది అంతేగానీ, విగ్రహాలు పెట్టి పూలమాలలు వేస్తే కాదు. ఈ విధంగా చేసి ఆయనకు పూలమాలలు వేస్తే ఒకవేళ ఆయన బ్రతికి ఉంటే ఇవన్నీ చూసి మీరంతా గందరగోళం చేస్తున్నారయ్యా, నేను లేకుండా ఉంటే బాగుండేదని అంబేద్కర్ అనుకునే ప్రమాదం ఉంది. కాబట్టి, ఆ విధంగా ఆ పుస్తకాల గురించి ఆలోచించమని నేను కోరుతున్నాను. అలాగే, మిత్రులారా, డా. బి.ఆర్. అంబేద్కర్ గొప్ప సామాజిక విప్లవకారుడు. ఆయనకంటే గొప్ప మేథావులు ఉండవచ్చు, ఆయనకంటే గొప్ప రచయితలు ఉండవచ్చు. ఆయనకంటే గొప్ప తత్త్వవేత్తలు ఉండవచ్చు. వీటన్నింటితోపాటు ఆయన ఒక గొప్ప సామాజిక విప్లవం కోసం పోరాడి చిట్టచివరి దాకా తపన పడి ఆ ఆర్ద్రతతో నిలబడ్డాడు కాబట్టే ఆయన గురించి ఈనాడు మనం మాట్లాడుకుంటున్నాము. ఇవి లేకుండా ఆయన కేవలం పండితుడు మాత్రమే అయితే మనం ఆయన గురించి పెద్దగా చెప్పుకునేవారం కాదేమో. దేశంలో పండితులు లేకుండా ఏమీ పోలేదు. అందుకనే కార్ల్ మార్క్స్ ఒకచోట చెప్పారు – "ప్రపంచాన్ని విశ్లేషించడం గొప్ప కాదు. ప్రపంచాన్ని మార్చడం గొప్ప. విశ్లేషించేవారు 1116 మంది ఉంటారు కానీ, మార్చడానికి పూనుకునే వాళ్లు ఉండడమనేది అరుదు అని అన్నారు." అంబేద్కర్ ఆ విధంగా మార్చడం కోసం నిలబడినటువంటి మహానుభావుడు. అంటరానితనం మీద ఆయన ఎంత ఆవేదన చెందాడో అంత పోరాటం చేశారు, తంటాలు పడ్డారు.

నేనొక విషయం మనవిచేయదల్చుకున్నదేమంటే, తెలుగుదేశం ప్రభుత్వం 2002 వ సంవత్సరంలో జస్టిస్ పున్నయ్య కమీషన్‌ను వేసింది. జస్టిస్ పున్నయ్య గారు ఆ కమీషన్‌లో గ్రామాలలో ఎన్ని రకాల అంటరానితనాలు ఉన్నాయి, ఎన్ని రకాల వివక్షలు ఉన్నాయనే గొప్ప విశ్లేషణ చేశారు. మంత్రిగారు ఇంతకు ముందు కులాల గురించి చెబుతూ 105 అని చెప్పారు. టీ బంకుల దగ్గర నుండి, చాకిరేవుల నుండి, శ్మశానం దాకా ఎక్కడికి పోయినా ప్రతి గ్రామంలో అడుగడుగునా అంటరానితనం, వివక్ష ఉన్నాయి, నా దృష్టికి 105 వచ్చాయని జస్టిస్ పున్నయ్య గారు చెప్పారు. ఇంతకుముందు మా మిత్రుడు కూడా ఆ విషయాన్ని ప్రస్తావించారు. లేటెస్ట్‌గా 2014వ సంవత్సరపు UNO రిపోర్టులో మానవాభివృద్ధి గురించి ప్రస్తావిస్తూ, భారతదేశం ఈ పదేళ్లల్లో బాగానే ముందుకెళ్లింది అయితే, ఈ ప్రపంచంలో ఎక్కడా లేని అసమానతలు భారతదేశంలో ఈ పదేళ్లలో కనిపిస్తున్నాయని తెలిపింది. దేశం ముందుకువెళుతున్నట్లు, దళితులు అభివృద్ధి చెందుతున్నట్లు కనిపిస్తున్నది కానీ, ఊహించడానికి వీలు లేనన్ని గ్యాప్స్ వస్తున్నాయి. ఈ గ్యాప్‌లో దళితులు ఒక అడుగు ముందుకు వెళుతున్నారంటే, మిగతావారు పదడుగులు ముందుకు వెళుతున్నారు. అప్పుడు మళ్లీ 9 అడుగుల గ్యాప్ కనిపిస్తున్నది. భారతదేశంలో మిగతా విషయాలలో అభివృద్ధి చెందినప్పటికీ అసమానతల విషయంలో కూడా అంతే అభివృద్ధి చెందుతోందనే విషయం అర్థం కావడం లేదని రిపోర్టులో పేర్కొన్నారు.

సర్కారుబడికి పోయినా దళితులే కనిపిస్తారు, సర్కారు ఆసుపత్రికి పోయినా వారే కనిపిస్తారు. అనాథలను చూసినా దళితులే కనిపిస్తారు. బాల కార్మికులలో, తుఫానులలో దెబ్బతినిపోయి బిక్కుబిక్కుమంటున్న వారినెవరినైనా చూడండి దళితులే కనిపిస్తారు.

దుబాయ్ వెళ్లి చూసినా చెన్నై, బెంగుళూరు వెళ్లేటటువంటి స్కావెంజర్స్‌ని చూసినా వాళ్లే కనిపిస్తారు. కులం ఎక్కడ లేదు? కులం ఎక్కడికి పోయింది? స్కావెంజర్స్‌కి కులం ఉంది. దుబాయ్ పోయే వాళ్లకు కులం అదే ఉంది. కాబట్టి కులం ఏమీ విడిచిపెట్టలేదు. మిత్రులారా, ఇంకొక రూపంలో ఇంకొక రూపంలో కులం అతుక్కుని ఏ మాత్రం వదిలిపెట్టకుండా వెంటాడుతూనే ఉన్నటువంటి పరిస్థితి నేటి సమాజంలో నెలకొని ఉంది.

రిజర్వేషన్ల విషయంలో ఆనాడు అంబేద్కర్ గారు మిగతా మహానుభావులు కలిసి ఆలోచించారు. అయితే, ఆ రిజర్వేషన్లు ఎంతకాలం ఉంటాయి? ప్రభుత్వోద్యోగాలు రోజు రోజుకీ తగ్గిపోతున్నాయి. కేవలం ఎమ్ఎల్ఏ, ఎమ్ఎల్‌సిల రిజర్వేషన్లు సరిపోతాయా ఏమిటి? ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు వస్తే తప్ప ఇప్పుడింక దళితులకు రిజర్వేషన్ల విషయంలో ఎక్కువ ఫలితం వచ్చే అవకాశం లేదు. ప్రైవేటు రంగంలో లక్షల, కోట్ల ఉద్యోగాలు వస్తున్నాయి. రాష్ట్రంలో ప్రైవేటు విశ్వవిద్యాలయాలు తెస్తున్నారు. అందులో నో రిజర్వేషన్స్ అంటున్నారు. ప్రైవేటు యూనివర్శిటీలలో అడ్మిషన్లకు ఎటువంటి రిజర్వేషన్లు లేవని రాసుకున్నాము. కాబట్టి మంచి అవకాశాలు ఏవైనా ఉంటే అవన్నీ మూసుకుపోతూ ఉండే సందర్భంలో, పాత కాలంలో జరిగిన కొద్ది అవకాశాలతోనే సర్దుకోండి అంటే ఎలా? ఎవరు ఎంత చదువుకున్నా అందరూ ఆ ఇరుకు దారిలో పోవాల్సిందే తప్ప అంతకంటే దారిని కొంచెం కూడా పెంచము అనడం ఏం న్యాయం? జస్టిస్ పున్నయ్య గారు రెండు, మూడు అంశాలు రాశారు. అవేమిటంటే, దళితవాడలకు నెలకు ఒకసారైనా ఆర్‌డివో వెళ్లి చూసి అక్కడి విషయాలు తెలుసుకోవాలి, వాళ్లకు భరోసా కలిగించాలి. ఇది ఒక రికమండేషన్. ఈ కమీషన్‌ను తెలుగుదేశం పార్టీనే ఏర్పాటు చేసింది. రెండవ విషయమేమంటే, ఏదైనా ఒక అట్రాసిటీ కేసు జరిగిందని తెలిస్తే, డిఎస్‌పి స్వయంగా దళితవాడకు వెళ్లి విచారించాలి. అది జరుగుతోందా? ఏ ఆర్‌డివో అయినా దళితవాడలకు వెళ్లి కూర్చుని మాట్లాడిన దాఖలాలు ఉన్నాయా? అత్యాచారం, అట్రాసిటీ లేదా మరేదైనా ఇష్యూ జరిగితే డిఎస్‌పి గారు స్వయంగా ఆ గుడిసె దగ్గరకు వెళ్లి కూర్చుని మాట్లాడిన దాఖలా ఏదైనా ఉందా? కాబట్టి ఆ వైపు నుండి ఆలోచించమని ప్రభుత్వాన్ని కోరుతున్నాను. ప్రస్తుత అంశం రాజ్యాంగం గురించి చెప్పినటువంటిది. ఇది అంబేద్కర్ గారి గురించి ఉన్నది కాదు.

రాజ్యాంగం గురించి అంబేద్కర్ గారు చాలా చెప్పారు. అసలు భారతదేశ రాజ్యాంగం గొప్పతనం ఏమిటి? భారతదేశ రాజకీయాలలో ఉన్న గొప్పతనం ఏమిటి? మనతోపాటు స్వాతంత్ర్యం తెచ్చుకున్న దేశాలన్నీ కూడా 10, 15 సంవత్సరాలకే స్వాతంత్ర్యాన్ని పోగొట్టుకుని, ప్రజాస్వామ్యం పోగొట్టుకుని నియంతృత్వ ధోరణికి వచ్చేశాయి. కానీ, భారతదేశం ఆ విధంగా రాలేదే! 60 ఏళ్లయినా, 70 ఏళ్లయినా 5 సంవత్సరాలకొకసారి ఎన్నికలు జరుగుతూనే ఉన్నాయి. ఎంత పెద్దవాళ్లైనా అధికారంలోంచి కిందకు వెళుతున్నారు, మరొకరు వచ్చి కూర్చుంటున్నారు. సజావుగా అన్నీ జరుగుతున్నాయి తప్ప ఈ దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థ మీద దెబ్బ వేయడానికి ఎంత ప్రయత్నం జరిగినా కూడా చెక్కు చెదరలేదు. అయితే, మిత్రులారా, ఆ ప్రయత్నాలూ జరిగాయి. శ్రీమతి ఇందిరాగాంధీ రాజ్యాంగం మీద మొట్టమొదటిసారి పెద్ద దెబ్బ వేశారు. ఎమర్జెన్సీని తీసుకువచ్చారు. అందర్నీ తీసుకువెళ్లి లోపల తోశారు. అయినప్పటికీ రెండేళ్ల

కూడా గడవకముందే, కేవలం ఒకటిన్నర సంవత్సరాల లోపే భారతదేశపు ప్రజాస్వామిక వ్యవస్థ, ప్రజాస్వామిక వాదులు నిలబడి పోరాడి మళ్లీ ప్రజాస్వామ్య దారుల్లోకి తీసుకువచ్చారు. అంతగొప్ప ఇందిరాగాంధీ గారిని కూడా ఇంటికి పంపించారు. Ayan Bee అనేదేమంటే, "ఒక సమాజం యొక్క గొప్పతనం, భయంకరమైన సంక్షోభాలు వచ్చినప్పుడు ఎదుర్కొనే శక్తి ఎంతుందనేదానిపైన ఆధారపడి ఉంటుంది". సంక్షోభాలు వస్తాయి. ఆ సంక్షోభాలలో దెబ్బతినిపోవచ్చు. కానీ, ఎదుర్కొనే శక్తి ఎంతుందనేదానిపైన ఆ సమాజం నిలబడుతుంది. భారతదేశ ప్రజాస్వామిక వ్యవస్థకి అంత బలమైనటువంటి శక్తి ఉంది అనేటటువంటి దానిని ముందుగా ఊహించి పునాదులు వేసిన మహానుభావుడు డా. బి.ఆర్. అంబేద్కర్ గారు. కాబట్టే, ఒబామా గారు భారతదేశపు పార్లమెంటుకు వచ్చినప్పుడు అక్కడున్న రిజిస్టర్‌లో ఒక మాట రాశారు. అదేమిటంటే, "అతి పెద్ద ప్రజాస్వామిక దేశానికి, అతి ప్రాచీన ప్రజాస్వామ్యపు దేశం నుండి శుభాకాంక్షలు". అప్పుడు ఒక రాజ్యసభ సభ్యుడు ఒబామాగారి దగ్గరకు వెళ్లి మీరు రాసింది కరక్ట్ కాదు అని చెప్పారుట. అదేమిటయ్యా బాబూ, నేను అంత మర్యాదగా, గౌరవంగా రాశాను కదా అని అంటే అప్పుడు ఆ రాజ్యసభ సభ్యుడు అతి ప్రాచీన ప్రజాస్వామిక వ్యవస్థ అని మీరు మీ దేశం గురించి అంటున్నారు, అమెరికాలో 1960లో అందరికీ ఓటు హక్కు ఇచ్చారు కానీ మా దేశంలో 1950లోనే ఇచ్చారు. కాబట్టి, ఆ ప్రాచీనమైన ప్రజాస్వామ్య దేశం అనే మాట కూడా మాకే చెందుతుందండీ, మీకు చెందదు అని చెబితే ఒబామా గారు కూడా ఓహో! అనాల్సి వచ్చిందట. అంత గొప్ప బహుళత్వం గల దేశం మనది.

ఈ దేశంలో ఇన్ని సంస్కృతులు, భాషలు, జాతులు, మతాలు, ప్రాంతాలు ఉన్నాయి. ఇవన్నీ కలిసిమెలసి మెలగాలి. ఒకరినొకరు గౌరవించుకోవాలి. అసలివన్నీ ఉండడమే ఈ దేశం యొక్క గొప్పతనం. ఇవన్నీ ఉండడం వల్ల ఈ దేశానికి నష్టం రాలేదు. ఇవన్నీ ఉండడమే ఈ దేశం గొప్పతనం. మన దేశం ఏదో కేవలం ఒక పద్మం మాత్రమే కాదు, వెయ్యి రకాల పూలుపూసే తోట ఇది. దీనిని నిలబెట్టుకోవాలనేది అంబేద్కర్ గారి తపన. ఈ ఆరువేల కులాలు ఉన్నాయని కాదు, విభిన్న రకాల జాతులు, మతాలు, భిన్న ధోరణులు ఉన్నటువంటి దేశం మనది. Monolithic country కాదు. ఇదేమీ జపాన్, చైనా కాదు. అందరూ ఒకే భాష మాట్లాడి, అందరు ఒకే dynasty కింద ఉండే జాతి కాదు మనది. అటువంటి ప్రత్యేకమైన జాతిని నిలబెట్టుకోవాలని అంబేద్కర్ గారు తపన పడ్డారు. ఇప్పుడు ఆ బహుళత్వానికి ప్రమాదమేమైనా వచ్చిందా? అందరూ ఒకటే తినాలని, అందరూ ఒకటే కట్టుకోవాలని, ఒకే రకంగా ఉండాలని అంటున్నారా? ఆ ప్రశ్నకు సమాధానం అవుననే అనిపిస్తున్నది. ఎందుకంటే, ఆఖరికి చిన్నపిల్లలకి పెట్టే మధ్యాహ్న భోజనం విషయంలో కూడా కోడిగుడ్డు తినడానికి లేదు అనే చెప్పే ధోరణి ఈ దేశంలో ఒక రాష్ట్రానికి వచ్చింది. రాష్ట్రం మొత్తం మీద శాకాహారమే తినాలని చెప్పి, పిల్లలు కోడిగుడ్డు తినడానికి వీలులేకుండా చేశారు. మన రాష్ట్రంలో కాదు, వేరే రాష్ట్రంలో ఈ విధంగా చేశారు. ఇలా జరగవలసిన అవసరం ఉందా? ఇంకా బహుళత్వం ఎక్కడ ఉంది? కోడిగుడ్డు విషయంలో కూడా ఏకశిలా సదృశం అయిన వ్యవస్థలా నిర్మించుకోవాలని అనుకున్నట్లయితే పాపం అంబేద్కర్ అన్యాయమైపోతాడు. ఆయన కాదు, మనం అన్యాయం అవుతాము. ఇది ఇందులో ఉన్న సమస్య. నేను జన విజ్ఞాన వేదిక నుండి వచ్చాను అధ్యక్షా, ఆ మాట కూడా చెప్పకుండా ఉండలేను. రాజ్యాంగంలోని 51(ఎ) అధికరణలో శాస్త్రీయ దృక్పథం

ఉండాలని ఉన్నది. శాస్త్రీయ దృక్పథాన్ని పెంచాలని ఉన్నది. తరువాత సత్యాన్వేషణ కోసం నిలబడాలని ఉంది. శాస్త్రీయ దృక్పథానికి, సత్యాన్వేషణకు వ్యతిరేకంగా ప్రచారాలు చేయడానికి వీలు లేదు అని అందులో ఉంది.

మ.1.00

అధ్యక్షా, ఇప్పుడు ఏమంటున్నారంటే, సైన్సు కంటే జ్యోతిషం చాలా గొప్పది, సైన్సు ముందు జ్యోతిషం దిగదిడుపు అని ఒక పార్లమెంటు సభ్యులు ప్రవచించారు. ఆయన విమానంలో సైన్సు వల్ల ఎక్కుతాడో లేక జ్యోతిషంతో ఎక్కుతాడో నాకు అర్థంకావడం లేదు. ఇంకా చాలా చాలా విషయాల గురించి చెప్పారు. పరమశివుడు అందరికంటే గొప్ప ప్లాస్టిక్ సర్జన్ అని ఒక చాలా పెద్దాయన చెప్పాడు. గాంధారికి జన్యుశాస్త్రం గురించి చాలా బాగా తెలుసు, అందుకనే ఆమె కుండల్లో వంద మంది పిల్లలను కనిందని మరొకాయన చెప్పాడు. ఇదంతా ఏమిటి? మనం ఎక్కడకు పోతున్నాం? పాకిస్థాన్ దేశంలో ఈ విధంగానే చేసి, ఇదే రకంగా వ్యవహారం నడిపి సైన్సు రంగంలో ఆ దేశం 20 నుంచి 30 సంవత్సరాలు మనకంటే వెనుకకు పోయింది. దానికి కారణం ఏమిటంటే, అనవసరంగా సైన్సులో ఛాందసవాదం జొప్పించే ప్రయత్నం చేసి మతాన్ని జొప్పించే ప్రయత్నం చేసిన తర్వాత పాకిస్థాన్‌లో ఉన్న అణు శాస్త్రవేత్తలు ఎక్కడెక్కడికో వెళ్లిపోయి చివరికి ఆదేశం దివాళా తీసింది. భారతదేశాన్ని కూడా ఆ స్థాయికి తేవాలని చెప్పి, భారతదేశం ఒక ఆధునిక ప్రజాస్వామ్య దేశంగా ఉండాలనా, లేకుంటే ఒక ఛాందసవాద, మడి కట్టుకున్న దేశంగా ఉండాలా అనేటటువంటి చర్చ వచ్చినపుడు చాలా బాధాకరంగా ఉంటుంది. అందువల్లనే ఆయన వ్రాసిన రాజ్యాంగం గురించి మాట్లాడుకునేటప్పుడు నాకు చాలా బాధ కలుగుతుంది.

ఎన్.సి.ఈ.ఆర్.టి. 10 రోజుల ముందు ఒక రిపోర్టును బయటకు తెచ్చింది. ఆ రిపోర్టు ఏమిటంటే, 10వ తరగతి పాసై ఇంటర్ విద్యను చదువుతున్నటువంటి పిల్లలకు రాజ్యాంగం గురించి ఏమి తెలుసని అధ్యయనం. 74 శాతం మంది పిల్లలు రాష్ట్రపతి, సుప్రీంకోర్టు, పార్లమెంటు ఈ మూడు ఒకచోట ఉంటాయి కాబట్టి ఆ మూడు ఒక్కటే అని చెప్పారు. ఈ రాజ్యాంగం గురించి మన చదువులు ఎంత అద్భుతంగా ఉన్నాయో చూడండి. రాజ్యాంగం గురించి అక్షరాలు కూడా రావు అని 1.96 లక్షలమంది పిల్లలపై అధ్యయనం చేసిన భారత విద్యాశాఖ చేసిన పరిశోధన ఎన్.సి.ఈ.ఆర్.టి. రిపోర్టు ద్వారా తెలుస్తోంది.

అధ్యక్షా, ఔట్‌లుక్ అనే మ్యాగజైన్ ఒక అధ్యయనాన్ని చేసింది. భారతదేశంలో ఉన్నటువంటి గొప్పవారికి రేటింగ్ ఇవ్వాలని ఒక అధ్యయనం అది. విచిత్రమైన విషయం ఏమిటంటే, ఆ రేటింగ్‌లో ప్రథమస్థానం మహాత్మాగాంధీ గారికి వచ్చింది. అది గాంధీగారి గొప్పతనం వల్ల వచ్చిందో, రూపాయినోటు మరియు 500 రూపాయల నోటుపై ఆయన బొమ్మ ఉండడం వల్ల వచ్చిందో తెలియదు కానీ గ్రాడ్యుయేట్లంతా గాంధీ గారికి మొదటి స్థానం కల్పించారు. రెండవస్థానం అమితాబ్ బచ్చన్‌కు వచ్చింది, అంబేద్కర్ గారికి రాలేదు, నెహ్రూ గారికి రాలేదు, భగత్‌సింగ్ గారికి రాలేదు, విచిత్రంగా అమితాబ్ బచ్చన్‌కు

వచ్చింది. మూడవ స్థానం సచిన్ టెండూల్కర్‌కు వచ్చింది. ఇది కథ. ఈ చదువులు దేనికి? చదువుకున్నవారంతా ఇలా అయిపోయారేమిటి? రాజ్యాంగం అంటే తెలియకుండా బట్టీకొట్టి చదివించారు. ఎవరు మహానుభావులు అని అంటే వీరందరినీ చూపిస్తూ, ఈ ప్రయివేటు చదువులు, కార్పోరేట్ చదువులన్నీ వచ్చాక మన పిల్లలు ఈవిధంగా అయిపోతే ఇక ప్రశ్నించేవారు, మరొకరు, ఇంకొకరు ఎక్కడనుంచి వస్తారు?

నేను కొన్ని ముఖ్యమైన విషయాలను చెబుతున్నాను, అంబేద్కర్‌గారి పుస్తకాలన్నీ ప్రింట్ చేయడానికి ఏదైనా ఒక కార్యక్రమం పెట్టండి. కులనిర్మూలనను మంచిగా తీసుకువచ్చి ఎక్కువమందితో చదివించడానికి ఒక ప్రయత్నం చేయండి. అన్ని విశ్వవిద్యాలయాల్లో దళిత అధ్యయన కేంద్రాలను పెట్టండి. అలా పెట్టడం ద్వారా దళితులు, వారి పుట్టుపూర్వోత్తరాలు ఎవరు గొప్పవారో తేలిపోవాలి.

చివరగా నేను ఒక విషయాన్ని చెబుతున్నాను. దయవుంచి అంబేద్కర్‌ను దేవుడిగా మార్చబాకండి. అంబేద్కర్ దేవుడు కాదు. బుద్ధుడిని కూడా అన్యాయం చేశారు. ఆయనకు నమస్కారం పెట్టించి, మహాయానం, హీనయానం అని చెప్పి, ఆయనకు టెంకాయలు కొట్టించి బుద్ధుడిని బుద్ధుడు కాకుండా చేశారు. బుద్ధుడు కనుక ఉండి ఉంటే దానిని తీవ్రంగా వ్యతిరేకించేవారు. ఇప్పుడు అంబేద్కర్‌ను కూడా దేవుడని, పుణ్యాత్ముడని, అప్పుడప్పుడు అంబేద్కర్‌కు పాలాభిషేకాలు కూడా చేస్తున్నారు. ఇది చాలా బాధాకరమైన విషయం. అంబేద్కర్‌ను దేవుడిగా చేయకుండా, అంబేద్కర్ మన మధ్యలో ఉండి మనకోసం పోరాడి, మనల్ని కూడా పోరాడమని చెప్పినటువంటి వాడు. పోరాడకుండా హక్కులనేవి భిక్ష రూపంలో దళితులకు రావు, రావు, రావు. కాబట్టి దళితులతో పాటు అందరూ కుల నిర్మూలన జరగడం కోసం పోరాడాలి. ఈ దేశంలో కులం లేనటువంటి ఒక రోజు రావాలి. భారతదేశంలోనే కాకుండా ఇతర దేశాల్లో కూడా హిందువులు అక్కడకు పోయినపుడు వారు అక్కడ కులాలను కూడా ముందుకు తెస్తున్నారనేదే బాధ. ఏరోజు కులం లేనటువంటి హిందూమతం వస్తుందో ఆరోజు నిజమైనటువంటి నివాళిని ఆయనకు అర్పించినట్లు అవుతుందని నేను తమరిద్వారా తెలియజేస్తున్నాను. ఆ రూపంలో మనమంతా పోరాడదాం, చదువుదాం, బోధిద్దాం, నిలబడదాం, ఆ రూపంగా డా.బి.ఆర్.అంబేద్కర్ గారికి నివాళి అర్పించాలని కోరుతూ నేను సెలవు తీసుకుంటున్నాను. డా.బి.ఆర్. అంబేద్కర్ గారి గురించి సభలో మాట్లాడే ఈ మహత్తరమైన అవకాశం వస్తుందని నేను ఎప్పుడూ అనుకోలేదు. ఈ అవకాశం ఇచ్చిన మీ అందరికీ ధన్యవాదాలను తెలియజేస్తున్నాను.

శ్రీ మెట్టు గోవిందరెడ్డి: అధ్యక్షా, భారతరత్న, రాజ్యాంగశిల్పి, మహానుభావుడు, డా. బి.ఆర్.అంబేద్కర్ గారి 125 వ జయంతి సందర్భంగా సభలో మాట్లాడడానికి నాకీ అవకాశం ఇచ్చిన తమరికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. స్వర్గీయ డా.బి.ఆర్. అంబేద్కర్ గారి గురించి సభలో చాలామంది వక్తలు చాలా బాగా మాట్లాడారు. గౌరవ సభ్యులు శ్రీ పిల్లి సుభాష్‌చంద్రబోస్ గారు, ఇంతకుముందే శ్రీ విటపు బాలసుబ్రహ్మణ్యం గారు కూడా చాలా బాగా మాట్లాడారు కాబట్టి వారికి నా ప్రత్యేక ధన్యవాదాలను తెలియజేస్తున్నాను.

డా. బి.ఆర్.అంబేద్కర్ గారికి నిజమైన నివాళి అంటే, ఆయన యొక్క ఆశయాలను మనమంతా తప్పకుండా నెరవేర్చాలి. ఆయన ప్రధాన ఆశయం ఏమిటంటే, సమసమాజం. ఐదు అంశాలలో అంటే, ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా, విద్యాపరంగా, ఆరోగ్యపరంగా ప్రతి ఒక్కరూ అభివృద్ధి చెందితేనే సమసమాజం వస్తుంది. 10 సంవత్సరాలలోనే సమసమాజం ఏర్పడుతుందని ఆయన కలలు కన్నాడు. కానీ, 69 సంవత్సరాలు గడిచినా ఇంతవరకూ సమసమాజం అనేది రాలేదు. దీనికి కారణం ఎక్కడో ఒకచోట ఖచ్చితంగా లోపం ఉండి ఉంటుంది. ఆ లోపాన్ని సరిదిద్దుకోవడానికి తప్పకుండా మనమంతా ప్రయత్నం చేయాలి.

విద్యారంగం విషయానికి వస్తే, ప్రభుత్వం అనేక పథకాలు అమలులోకి తెచ్చినప్పటికీ, అభివృద్ధి అంతా కేవలం ప్రభుత్వంతోనే సాధ్యం కాదు. మనమంతా కూడా ఆలోచన చేయాలి. కొంత బాధ్యత మనందరిపై కూడా ఉంది. ఉదాహరణకు, 2003 వ సంవత్సరం వరకూ నేను బెంగుళూరులో వ్యాపారం చేస్తూ ఉండేవాడిని. 2004వ సంవత్సరంలో నేను శాసనసభ్యునిగా కొత్తగా ఎన్నిక కాకముందు ఒక ఊరికి వెళితే ఎమ్.ఎల్.ఏ. ఒక్కరే కుర్చీలో కూర్చునేవారు. మిగిలిన వారంతా నిలబడి ఉండేవారు. నేను శాసనసభ్యునిగా ఎన్నికైన తర్వాత ప్రతి ఒక్కరినీ కుర్చీలలో కూర్చోబెట్టి, వారికి టీ త్రాగించి వారి సమస్యల గురించి అడిగి తెలుసుకునేవాడిని. సమాజంలో మార్పు కావాలంటే ముందుగా మనలో మార్పు రావాలి. పెద్ద సిటీలలో ఉంటే కులాల గురించి ఎవరికీ తెలియదు. కానీ, గ్రామాల్లో మరియు పట్టణాలలో ఇంకా ఆ సిస్టమ్ కొనసాగుతూనే ఉంది.

మరొక విషయం, ప్రభుత్వం ఇళ్లు కట్టించేటపుడు ఎస్సీ కాలనీ, బి.సి. కాలనీ అని మనం వేరుచేస్తున్నాము. బ్రిటీషువారి కాలంలో చేసినట్లుగానే ఇంకా కొన్ని రూల్స్‌ను కొనసాగిస్తున్నాము. ఆ విధంగా కాకుండా, ఎస్సీలకు, బి.సి.లకు, ఆర్థికంగా వెనుకబడిన అగ్రవర్ణాలకు అందరికీ కలిపి ఇళ్లను ఒకేచోట నిర్మించి ఇచ్చినట్లయితే సమసమాజం ఏర్పడుతుంది.

ఎస్సీలకు బ్యాంకు రుణాలను ఇస్తోంది. రుణం వారి పేరుమీద ఉన్నా, వేరొక భూస్వాములకు, రైతులకు బ్యాంకులు రుణాలను ఇవ్వడం జరుగుతోంది. దళితులకు లక్ష రూపాయల సాయం అని మంత్రిగారు అంటున్నారు. ఆ లక్ష రూపాయలు దేనికీ సరిపోదు. రూ. 50 వేలు సబ్సిడీ ఉంటేనే రూ. 50 వేలు రుణంగా బ్యాంకులు ఇస్తున్నాయి. ఆ రుణం కోసం వారి పనులు మానుకుని బ్యాంకుల చుట్టూ వారు తిరగవలసి వస్తోంది. గతంలో కొన్ని తప్పులు జరిగాయి. అందరూ సమానంగా ఉండాలంటే, డా.బి.ఆర్. అంబేద్కర్ ఆశించిన సమసమాజం రావాలంటే, అందరూ కలిసి సమూలమైన మార్పులను సమాజంలో తీసుకురావాలి.

మ 1.10

డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్‌గారి గురించి చాలా విషయాలు విని ఉన్నాము. అంతకుముందు చాలా విషయాలు నాకు కూడా తెలియదు. మిమ్మల్ని అందర్నీ

కోరేదేమంటే డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్‌గారి గురించి ఏదైనా పుస్తకాలు ముద్రించి శాసనసభ, శాసనపరిషత్ సభ్యులకు ఇస్తే బాగుంటుంది. ఆ పుస్తకాలను ముద్రించడానికి నా వంతు భాగంగా నా రూ.2000 జీతాన్ని ఇస్తాను. రెండు నెలల జీతాన్నివ్వడానికి కూడా సిద్ధంగా ఉన్నాను. ప్రభుత్వంద్వారా కాకుండా, మనందరమూ శాసనసభ, శాసనపరిషత్ సభ్యులు కలిసి ఖర్చుపెట్టి అంబేద్కర్‌గారి జీవితచరిత్ర, వారు రాసిన పుస్తకాల గురించి, రాజ్యాంగంలోని ముఖ్యమైన అంశాలు, మహాత్మాగాంధీగారిలాంటి ముఖ్యమైన నాయకులకు సంబంధించిన పుస్తకాలను ముద్రిస్తే బాగుంటుంది. మన పాత్ర కూడా చాలా ముఖ్యమైంది. ప్రభుత్వం చేస్తుందని, ఇంకెవరో చేస్తారని కాకుండా మనంకూడా ప్రయత్నం చేసి, ఏం చేసినా దానిని ఆచరించి, సమసమాజాన్ని నిర్మించినప్పుడే అంబేద్కర్‌గారికి నిజమైన నివాళి అని తెలియజేస్తూ ఈ అవకాశమిచ్చినందుకు మీకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

శ్రీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు: అధ్యక్షా, ఈరోజు భారత రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్‌గారి గురించి మాట్లాడే అవకాశం రావడమనేది జీవితంలో ఒక అదృష్టంగా భావిస్తున్నాను. నిన్న, ఈరోజు అంబేద్కర్‌గారి గురించి మాట్లాడిన వక్తలందరూ అనేక కోణాలు ఆవిష్కరించారు. అలాగే అంబేద్కర్ గారంటే ఒక విద్యావేత్తగా, ఒక ఆర్థిక శాస్త్రవేత్తగా, ఒక న్యాయశాస్త్ర నిపుణుడిగా, సామాజిక పరివర్తకుడిగా ఇలా ప్రతి ఒక్క సభ్యులూ వాళ్ళ వాళ్ళ అనుభవం మేరకు, ఆలోచనమేరకు చెప్పడం జరిగింది.

ముందుగా ఒక్క విషయం మాత్రం మనమంతా ఒప్పుకోవాలి. ఈ దేశంలో జాతీయ దినోత్సవాలంటే ఇప్పటి వరకూ మనం రెండే చేసేవాళ్ళం. ఒకటి దేశానికి స్వాతంత్ర్యం వచ్చినరోజు స్వాతంత్ర్య దినోత్సవమైతే, రెండోది అంబేద్కర్ మహానుభావుడు రచించిన గ్రంథం రాజ్యాంగం అమలైనటువంటి రోజు, రిపబ్లిక్‌గా ఈ దేశం మారినటువంటిరోజు రిపబ్లిక్ డే. ఈ రెండే మనకి జాతీయ దినోత్సవాలుగా ఉండేవి. అయితే, మనదేశ ప్రధాని అయిన మోడీగారికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు చెప్పాల్సిన అవసరముంది. ప్రతీ సంవత్సరం అంబేద్కర్‌గారి కంట్రిబ్యూషన్ ఈ దేశానికి ఉంటోంది. అందుకే 1949, నవంబర్ 26న కాన్‌స్టిట్యూషన్ ఆమోదించబడిన ఆరోజుని ఒక రాజ్యాంగదినోత్సవంగా జరుపుకోవాలని, ఆ సందర్భంగా అంబేద్కర్‌గారి గొప్పదనాన్ని గురించి చర్చించుకునే అవకాశం వస్తుందని మోడీగారు తీసుకున్న నిర్ణయం మాత్రం చాలా గొప్పది. అంతేగాక, ప్రతీ పాఠశాలలో దీనిగురించి మాట్లాడే విధంగాను, చర్చించే విధంగాను, అంబేద్కర్‌గారి గొప్పదనం గురించి, వారు రాజ్యాంగాన్ని రచించేటప్పుడు తీసుకున్న కోణాల గురించి ఇలా అన్నింటి గురించి భవిష్యత్ తరాలన్నింటికీ తెలియాలనే ఉద్దేశంతో ఆయన ఈ విధమైన నిర్ణయం తీసుకున్నారు.

రాజ్యాంగాన్ని రచించే సమయంలో ఏర్పాటు చేసిన కమిటీలో ఏడుమంది సభ్యులున్నా, ఆ కమిటీ అధ్యక్షుడిగా ఆయన ఉన్నప్పుడు బహుశా ఏడుమంది సభ్యులు కలిసి కష్టపడినదానికంటే కూడా ఏడురెట్లు ఎక్కువగా వారు కష్టపడ్డారనేది మనకు చరిత్రలో ఉన్నటువంటి భాగం. రాజ్యాంగం రచించిన సందర్భంలో దాని బ్యాక్‌గ్రౌండ్ పరిశీలిస్తే, ఈ కమిటీకి ఎవరు అధ్యక్షులుగా ఉండాలనే విషయంలో కొంత వివాదం వస్తే,

ఆ సమయంలో గాంధీగారు జైలులో ఉంటే కొంతమంది వారిదగ్గరకు వెళ్ళి ఇతర దేశాల్లో ఎంతోమంది నిపుణులున్నారు. వాళ్ళని అధ్యక్షుడిగా పెడితే మనకు బాగుంటుందనే సూచన చేశారు. ఆ సందర్భంలో గాంధీగారు మాట్లాడుతూ, అంబేద్కర్‌గారే అన్ని రంగాల్లో నైపుణ్యం కలిగినవారు. పూర్తిగా అధ్యయనం చేసినవారు. అలాంటివారు ఇంకొకరు లేరని, మన దేశంలో ఆణిముత్యంలాంటి అంబేద్కర్ ఉంటే ఇంకొక దేశం నుంచి మనం సలహాలు తీసుకోవాల్సిన పనిలేదు అని గాంధీగారు సూచించినమీదట ఆయనకి రాజ్యాంగ కమిటీకి అధ్యక్షుడిగా అవకాశమివ్వడం జరిగింది.

అంబేద్కర్‌గారు అధ్యయనం చేయనటువంటి కోణంలేదు. అంతేగాక ఆయన బ్రిటీష్ లైబ్రరీలో చదువుకోవడం, భారతదేశం, అమెరికాలో రెండింటిలోనూ ఆయన డిగ్రీలు పొందడం, దాదాపు రాజ్యాంగాన్ని రచించేటప్పుడు అనేక దేశాల రాజ్యాంగాలను పరిశీలించి, ఏ దేశంలో మనకి, మన సమాజానికి ఉపయోగపడే అంశాలున్నాయో వాటన్నింటినీ పొందుపరిచినటువంటి ఘనత అంబేద్కర్‌గారిది. ఆయన రాజ్యాంగ రచన చేసేటప్పుడు బ్రిటన్ రాజ్యాంగం నుంచి ఏక పౌరసత్వాన్ని, పార్లమెంటరీ విధానాన్ని, స్పీకర్ వ్యవస్థను, అమెరికా రాజ్యాంగం నుంచి ప్రాథమిక హక్కులు, అత్యున్నత న్యాయస్థానం, సుప్రీంకోర్టు వ్యవస్థ ఎలా ఉండాలనే విషయాలను తీసుకోవడం జరిగింది. ఇదిగాక ఐర్లాండ్ రాజ్యాంగం నుంచి న్యాయ సమీక్ష, ఆదేశిక సూత్రాలను, రాష్ట్రపతి ఎన్నిక పద్ధతి, శాసనసభ్యుల నియామకంవంటి అంశాలను తీసుకోవడం జరిగింది. ఎక్కడైతే మన సమాజానికి అనుకూలంగా ఉండే వ్యవస్థలు, రాజ్యాంగం ఉంటుందో వాటన్నింటినీ పుణికిపుచ్చుకుని తీసుకువచ్చి ఇక్కడ అమలు చేసిన చరిత్ర మనకుంది. అలాగే కెనడా నుంచి కేంద్ర, రాష్ట్ర సంబంధాలు, జర్మన్ నుంచి అత్యవసర పరిస్థితి లాంటి విధానాలను ఈ రాజ్యాంగంలో పొందుపరచడం జరిగింది. అందుకనే మన రాజ్యాంగాన్ని అనేక దేశాలనుంచి సేకరించిన సారాంశనిధి అంటారు. అన్ని ఫిలాసఫీలు, అన్ని అంశాలను పుణికిపుచ్చుకుని, పొందుపరచినటువంటి ఒక సారాంశనిధి మన రాజ్యాంగం. అందుకనే వాళ్ళు ఆంగ్లంలో చెప్పేటప్పుడు కూడా 'this is a bag of borrowings' అన్నారు. అన్ని దేశాలనుంచి తీసుకువచ్చారంటే యధాతథంగా కాపీ కొట్టడంకాదు. అంబేద్కర్‌గారియొక్క రచనాపాటవం గురించి మొట్టమొదటి రాజ్యాంగసభలో నెహ్రూగారు మాట్లాడేటప్పుడు చాలా యాష్ట్‌గా ఒక విషయం చెప్పారు.

మ. 1.20

నెహ్రూ గారు రాజ్యాంగ విశేషాలు చెప్పినప్పుడు అంబేద్కర్ గారు ఒక దార్శనికుడు అన్నారు. ఆయన దార్శనికత గురించి చెప్పినప్పుడు కేవలం కొంత కాలం వరకే రాజ్యాంగంలో ఉన్న అంశాలు ఉపయోగపడతాయని కాదు, మొత్తం భవిష్యత్తు తరాలకు ఈ రాజ్యాంగంలో ఉన్న విశేషాలు ఉపయోగపడతాయని చెప్పారు. 1946వ సంవత్సరం డిశంబరు 13వ తేదీన జవహర్‌లాల్ నెహ్రూ గారు రాజ్యాంగ సభలో ప్రసంగించడాన్ని ఇప్పటికీ ఒక చారిత్రాత్మక ప్రసంగంగా కొనియాడుతున్నారు. అదే సమయంలో ఆయన చేసిన వ్యాఖ్యలలో రాజ్యాంగ సూత్ర నియమావళిని కూడా రాజ్యాంగ సభలో ప్రవేశపెట్టి

నెహ్రూ గారు తొలి ప్రసంగంలో ఉన్నతమైన ఉదాత్తమైన అంశాన్ని ఆవిష్కరించారు. రాజ్యాంగ నియమావళిలో మా ఆలోచన – ప్రపంచ దేశాల రాజ్యాంగాలలో విజయాలనే స్వీకరించాము తప్ప వాటి వైఫల్యాల జోలికి పోలేదని చెప్పారు. అదేవిధంగా ఆదేశాలలో మన రాజ్యాంగ ఔన్నత్యాన్ని రాజ్యాంగ సభ ద్వారా ప్రపంచ దేశాలకు వెల్లడించినట్లు అయ్యిందని, ఆచరణలో ఎన్ని అవరోధాలు వచ్చినా దేశ ప్రజలు వాటిని అధిగమించే విధంగా ఉందని అన్నారు. అందుకనే రాజ్యాంగంలో రాసేటప్పుడు this is both flexible and inflexible అని ఉంది. అవసరం వచ్చినప్పుడు సవరించుకోవడానికి అనుకూలంగా ఉంది, అదే విధంగా అవసరం వచ్చినప్పుడు సవరించడానికి వీలు లేకుండా కూడా ఉంది, రెండు కోణాలు ఉన్న రాజ్యాంగం. ప్రపంచ రాజ్యాంగాలలో మరెక్కడా కూడా ఇలాంటి అవకాశం లేదు.

గాంధీగారి నిర్ణయం అయితే మనకు స్వదేశంలో ఉన్న మేధావి, ప్రపంచంలో మరెక్కడా లేరు కాబట్టి అంబేద్కర్ గారు మనకు ఉండాలని అంటే, నెహ్రూ గారు ఆయన తొలి ప్రసంగంలో మాట్లాడేటప్పుడు అంబేద్కర్ గారి దార్శనికత గురించి మాట్లాడారు. ఇటీవల ఒక వివాదస్పదమైన వ్యాఖ్య ఒకటి వచ్చింది. రాజ్యాంగ సమీక్ష చేయాలని వచ్చినప్పుడు కె.ఆర్ నారాయణన్ గారు ఒక మాట అన్నారు. రాజ్యాంగాన్ని సమీక్ష చేయాలని అంటున్నారు, ఇప్పటికే అనేక సందర్భాలలో వివిధ అంశాలపై సమీక్ష చేయడం జరిగింది. సమీక్ష చేసినప్పుడల్లా ఒక్కొక్క క్లాజుకు సవరణ చేస్తూ వచ్చారు. అదే సమీక్ష. ఆ సమీక్ష అనేది ఏ అంశం మీద అయితే ఫ్లెక్సిబుల్‌గా ఉండాలని అనుకున్నారో ఆ ఫ్లెక్సిబులిటీలో ఒక అంశంగా మనకు ఇప్పటి సమకాలీన అవసరాలకు అనుగుణంగా దానిని అమెండ్ చేయాల్సి వచ్చినప్పుడు ప్రతీసారి దానిని సమీక్ష చేసి అమెండ్ చేస్తున్నారు తప్ప సమీక్ష చేయకుండా అమెండ్ చేయడం లేదు. ఈరోజు దానిని సమూలంగా సమీక్ష చేయాలని అంటే ముందు ఒక విషయాన్ని మనం గుర్తు పెట్టుకోవాల్సిన అవసరం ఉంది. We will have to bear it in mind, whether the Constitution has failed or whether the people have failed in understanding the Constitution. ముందు మనల్ని మనం ప్రశ్నించుకోమని అన్నారు. రాజ్యాంగాన్ని అర్థం చేసుకోవడంలో మనం ఫెయిల్ అయ్యామేమో ఆలోచించుకుని తరువాత రాజ్యాంగంలో సమూల సమీక్ష గురించి మాట్లాడండి అన్నారు. ఇటీవల జనరేషన్స్‌కు అంబేద్కర్ గారు ఈ దేశానికి ఇచ్చిన వరం ఈ కాన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇండియా గురించి పెద్దగా అవగాహనలోకి రాకపోవచ్చు. భిన్నత్వంలో ఏకత్వాన్ని తీసుకువచ్చిన గ్రంథం రాజ్యాంగం. రాజ్యాంగ సూత్రాలను అనుసరించి తప్ప మరొక దారిలో మనం వెళ్లడం లేదు. నిన్న, ఈ రోజు చాలా మంది గౌరవ సభ్యులు చాలా చక్కగా మాట్లాడారు. ఈ రాజ్యాంగం మీద ఇంకా ఎన్నో తరాలు ఆధారపడి ఉండాలి, ప్రతీ తరాన్ని ప్రభావితం చేసే విధంగా చేయాలి.

మన రాష్ట్రం నూతనంగా ఏర్పడింది. కేవలం 18నెలలు అవుతోంది. ఈ రాష్ట్రంలో అమరావతిలో ఆయన విగ్రహంతో పాటు అంబేద్కర్ యూనివర్శిటీ ఒకటి ఏర్పాటు చేయాలి. శ్రీకాకుళంలో యూనివర్శిటీకి అంబేద్కర్ పేరు పెట్టారు, అలా కాకుండా Ambedkar University should be confined only for the studies of Ambedkar philosophy. అంబేద్కర్ ఫిలాసఫీని ప్రాపగేట్ చేసేందుకు కృషిచేయాలి. అంబేద్కర్ గారు రచించిన రాజ్యాంగంలో 448 నిబంధనలు, 25 భాగాలు, 12షెడ్యూల్స్, 5 అనుబంధాలు

ఉన్నాయి. ఈ రాజ్యాంగానికి 98 సవరణలు జరిగాయి. మన రాజ్యాంగం ఫ్లెక్సిబుల్‌గా ఉంది కాబట్టి అవసరాలకు అనుగుణంగా సవరణలు చేసుకుంటూ పోతున్నాము. కానీ నేను చెప్పదలచుకుంది అంబేద్కర్ గారి దార్శనికత గురించి. ఈ 448 నిబంధనల్లో ప్రతీదీ ఒక ప్రాధాన్యాంశమే. ఒకటి కాదు, రెండు కాదు, అంబేద్కర్ స్టడీస్, విజన్, దార్శనికత, కాంట్రిబ్యూషన్, ప్రీ అంబేద్కర్ డేస్, డ్యూరింగ్ అంబేద్కర్ డేస్, పోస్ట్ అంబేద్కర్ డేస్ అనే భాగాలుగా విభజించి కేవలం అంబేద్కర్ ఫిలాసఫీ మీద ఒక ప్రత్యేకమైన డెడికేటెడ్ యూనివర్శిటీని ఏర్పాటు చేయాలి. ప్రధాని మోదీగారు స్కూల్ స్థాయి నుండి అంబేద్కర్ గారి గురించి ఎందుకు చెప్పమంటున్నారు అంటే నూతనంగా చదువుకునే ప్రతీ పిల్లవాడికి అంబేద్కర్ అంటే ఎవరు, రాజ్యాంగం అంటే ఏమిటీ మన దేశం ఏ సూత్రాల మీద ముందుకు పోతోంది, అనేది వారికి తెలియాలి కాబట్టి అంబేద్కర్ ఫిలాసఫీని ప్రొటెక్ట్ చేస్తూ, ఒక యూనివర్శిటీ ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఉంది.

అంబేద్కర్ అంటే ఏదో ఒక మతానికి చెందిన వ్యక్తి కాదు, ఆయన బౌద్ధ మతం కూడా స్వీకరించాడు. ఆయన గురించి చదువుకునేటప్పుడు బౌద్ధమతం గురించి కూడా వస్తుంది. కాబట్టి అంబేద్కర్‌కు ఘనమైన నివాళి ఏమంటే ఆయన చిరకాలం గుర్తుండే విధంగా ప్రతీ తరం ప్రభావితం అయ్యే విధంగా అంబేద్కర్ జీవిత చరిత్ర, ఆయన పడిన ఇబ్బందులు, అంటరాని తనం మీద ఎందుకు పోరాటం చేశాడు, ఆయన చదువు ఏవిధంగా కొనసాగిందీ, ఏవిధంగా రాజ్యాంగాన్ని రచించాడు అనే అంశాలు ప్రతీదీ ఒక ప్రాధాన్యాంశం కాబట్టి అంబేద్కర్ ఫిలాసఫీని వివరించే విధంగా ఒక డెడికేటెడ్ యూనివర్శిటీ ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఉందని నేను అభిప్రాయపడుతున్నాను. మొత్తం అంబేద్కర్ పుస్తకాలను తెలుగులోకి అనువదించి, ప్రతీ ఒక్కరికీ అందుబాటులోకి తీసుకువచ్చే విధంగా చేస్తే బాగుంటుందని మనవి చేస్తూ, వై.ఎస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ తరఫున అంబేద్కర్ గారికి ఘనమైన నివాళి అర్పిస్తూ సెలవు తీసుకుంటున్నాను.

మ. 1.30

శ్రీ వి.వి.వి. చౌదరి (శాసనసభ నియోజకవర్గం): అధ్యక్షా, థ్యాంక్యూ వెరీమచ్. హౌస్‌లో చివరగా కూర్చున్న మాకు రెండు రోజుల తరువాత బహుశా అంబేద్కర్ గారి స్ఫూర్తి మీలో ప్రవేశించి ఉంటుంది కాబట్టి మాకు మాట్లాడడానికి అవకాశం కల్పించినందుకు మీకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. అధ్యక్షా ! గౌరవ సభ్యులు చాలామంది మాట్లాడిన తరువాత డా. బాబా సాహెబ్ అంబేద్కర్ గారి చరిత్ర, ఆయన ఔన్నత్యం, ఆయన దేశానికి చేసిన సేవ ఇవన్నీ కూడా మనందరం చాలా విస్తృతంగా సమీక్షించుకున్నాం. నేను ఈ సందర్భంగా జీవితమంతా సమాజంతోటి, పాలకులతోటి పోరాటం జరిపిన అంబేద్కర్ గారు తన యొక్క చరమాంకంలో తన మనసులతో కూడా అంతర్ముఖులై పోరాడిన సందర్భాన్ని నేను ఈ సందర్భంగా మీ ద్వారా మనవి చేస్తున్నాను.

పెద్దలు శ్రీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు గారు చెప్పినట్లుగా మనం స్వాతంత్ర్య దినోత్సవాన్ని, రిపబ్లిక్‌డేని జరుపుకున్నాం. ఈనాడు క్రొత్తగా మనం రాజ్యాంగ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామంటే, ఇది బహుశా మనం ఒక కర్తవ్య బోధకోసం, మనం ఇప్పుడు

తక్షణ దినచర్యలో ఒక పౌర సమాజం నిర్వహించవలసిన బాధ్యతను, కర్తవ్యాన్ని గుర్తు చేసుకోవడం కోసం ఈ రోజున రాజ్యాంగ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని నేను ఈ సందర్భంగా మీకు మనవి చేసుకుంటున్నాను.

స్వతంత్ర్య భారతావనికి సుమారు 70 సంవత్సరాలు నిండుతున్న సందర్భంగాను, రాజ్యాంగాన్ని రచించుకుని, దానిని సుమారు ఆరున్నర దశాబ్దాలు జరిగిన తరువాత, సమాజ పరిస్థితులు, వాటి స్థితిగతులను సమీక్షించుకోవలసిన అవసరం ఉందని ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నాను. పెద్దలు, మా సీనియర్ నాయకులు ప్రస్తావించిన సందర్భాలను ఒకసారి పునః సమీక్షించుకుంటే, ఏడు పదుల వయసు గలిగిన స్వతంత్ర్య భారతావనిలో, ఇప్పటికీ నాగరికతకు నోచుకోని కొన్ని కొన్ని ప్రాంతాలలో బాల్య వివాహాలు జరుగుతున్నాయి. అలాగే, ఆలయాలలో ప్రవేశాలకు నోచుకోని అంటరానితనం కనిపిస్తోంది. మా అక్కగారు శ్రీమతి పమిడి శమంతకమణి గారు, ఇతరులు చెప్పినట్లుగా నీటికి సంబంధించి ఒక కుళాయి దగ్గర నీరు పట్టుకోవడానికి కులాల అంతరాలు అడ్డు వచ్చి ఘర్షణలు ఏర్పడే పరిస్థితులు ఉన్నాయి. వీటన్నింటిని మనం ఒకసారి సమీక్షించుకుంటే, ఈ రాజ్యాంగం మనం అమలు చేయడం మొదలు పెట్టిన తరువాత అప్పటికీ, ఇప్పటికీ మార్పులు ఏమైనా వచ్చాయంటే, కొంతవరకు మన వేష భాషలలో, ఆహార విహారాలలో, ఆహార్యంలో మార్పులు వచ్చాయి తప్ప, సమాజంలో మాత్రం ఏ విధమైన మార్పు రాలేదన్నది మనం ఈ సందర్భంగా ఆత్మపరిశీలన చేసుకోవలసిన అవసరం ఉందని ఈ సందర్భంగా తెలియజేసుకుంటున్నాను. డా. బాబా సాహెబ్ అంబేద్కర్ గారు వీటి కోసం జీవిత కాలం పోరాటం చేశారు. చివరకు సంకుచిత భావాలతో నిండిపోయిన ఈ సమాజాన్ని, ఈ సమాజంలో ఇమడలేని పరిస్థితులు ఉన్నాయి. ఆయన ఈ సమాజాన్ని సమీక్షించడమే కాకుండా, ఈ సమాజాన్ని విశ్లేషించాలనుకున్నారో, ఆ వ్యవస్థను సంస్కరించలేని దుస్థితి ఉంది. ఆయన చివరి దశలో తెలియని ఆవేదన, ఒక నిర్వేదానికి గురయ్యారని కూడా ఈ సందర్భంగా మీ ద్వారా తెలియజేస్తున్నాను.

ఒకప్పుడు మహాత్మా గాంధీ గారు చెప్పినట్లు – వ్యవస్థను సంస్కరించలేని పరిస్థితులలో, సమాజాన్ని సంస్కరించలేని పరిస్థితులలో, ఈ సమాజాన్ని, వ్యవస్థను మనం మానసికంగా పరిష్కరించడం మంచిదని అన్న ఆయన ప్రసంగాన్ని ఒకసారి తమ ద్వారా తెలియజేస్తున్నాను. అదే ఆలోచన, అదే అంతర్ముఖత్వం డా. బాబా సాహెబ్ అంబేద్కర్ గారిలో ప్రేరణ కలిగించి ఉంటుందని అనుకుంటున్నాను. గౌరవ సభ్యులు చెప్పినట్లుగా కులాలతో, మతాలతో అనేక మౌఢ్యాలతో నిండిపోయిన ఈ హిందూ మతంలో ఆయన ఇమడ లేక బౌద్ధమతంలో చేరారని చెప్పారు. ఆయన హిందూ మతం వల్ల కాకుండా, ఈ సమాజంలో ఇమడ లేక చేరారు. ఈ సమాజంలో ఉండే సంకుచిత భావాలు, రాజ్యాంగ ఉల్లంఘనను సహించలేని పరిస్థితులు ఆయనను నిరుత్సాహానికి గురి చేశాయి. ఆయన కనీసం, సత్యం, శాంతి, సహనాన్ని వెతుక్కుందామనే ఆత్రంతోను, ఆవేశంతో బౌద్ధమతాన్ని ఆశ్రయించడం జరిగింది. చివరకు ఏమయిందంటే, ఆయనకు అక్కడ కూడా సత్యం, శాంతి, ధర్మం దొరకలేదు. అక్కడ కూడా అనేక మౌఢ్యాలు వచ్చాయి. అటువంటి పరిస్థితులలో ఆయన యొక్క మరణం కూడా మహాభినిష్క్రమణం అని ఈ సందర్భంగా మనవి చేస్తున్నాను. ఈ రోజున సుమారు 125వ జయంతి ఉత్సవాల వేడుకల

సందర్భంగా మనం చేస్తున్న చర్చలు, సమీక్షలు సమాజానికి ఒక కర్తవ్యాన్ని బోధిస్తున్నాయని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. సమాజంలో ఒక పరిపూర్ణ ప్రజాస్వామ్యం పరిఢవిల్లాలంటే, ఒక సంపూర్ణ భావ విప్లవం రావాలి. ఆ సంపూర్ణ భావ విప్లవానికి ఈ రోజున జరిగే చర్చలు దోహదపడాలని, ఈ చర్చల ద్వారా మనం సమాజంలో మార్పులని, ఒక విధానాన్ని తీసుకురావాలని కోరుతున్నాను. ఇదే ఈ రోజున అంబేద్కర్ గారి జయంతి ఉత్సవాల సందర్భంగా ఒక కర్తవ్య భావన అని ఈ సందర్భంగా తెలియజేసుకుంటూ, ఈ రోజున ఇంత చక్కటి చర్చలో పాల్గొనే అవకాశం నాకు కల్పించినందుకు మీకు నా హృదయ పూర్వక ధన్యవాదాలు తెలియజేసుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ రెడ్డి సుబ్రహ్మణ్యం (స్థానిక సంస్థలు, తూర్పుగోదావరి): అధక్షా, భారత రత్న డా. బాబా సాహెబ్ అంబేద్కర్ గారిని స్ఫూర్తిగా తీసుకుని, బోధించు, సమీకరించు, పోరాడు అనే నినాదంతో ప్రజలలోకి వెళ్ళి ఆయన చిత్రపటాన్ని పెట్టుకుని, 1981వ సంవత్సరంలో ఒక గ్రామ సర్పంచిగా, రాజకీయ ప్రవేశం చేసినటువంటి వ్యక్తులం. ఆయనని స్ఫూర్తిగా తీసుకుని, నిరంతరం ప్రజల మధ్య ఉండి పోరాడుతూ, అంచెలంచెలుగా ఈనాడు ఈ పెద్దల సభలోకి రావడం ఒక అదృష్టమైతే, ఆ పెద్దల సభలో ఆ మహానుభావుడు ఒక సామాజిక విప్లవకారుడైనటువంటి డా. బాబా సాహెబ్ అంబేద్కర్ గారి గురించి మాట్లాడడం, మాకు అవకాశం లభించడం మొట్టమొదటగా మా పూర్వ జన్మ సుకృతంగా భావిస్తున్నాను. ఈరోజున పెద్దలందరూ మాట్లాడారు. సమయాన్ని దృష్టిలో పెట్టుకుని, ఇంకా కొంతమంది సభ్యులు మాట్లాడాలి కాబట్టి, కేవలం రెండే విషయాలు చెప్పి, సెలవు తీసుకుంటాను, అందుకు అందరూ సహకరించవలసిందిగా మీ ద్వారా కోరుతున్నాను. ఈరోజు ఏప్రిల్ 14వ తారీఖున అంబేద్కర్ గారి జన్మదినోత్సవ సభలు జరుపుకోవడం, కార్యక్రమాలు చేసుకోవడం, అలాగే డిసెంబర్ 6వ తేదీన ఆయన వర్ధంతిని చేసుకోవడం, అలాగే మన రిపబ్లిక్ డేని జనవరి 26వ తారీఖున జరుపుకోవడం ఇవన్నీ మనందరికీ తెలిసినటువంటి విషయాలే.

మ.1.40

శ్రీ రెడ్డి సుబ్రహ్మణ్యం: కానీ, ఈ రోజున కేంద్ర ప్రభుత్వం, భారత ప్రధాని శ్రీ నరేంద్రమోడీ గారు చొరవ తీసుకుని భారత రాజ్యాంగం ముసాయిదా బిల్లు ప్రవేశపెట్టినటువంటి రోజైన ఈ నవంబర్, 26 వ తారీకున రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమంగా జరుపుకోవాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమం ద్వారా రెండు రోజుల పాటు పార్లమెంటులో చర్చను చేపట్టినందుకు మొదటగా శ్రీ నరేంద్ర మోడీ గారికి, కేంద్ర ప్రభుత్వానికి ఈ సభ ద్వారా ప్రత్యేకించి అభినందనలు తెలియజేస్తున్నాను. అదే కోవలో ఈనాడు అసెంబ్లీలో కూడా చర్చ జరిపారు. ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు కూడా డా.బాబాసాహెబ్ అంబేద్కర్ గారి జీవిత చరిత్రపై చర్చించడంతో మాత్రమే సరిపెట్టడం కాకుండా, నిరంతరం ఈ కార్యక్రమాలు ఉండాలనే ఉద్దేశంతో కొన్ని కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినందుకు ముఖ్యమంత్రి గారిని కూడా ఈ సభ ద్వారా అభినందిస్తున్నాను.

ఈ రోజున నాతోబాటు, అందరూ చెబుతున్నది ఒక్కటే. అసమానతలు లేని సమసమాజం కోసం, సాంఘిక సమానత్వం కోసం మనమంతా పాటుపడిన నాడే నిజమైన నివాళిని అంబేద్కర్ గారికి అర్పించిన వాళ్లమౌతాము. అందరూ మైకుల దగ్గర చెప్పేటప్పుడు సమానత్వం కోసమే అందరం  మాట్లాడతాము. కానీ, ఈ దేశానికి 1947లో స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ ఇప్పటివరకు ఆ సమానత్వం రాలేదంటే మనమంతా ఒక్కసారి ఆలోచించాలి. ఈ సందర్భంగా నాకు " అందరూ శ్రీవైష్ణవులే కానీ, బుట్టలో రొయ్యలు మాయమైనట్లు" అన్న సామెత గుర్తుకొస్తోంది. ఎవరు మైకు దగ్గరకు వచ్చినా, ఏ పాలకులైనా అందరూ కూడా సమానత్వం కోసం మాట్లాడుతున్నప్పుడు 1947లో ఈ దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత, ఇన్ని సంవత్సరాలు గడిచినా కూడా సమానత్వం సాధించలేకపోయామంటే అందరూ ఆత్మ పరిశీలన చేసుకోవాల్సిన సమయం ఆసన్నమైంది.  డా.బాబాసాహెబ్ అంబేద్కర్ గారు రాజ్యాంగపరంగా ఒక మాట చెప్పారు. రాజ్యాంగం ఎంత మంచిదైనా దాన్ని అమలు జరిపేవారు చెడ్డవారైతే అది చెడ్డది అవుతుంది, అదే మంచివారి చేతుల్లో ఉంటే అది మంచిగా జరుగుతుందని చెప్పిన మాట నేటి తరానికి దివిటీలు. అందుకోసమే ఈనాడు ఈ పెద్దల సభలో ఉన్నటువంటి మనమంతా అంబేద్కర్ గారి ఆశయాలను చిత్తశుద్ధితో అమలుచేయడం కోసం ఒక ప్రతిని పూని, ఆత్మపరిశీలన చేసుకుని ఆ అంబేద్కర్ గారి ఆశయాలను చెప్పడం మాత్రమే కాదు, వాటిని అమలు చేయడం కోసం కృషి చేయాలని మీ ద్వారా ప్రభుత్వానికి, అందరికీ కూడా మనవి చేసుకుంటున్నాను.

ఇకపోతే ఈ రోజు మనిషికి, మనిషికి మధ్య కూడా తారతమ్యాలు స్పష్టంగా కనపడుతున్నాయి. ఈ తారతమ్యాలు పోవాలంటే నేను ముందుగా మాట్లాడినట్లుగా కేవలం ప్రభుత్వాలే కాదు, ఈ సమాజంలో ఉండే ప్రతి ఒక్కరికీ బాధ్యత ఉంది. ఒక ప్రక్క ప్రభుత్వాలు ఎన్ని కార్యక్రమాలు తీసుకున్నా, మనమంతా ఆత్మపరిశీలన చేసుకుని అంబేద్కర్ గారి ఆశయాలను ఈ సమాజంలో ముందుకు తీసుకుపోవడం కోసం కృషి చేయాలని మనస్ఫూర్తిగా నేను కోరుకుంటున్నాను. ఏదిఏమైనా ఈనాడు ప్రపంచ దేశాల రాజ్యాంగాలన్నీ అధ్యయనం చేసి, 2 సంవత్సరాల 11 నెలల 18 రోజులు సుదీర్ఘ కసరత్తు చేసి ఒక ఆదర్శవంతమైనటువంటి, సమర్థవంతమైనటువంటి రాజ్యాంగాన్ని మనకు అందించినటువంటి ఆ మహనీయుడు అంబేద్కర్ గారి గురించి మాట్లాడే అవకాశం కలగడం నిజంగా నా అదృష్టంగా, పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నాను.

ఇకపోతే ఆఖరుగా ఒక్కమాట. ఆ మహనీయుడు నిరంతరం పోరాటం చేసిన సాంఘిక విప్లవకారుడు. ఆయన 1919లో మూక్‌నాయక్ అనే పక్ష పత్రికను ప్రారంభించి, ఈ దళిత జాతి విముక్తి కోసం కృషి చేశారు. మూక్‌నాయక్ అంటే మూగవాళ్లకు నాయకుడు అని అర్థం. అటువంటి మూగవాళ్లలో చైతన్యం తీసుకురావాలని ఈ పత్రికను కొనసాగించి, విప్లవాలు జరిపి, ఉద్యమాలు చేసినటువంటి మహానాయకుడు గురించి ఈనాడు మాట్లాడే అవకాశం కలగడం నా అదృష్టంగా భావిస్తున్నాను. ఈ అవకాశం కల్పించినటువంటి మీకు హృదయపూర్వకమైన  ధన్యవాదాలు తెలియజేసుకుంటూ ఈ రోజు నుండి కూడా అంబేద్కర్ ఆశయాలు మనం ఆకళింపు చేసుకుని, ఆచరణ మార్గంలో

పెట్టి అప్పుడు నిజమైనటువంటి నివాళులు అర్పించాలని కోరుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

డా.ఏ.ఎస్.రామకృష్ణ (ఉపాధ్యాయ నియోజకవర్గం, కృష్ణా, గుంటూరు)ః అధ్యక్షా, డా.బాబాసాహెబ్ అంబేద్కర్ గారి 125వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఇవాళ శాసనమండలిలో ఒక ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా మాట్లాడేటటువంటి అవకాశాన్ని మీరు కల్పించినందుకు నా ధన్యవాదాలు. ఇది నా అదృష్టంగా భావిస్తున్నాను. ఇవాళ అంబేద్కర్‌గారు జన్మించి 125 సంవత్సరాలు గడిచిన తరువాత he is becoming increasingly relevant అనుకుంటున్నాను. ఉదాహరణకు ఇటీవల బి.యిడి. సిలబస్ మార్చారు. నేను 30 సంవత్సరాల పాటు బి.యిడిలో ఫిలాసఫీ బోధించాను. అయితే, ఏనాడూ అంబేద్కర్ ఫిలాసఫీ గురించి నేను బోధించలేదు. ఈ సంవత్సరం కొత్తగా తయారుచేసిన బి.యిడి ఫిలాసఫీలో Ambedkar Philosophy of Education అనే సబ్జెక్టుని సిలబస్‌లో ఇంక్లూడ్ చేశారు. అంటే దానర్థం Ambedkar has become relevant in the 21st Century అనేటటువంటి ఒక కంక్లూషన్‌కి బహుశా మేధావులు వచ్చారని నేను అనుకుంటున్నాను.

ఒకసారి మనం ఆలోచించనట్లయితే ఇవాళ అంబేద్కర్ ఒక మామూలు వ్యక్తి కాదు. నాకు ఒక్కొక్కసారి అనిపిస్తుంది. నేను ఒక్క పి.హెచ్‌డి చేయడానికే నానా తంటాలు పడ్డాను. అలాంటిది ఆయన 4 పి.హెచ్‌డిలు చేశాడు. అది కూడా మామూలు యూనివర్సిటీల్లో చేయలేదు. కొలంబియా యూనివర్సిటీ, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ వంటి విదేశీ వర్సిటీలతోపాటు, మనదేశంలోని బొంబాయి యూనివర్సిటీలో చదివారు. అటువంటి ప్రతిష్టాత్మక యూనివర్సిటీల్లో సీటు సంపాదించడమంటే గొప్ప విషయమని నేను అనుకుంటున్నాను. మామూలుగా ఏమనుకుంటారంటే, ఇంటలెక్చువల్స్ అంటే మనదేశంలో బాగా డబ్బున్నటువంటి వాళ్లు, సామాజికంగా ముందున్నటువంటి ఫార్వర్డ్ క్యాస్ట్‌లోనే మేధావులు ఉండేటటువంటి అవకాశం, ఆ పరిస్థితులు ఉన్నాయి. ఆ రోజుల్లో, అంత వివక్షత ఉన్నటువంటి పరిస్థితుల్లో కూడా ఆయన 4 పి.హెచ్‌డిలు చేయడమే కాదు, he proved himself that he is an intellectual. దీని ద్వారా ఏం తెలుస్తోందంటే విజ్ఞానానికి, క్రియేటివిటీకి కులం లేదు, మతం లేదు, ప్రాంతం లేదని ఈ సందర్భంగా మనం తెలుసుకోవాల్సిన అవసరముందని నేను అనుకుంటున్నాను.

అలాగే, అంబేద్కర్ గారు మనుస్మృతికి వ్యతిరేకంగా పోరాడారాయన. 1927 డిసెంబరు, 25 వ తారీకున ఆయన అనుచరులతో కలిసి మనుస్మృతిని తగులబెట్టిన చరిత్ర కూడా ఉంది. ప్రతి డిసెంబరు 25 వ తారీకున ఈ దినోత్సవాన్ని కూడా జరుపుకోవడం జరుగుతోంది. ఎందుకని, మనుస్మృతికి వ్యతిరేకంగా అంబేద్కర్ పోరాడాడు, ఎందుకని బుద్ధిజాన్ని అడాప్ట్ చేసుకోవడం జరిగిందని ఒక్కసారి మనం ఆలోచించినట్లయితే మనుస్మృతి ఒకరకంగా ఆలోచించినట్లయితే హిందూ మతానికి అనుకూలంగా ఉండేటటువంటి స్క్రిప్టు. కులానికి అనుకూలంగా ఉండేటటువంటిది. ఎక్కువ కులాలు, తక్కువ కులాలు అనేటటువంటి వర్ణ వ్యవస్థకి అనుకూలంగా ఉండేటటువంటి విధానం అందులో ఉంది. అటువంటి వ్యవస్థలో ఏదైతే చివరి వర్ణంలో ఉన్నటువంటి వాళ్లు

ఎవరైతే ఉన్నారో వాళ్లంతా శూద్రవర్ణం. బహుశా మనలో ఉన్నటువంటి వాళ్లలో ఎక్కువ మంది శూద్ర జాతికి సంబంధించినటువంటి వాళ్లం ఉన్నాము. ఇటువంటి వర్ణం వాళ్లే సమాజంలో ఆనాడు కూడా జనాభాలో ఎక్కువగా ఉండేటటువంటి పరిస్థితి ఉంది. సమాజంలో ఉన్నతవర్గం వాళ్లు ఎవరైతే ఉన్నారో బ్రాహ్మణులు, వైశ్యులు, క్షత్రియులు మున్నగు వాళ్లకే సమాజంలో విద్యావకాశాలు, సామాజిక అవకాశాలు, ఆర్థిక అవకాశాలు అన్నీ ఉండేవి. సమాజంలో సంఖ్య తక్కువగా ఉన్నటువంటి వాళ్లకి ఎక్కువ అవకాశాలు ఉండటం జరిగింది. అటువంటి వ్యవస్థ కడదాకా కొనసాగింది. అందువల్లే ఈ సమాజంలో అణగారినటువంటి వర్గాలు ఇప్పటికీ ఆ విధమైన వివక్షతకి లోనవ్వడం జరుగుతోంది. దీనికి వ్యతిరేకంగా ఆయన పోరాడారు. ఆనాటి సమాజంలో స్వయంగా, వ్యక్తిగతమైనటువంటి వివక్షతలకు ఆయన గురవ్వడం జరిగింది.

ఇందాకే సభ్యురాలు శ్రీమతి పి.శమంతకమణి గారు ఒక విషయాన్ని పేర్కొనడం జరిగింది. నా జీవితంలో కూడా అలాంటి సంఘటనలు ఉన్నాయి. మా ఊళ్లో కూడా నాకు ఒక మంచి దళిత మిత్రుడున్నాడు. ఒకసారి ఆ మిత్రుణ్ణి మా ఇంటికి తీసుకువస్తే, అతణ్ణి మంచం మీద కూర్చోవడానికి వీల్లేదని చెప్పి మా నాన్న గారు ఆపడం జరిగింది. మా నాన్న ఆ మాట అన్నందుకు నేను  ఆ రోజున కన్నీళ్ల పర్యంతం అయ్యాను. ఎందుకంటే, స్నేహానికి కులం అనేటటువంటిది ఉండదు. కానీ, నాకీ విషయాలన్నీ కూడా తెలియవు. స్నేహానికి కులం, మతం లేదు. ఈ విధంగా ఇంటలెక్చువాలిటీకి కులం లేదని అనడానికి అంబేద్కర్ గారి జీవితమే నిదర్శనమని ఈ సందర్భంగా మీకు విజ్ఞప్తి చేస్తున్నాను.

మ.1.50

డా. ఎ.ఎస్. రామకృష్ణ (కం):  ఒకసారి సమాజాన్ని గురించి మనం ఆలోచించినట్లయితే, అంబేద్కర్ గారు increasingly relevant అయ్యారని నేను అనుకుంటున్నాను. స్వాతంత్ర్యం వచ్చిన నాటినుండి నేటి వరకూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దళితుల అభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలు చేయడం జరిగింది. కానీ అక్షరాస్యత విషయంలో లెక్కలు చూసినట్లయితే, ముఖ్యంగా ప్రాథమిక పాఠశాలల్లో ఎప్పుడూ డ్రాపవుట్స్ అయ్యేవారిలో ఎక్కువ శాతం దళితులే ఉంటున్నారు. నిరక్షరాస్యత విషయంలో వాళ్లే ముందుంటున్నారు. ఇంతకుముందు సభ్యులు శ్రీ విటపు బాలసుబ్రహ్మణ్యం గారు చెప్పినట్లు రైల్వే స్టేషన్లలో, బస్ స్టాండ్‌లలో ఉండే అనాథలలో దళితులే ఎక్కువ మంది ఉంటున్నారు.  అనేకమైన రోగాలు ఉదాహరణకు కుష్టు రోగం, ఫిజికల్లీ హ్యాండీకాప్డ్, మెంటల్లీ హ్యాండీకాప్డ్ వాళ్లల్లో కూడా ఎక్కు వ మంది  దళితులే ఉంటున్నారు. ఈ విధమైన వ్యాధులు రావడానికి ప్రధానమైన కారణం పేదరికమని మనం దృష్టిలో పెట్టుకోవాలి. Social pattern, housing pattern చూసినట్లయితే, అటు గ్రామాలలో, ఇటు పట్టణాలలో ఆ వివక్షత ఇప్పటికీ కొనసాగుతున్నది. మనం మాట్లాడుకోవడం వేరు, ఆచరణ వేరు. ఎక్కడైనా మనం స్థలం కొనాలన్నా, ఇల్లు కొనాలన్నా చుట్టుపక్కల ఎవరు నివసిస్తారని ఆలోచిస్తాము. అక్కడ క్రిస్టియన్లు ఉంటారా లేకపోతే కమ్మ, రెడ్లు నివసిస్తున్నారా అనే దానిని ప్రాతిపదికగా తీసుకుని మనం స్థలాలు, ఇండ్లు కొంటాము. అటువంటి పరిస్థితిని ఇవాళ మనం చూస్తున్నాము. ఇన్ని అభివృద్ధి కార్యక్రమాలు జరిగిన తరువాత కూడా గ్రామాలలో ఇప్పటికీ isolated పరిస్థితులలో దళితులు నివసిస్తున్నారనే వాస్తవాన్ని అంగీకరించక

తప్పదు. వాళ్లందరూ కూడా విస్తృత సమాజంలో integrate అయినప్పుడే సమసమాజం సాగించినట్లు అవుతుంది.

అంబేద్కర్ గారు కేవలం దళితులకోసమే పోరాడారని నేను అనుకోవడం లేదు. సమసమాజం కోసం కలలు కన్నారు. ఈ సమాజంలో దళితులు వేల సంవత్సరాలుగా అణచివేతకు గురికాబడ్డారు. వారే కాదు, అణచివేతకు గురయిన వర్గాలన్నీ కూడా పైకి రావాల్సిన అవసరం ఉంది. సమసమాజం కోసం అందరూ కృషి చేయవలసిన అవసరం ఉంది. ఈ కుల వ్యవస్థను వ్యతిరేకించవలసిన అవసరం ఉంది. చరిత్రను చూసినట్లయితే మనం కోరుకునే మార్పు మనం చూస్తుండగా రాకపోవచ్చు. నిజం చెప్పాలంటే, ఒక వ్యక్తి మనిషిగా తయారు కావాలంటేనే 23 సంవత్సరాలు పడుతుంది. మరి అటువంటిది ఒక సమాజంలో మార్పు రావాలని మనం అనుకున్నప్పుడు, మనం కోరుకున్నప్పుడు రాదు. కాకపోతే, మనం కలలు కన్న సమాజం మన తరంలో కాకపోయినా ముందు తరాలకైనా వస్తుందనే ఆశతో అంబేద్కర్ గారు కలలు కన్నారు. ఆయన ఎకనామిక్స్ చదువుకున్నారు. ఈనాటి మన మంత్రివర్యులు శ్రీ రావెల కిషోర్‌బాబు కూడా అదృష్టవశాత్తు అప్లైడ్ ఎకనామిక్స్ చదివారు. అంబేద్కర్ కలలకు సూచికలుగా ఈనాటి రాష్ట్ర ప్రభుత్వం కూడా దళితుల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలను చేస్తున్నది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఈ విధంగా అభివృద్ధి కార్యక్రమాలు చేసుకుంటూ పోతే ఖచ్చితంగా సమసమాజం ఏర్పడక తప్పదు. అంబేద్కర్ కలలు కన్న సమాజం ఏర్పడుతుందని భావిస్తూ, నాకు ఈ అవకాశం కల్పించినందుకు మరొక్కసారి ధన్యవాదాలు తెలియచేస్తున్నాను.

శ్రీ కలిదిండి రవికిరణ్ వర్మ(పట్టభద్రుల నియోజకవర్గం, తూర్పు, పశ్చిమగోదావరి): అధ్యక్షా, నాకు ఈ అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలియచేస్తున్నాను. మన భారతదేశంలో 125 కోట్ల మంది ప్రజలు ఇంత ప్రశాంతంగా ప్రజాస్వామ్య వ్యవస్థలో ఉన్నారంటే అందుకు కారణం డా. బి.ఆర్. అంబేద్కర్ గారు. వారిని మనం ఎంతో భక్తిగా పూజించాల్సిన అవసరం ఉంది. అంతేకాకుండా ఇవాళ జనాభా పరంగా చైనాతో పోల్చి చూస్తే ఆ దేశం ప్రజాస్వామ్య పద్ధతిలో లేదు. ప్రభుత్వం ఏదనుకుంటే అదే చేస్తుంది కానీ, మన దేశంలో అలా కాదు. ప్రజాస్వామ్య విధానాలను కింది స్థాయి నుండి చర్చించి ఆ విధానాలను అమలు చేసేందుకు వీలుగా ఉండేందుకు కృషి చేసిన అంబేద్కర్ గారి కృషి అనన్యసామాన్యమైనది. సౌకర్యాలు అంతగా అందుబాటులో లేని కాలంలో ఆయన అనేక దేశాలు తిరిగి సమాచారాన్ని సేకరించి పటిష్టమైన రాజ్యాంగాన్ని ఏర్పాటు చేశారు. ఇంటర్నెట్‌లు, ట్విటర్లు, ఫేస్‌బుక్‌లు ఉండే ఈ కాలంలో ఏదైనా సమాచారం కావాలంటే మనకు నిముషాలలో అందుబాటులోకి వస్తుంది. కానీ, ఆనాడు ఆయన చేసిన struggle ఏదైతే ఉందో అది చాలా గొప్పదని ఈ సందర్భంగా మనవిచేస్తున్నాను. అంతేకాకుండా, ఆయన ఆశయాలను మనం నెరవేర్చాలంటే ప్రాథమిక విద్యను బలోపేతం చేయడమే ప్రధాన కారణమని, తద్వారానే సమసమాజ ఏర్పాటు సాధ్యమవుతుందని నేను భావిస్తున్నాను. డే కమ్ రెసిడెన్షియల్ ఇంగ్లీష్ మీడియం ప్రైమరీ స్కూల్స్ నుండి ఉన్నటువంటి విద్యా వ్యవస్థను మనం బలోపేతం చేయగలిగితే ఇప్పుడున్న వెనుకబాటుతనాన్ని మనం నిర్మూలించవచ్చు. భారతదేశంలో అత్యున్నతస్థాయి వరకూ చదువుకుని విదేశాలకు వెళ్లి చాలామంది అక్కడ సెటిల్ అయ్యారు. ఇంతకుముందు పెద్దలు

చెప్పారు. అక్కడ ఇటువంటి వ్యవస్థ లేదు. మన దేశంలో కింది స్థాయిలోనే ఈ సమస్య ఉన్నది. దానికి డబ్బు సమస్య కాదు. ఎడ్యుకేషన్ సమస్యగా ఉన్నది. విద్యను అందరికీ సమానస్థాయిలో అందజేయగలిగితే మనం ఈ సమస్యను అతి త్వరలోనే ఓవర్‌కమ్ చేయవచ్చు. ఇందుకు మనమందరం కూడా కృషి చేయాలని తెలియచేసుకుంటున్నాను.

డా. బి.ఆర్. అంబేద్కర్ గారు టీచర్, ఎకనామిస్ట్, లాయర్, పొలిటీషియన్. బాంబేలో first Legislative Council Member గా చేశారు. అదే విధంగా మనమందరం కూడా కౌన్సిల్ లో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నాను. 1956, అక్టోబర్, 14న ఆయన బౌద్ధ ధర్మాన్ని స్వీకరించడం ఎంతో ఆదర్శమైనది. మన ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడు గారు కూడా కొత్త రాజధానికి అమరావతి అని నామకరణం చేయడం, బుద్ధ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం కూడా చాలా ఆదర్శంగా భావిస్తూ నాకు ఈ అవకాశాన్ని ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలియచేస్తూ, సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ మేకా శేషు బాబు : అధ్యక్షా, డా. బాబా సాహెబ్ అంబేద్కర్ గారి గురించి మాట్లాడే అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలియచేస్తున్నాను. భారత రాజ్యాంగ నిర్మాత, ప్రపంచ మేధావి, భారతదేశానికి దశ దిశ నిర్దేశించినటువంటి మహా మేధావి, మహోన్నత వ్యక్తి అంబేద్కర్ గారు. ప్రపంచానికంతటికీ, భారతదేశం దిక్సూచిలా పయనిస్తున్నదంటే అది డా. అంబేద్కర్ గారి చలవేనని నేను ఈ సందర్భంగా తెలియచేస్తున్నాను. వారి యొక్క ఆశయాలు, ఆదర్శాలు భవిష్యత్తరాల వారికి అందించే విధంగా మనం ముందుకు నడవవలసిన అవసరం ఎంతైనా ఉంది. వారు కన్నకలలు, వారు అనుకున్న కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో ఇంకా పూర్తిగా అందవలసిన అవసరం ఉంది. నేటికి అంటరానితనం, అస్పృశ్యత, చిన్నచూపు, వివక్ష అంశాలలో కొంతవరకూ మార్పు వచ్చినా, ఇంకా రావలసిన అవసరం ఎంతైనా ఉన్నదని సభా ముఖంగా తెలియచేస్తున్నాను. ముఖ్యంగా దళిత ఉద్యోగులు, దళిత ప్రజాప్రతినిధులపైన పెత్తందారీ వ్యవస్థ ప్రభావం చాలాచోట్ల కనిపిస్తున్నదని ఈ సందర్భంగా తెలియచేస్తున్నాను.

మ. 2.00

వీటన్నింటిలో కూడా మార్పు రావలసినటువంటి అవసరముంది. వారికి తగినటువంటి గౌరవం, తగినటువంటి స్వేచ్ఛ ఇచ్చినపుడే వారిలో కూడా ఒక రకమైనటువంటి నైతిక బలం ఉంటుందనే విషయాన్ని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. ఈనాడు మనమంతా డా.బి.ఆర్. అంబేద్కర్ గారిని ఒక దేవుడిగా కొలిచేటటువంటి పరిస్థితి ఉంది. ఆనాడు మహాత్మాగాంధీ గారు మన దేశానికి స్వాతంత్ర్యాన్ని తీసుకురావడానికి ఎంత కృషిచేయడం జరిగిందో, ఆ స్వాతంత్ర్యం తీసుకువచ్చిన తర్వాత దానిని కాపాడుకోవడం కోసం కూడా మనం కృషి చేయవలసిన అవసరముంది. మన దేశాన్ని ప్రజాస్వామిక దేశంగా ఈనాడు పెద్దలంతా చెప్పడం జరిగింది. నాణానికి ఒకవైపు ఆనాడు మహాత్మాగాంధీ గారు ఏ రకంగా స్వాతంత్ర్యాన్ని తీసుకురావడానికి కృషి చేశారో, ఈదేశం

శాంతి సామరస్యాలతో కానివ్వండి, ప్రజాస్వామిక దేశంగా ఉండడానికి కానివ్వండి, నాణానికి రెండవవైపు డా.బి.ఆర్.అంబేద్కర్ గారు కృషిచేసిన పరిస్థితి మనందరికీ కూడా తెలుసని ఈ సందర్భంగా నేను తెలియజేస్తున్నాను.

ఎస్సీ, ఎస్టీ, బడుగు వర్గాల అభివృద్ధికోసం, పేదరికాన్ని, కులవివక్షతను రూపుమాపడం కోసం డా.బి.ఆర్.అంబేద్కర్ గారు ఏరకంగా కష్టపడ్డారు, ఏరకంగా ఆయన ఇబ్బందులు పడ్డారు, ఆయనే కనుక లేకపోతే ఈ భారతదేశం ఏరకంగా ఉండేది, ఈ వ్యవస్థ ఏరకంగా ఉండేదనే ఆందోళన ప్రతి ఒక్కరిలో కూడా కలుగుతున్నటువంటి పరిస్థితి ఉందని ఈ సందర్భంగా నేను తెలియజేస్తున్నాను. ఆయన అందించిన రాజ్యాంగ నిర్మాణం ద్వారా నేడు ప్రజాస్వామిక దేశంగా మనం మనదేశాన్ని కాపాడుకోవలసినటువంటి అవసరముంది. ఆయన 125 వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకోవలసిన అవసరముందని ఈ సందర్భంగా తమరిద్వారా ప్రభుత్వానికి తెలియజేస్తున్నాను.

మహాత్మాగాంధీ గారి విగ్రహాలు నేడు ప్రతిచోట ప్రతిష్టించడం జరుగుతోంది. కానీ, డా.బి.ఆర్. అంబేద్కర్ గారి విగ్రహాలు కొన్ని దళితవాడల్లో మాత్రమే ఒక జాతికో, ఒక మతానికో సంబంధించిన వ్యక్తిగా పెట్టడం జరుగుతోంది. మహాత్మాగాంధీ గారి విగ్రహాలను ఏరకంగా పెట్టడం జరుగుతోందో అదే రకంగా డా.బి.ఆర్.అంబేద్కర్ గారి విగ్రహాలను కూడా పెట్టుకుని భారతజాతికి భారతరత్నగా ఆయనను కొలుచుకునే పరిస్థితి రావాలని ఈ సందర్భంగా నేను తెలియజేస్తున్నాను.

నూతన రాజధానిలో కూడా డా.బి.ఆర్.అంబేద్కర్ గారి విగ్రహాలను శాసనసభ హాలులో, శాసనపరిషత్తు హాలులో పెట్టే విధంగా ఈ రాష్ట్రప్రభుత్వం ఒక తీర్మానం చేయాలని వై.యస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ తరఫున కోరుకుంటూ, అందరికీ ధన్యవాదాలు తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీమతి గుమ్మిడి సంధ్యారాణి: అధ్యక్షా, భారతరత్న, భారత రాజ్యాంగ నిర్మాత డా. బి.ఆర్. అంబేద్కర్ గారి గురించి మాట్లాడడమే చాలా అదృష్టంగా భావిస్తూ, గౌరవప్రదమైనటువంటి ఉన్నతమైనటువంటి ఈ సభలో ఒక గిరిజన మహిళగా నాకు ఇక్కడ ఒక అవకాశం వచ్చిందంటే, ఆయన రచించినటువంటి రాజ్యాంగమే కారణం. లేకపోతే నేను ఈనాడు ఇక్కడ ఉండేదానిని కాదు, ఇలా మాట్లాడేదానిని కాదు. ఆయన వ్రాసిన రాజ్యాంగ స్ఫూర్తితో ఈనాడు చట్టసభల్లో గానీ, బయటగానీ సమసమాజం స్థాపించడానికి అందరికీ సమానత్వం ఇవ్వడానికి ఎన్నో ప్రయత్నాలు ఎంతోమంది మహానుభావులు చేస్తూ ఉన్నారు. ఇంతకుముందు సభలో మాట్లాడిన పెద్దలంతా కూడా అన్ని విషయాలను చెప్పారు. ఇంకా మన పల్లెల్లో ఉన్నటువంటి తారతమ్యాల గురించి చాలామంది తమ స్వంత అనుభవాల గురించి కూడా చెప్పారు. మాకు కూడా చాలా అనుభవాలు ఉన్నాయి. ఉదాహరణకు, మా గ్రామం పేరు కొండపేట గ్రామం, అది ఊరికి చాలా దూరంగా ఉంటుంది. మాగ్రామంలో రోడ్డుకు ఇటువైపు కొండపేట ఉంటే, రోడ్డుకు అటువైపు ఎస్సీ కాలనీ ఉంటుంది. ఊరు మధ్యలో ఉంటుంది. అటువంటి ఒక గ్రామంలో వేరే కులాల వారు మమ్మల్ని వారి ఇళ్లకు రానివ్వని పరిస్థితి కూడా ఉండేది. మా నాన్నగారు

శాసనసభ్యులు కాబట్టి ఆయనను ఒక్కరినే రానిచ్చేవారు. నేను ఆ గ్రామం పేరు చెప్పదలచుకోలేదు. అలాంటి గ్రామం నుంచి నేడు కొంతవరకూ ఫర్వాలేదనే పరిస్థితి వచ్చింది. అంటే, నేటికి కూడా కులాల్లో తారతమ్యం కన్పిస్తూ ఉంది. ఆనాడు మహానుభావులు డా.అంబేద్కర్ గారు ఎంత బాధ పడ్డారో అటువంటి బాధలు నేటికి కూడా చాలామంది అనుభవిస్తున్నారు. పెళ్లి జరిగితే వంట పనివారు వండితే తింటారు గానీ ఆ కులం వారు వండితే తినరు. ఇప్పటికీ అది ఇంకా గ్రామాల్లో ఉందని అంటే మనం ఇంకా ఎక్కడున్నామో దయచేసి ఆలోచించాలని నేను ప్రతి ఒక్కరినీ కోరుకుంటున్నాను. ఈ మార్పు అనేది మనలోనే కాదు, బయట సమాజంలోనే రావాలి. సమాజంలో ఆ మార్పు వస్తేనే మనం ఇంతవరకూ ఆ మహానుభావుడి గురించి మాట్లాడుకునేదానికి అర్థం ఉంటుందని నేను భావిస్తున్నాను.

మహిళలకు ఆస్తి హక్కుగానీ, అందరూ సమానంగా ఉండాలంటే సమానత్వం కోసం చదువుకోవాలని గానీ ఆనాడు అంబేద్కర్ గారు ఏ ఆశయంతో అన్నారోగానీ, తరువాత తరంలో స్వర్గీయ ఎన్.టి.రామారావు గారు ఎస్సీ, ఎస్టీలకు పాఠశాలలను ఏర్పాటుచేసేటపుడు ఆ పాఠశాలలు కొండ ప్రాంతంలో ఏర్పాటుచేస్తున్నారు, అక్కడకు వెళ్లి ఎవరు చదువుకుంటారని అనేవారు. కానీ, నేడు ఆ పాఠశాలల్లో సీట్లు దొరకని పరిస్థితి ఉంది. ఎస్సీ, ఎస్టీలకు పెన్షన్లు ఇస్తే ఆర్థికంగా సమానత్వం చూపిస్తారని పెన్షన్లు, కార్డులు కూడా ఇచ్చారు. అప్పుడు స్వర్గీయ ఎన్.టి.రామారావు గారు ఇంటిగ్రేటెడ్ కాలనీలను ఏర్పాటుచేసి అందరినీ ఒకేచోట ఉంచితే సమానత్వం కలుగుతుందని భావించి అన్ని వర్గాలకోసం కాలనీలను ఏర్పాటుచేశారు. ఆ తరహాలోనే ఇది ఎస్సీకాలనీ, ఇది ఎస్టీ కాలనీ అని పిలవకుండా ఇంటిగ్రేటెడ్ కాలనీలు ఏర్పాటుచేసినట్లయితే సమానత్వం వస్తుందని నేను సూచిస్తున్నాను. ఒకవేళ ఎక్కడైనా ఒక ఎస్సీ, ఎస్టీ మిగిలిన కులాలన్నీ కూడా కలిపి ఒకచోట పెట్టినపుడు వారిని ఇంకా అలాగే వేరుగా చూసినట్లయితే అది ఇంటిగ్రేటెడ్ కాలనీ అవదు. ఆ తారతమ్యం ఉన్నప్పుడు అందరిలో ఉండి కూడా ఒంటరిగా బ్రతకడం కంటే వెళ్లి మా కులంలో మేము బ్రతికితే బాగుండునే అనే బాధ వారికి కలగనివ్వకుండా అందరూ కలిసిమెలిసి ఉండే విధంగా చేయాలి.

అధ్యక్షా, "అంటరానితనం నేరం" అని మనం పుస్తకాలలో చూస్తున్నాము. కానీ, గ్రామాల్లో ఇంకా అది అమలు కాలేదు. నేటికి కూడా అట్రాసిటీ కేసులు పెడుతుంటే దాదాపు 80 శాతం కేసులు పూర్తిగా నీరుగారిపోతున్నాయి. దానికి కారణం, గ్రామాల్లో ఉన్నటువంటి రాజకీయ నాయకుల లబ్ధికోసం ఎవరో ఒక ఎస్సీతోనో, ఎస్టీతోనో వారికి పడనివారిమీద కేసులు పెట్టిస్తున్నారు. అటువంటి ఒకటి లేదా రెండు తప్పుడు కేసులవల్ల దెబ్బలు తిన్నటువంటి, తిట్లు తిన్నటువంటి, బాధలు పడినటువంటి వారి నిజమైనటువంటి కేసులు కూడా నీరుగారిపోతున్నాయి. అటువంటి కేసులను దయచేసి సున్నితంగా పరిశీలించాలని నేను తమరిద్వారా కోరుకుంటున్నాను.

అధ్యక్షా, పూజ్యులు జస్టిస్ పున్నయ్య గారు చెప్పిన విధంగా ఎస్సీ, ఎస్టీ కేసులను ఒక డి.ఎస్.పి. వచ్చి విచారణ చేపట్టడం ఈ మధ్యకాలంలో జరుగుతోంది. కాకపోతే నెలరోజుల సమయంలో డి.ఎస్.పి. గారు వచ్చినపుడు ఎవరూ ముందుకు వచ్చి ధైర్యంగా

చెప్పలేకపోతున్నారు. అటువంటి పరిస్థితులు కూడా ఉన్నాయి కాబట్టి దయచేసి సమాజమే మారాలి. డా.బి.ఆర్.అంబేద్కర్ గారు ఏ ఆశయాలతో రాజ్యాంగాన్ని రచించారో ఆ ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషిచేయవలసినటువంటి అవసరముందని తమరిద్వారా నేను తెలియజేసుకుంటున్నాను.

అమరావతిలో అంబేద్కర్ భవనాన్ని నిర్మించి, ఆ భవనంలో అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటుచేసి, అక్కడ అంబేద్కర్ గ్రంథాలయాన్ని కూడా ఏర్పాటుచేయాలని గౌరవనీయులు, ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడు గారు చెప్పినందుకు తమరిద్వారా వారికి నా ధన్యవాదాలను తెలియజేసుకుంటున్నాను.

విద్యకు అధిక ప్రాధాన్యతను ఇచ్చి చాలామంది విద్యార్థులకు రుణాలను కూడా ఏర్పాటుచేయడం జరిగిందని మంత్రిగారు కూడా చెప్పారు. అయితే, ఈ మధ్యకాలంలో ఇంజనీరింగు చదివినా, డిగ్రీ చదివినా, పోస్ట్‌గ్రాడ్యుయేషన్ చదివినా యువకులు ఆటోలను నడుపుకోవలసి వస్తోంది. కాబట్టి, ఇంతకుముందు పెద్దలు చెప్పినట్లు ప్రభుత్వ సంస్థల్లో ఉద్యోగాల కోసం రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను పాటిస్తున్న విధంగా, ప్రయివేటు సంస్థల్లో కూడా రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను పాటించే విధంగా చూడాలి. ఎందుకంటే, కొన్ని ప్రయివేటు విద్యా సంస్థల్లో ఎస్సీ, ఎస్టీలకు కొన్ని సీట్లు ప్రభుత్వం ఏర్పాటుచేసింది. అదేవిధంగా, ప్రయివేటు ఉద్యోగాల్లో కూడా కొంత రిజర్వేషన్లను ఏర్పాటుచేసినట్లయితే సమానత్వం ఏర్పడి ఇంజనీరింగు మరియు డిగ్రీ చదివిన పిల్లలకు ఉద్యోగావకాశాలు వస్తాయని తమరిద్వారా నేను తెలియజేస్తున్నాను. అంతటి మహానుభావుడు, మహనీయుడు స్వర్గీయ డా.బి.ఆర్.అంబేద్కర్ గారి గురించి సభలో మాట్లాడడానికి నాకీ మంచి అవకాశం ఇచ్చినందుకు తమరికి నా ధన్యవాదాలను తెలియజేసుకుంటూ సెలవుతీసుకుంటున్నాను.

మ. 2.10

శ్రీ రావెల కిషోర్‌బాబు: అధ్యక్షా, ఇది చాలా చారిత్రాత్మక పరిణామం. చాలా ఉద్వేగభరిత మైన వాతావరణంలో మనం బాబా సాహెబ్ అంబేద్కర్‌గారి జీవిత విశేషాలను, ఆయన స్ఫూర్తిని, చైతన్యాన్ని ఆయన మనకందించిన దార్శనికతను, రాజ్యాంగాన్ని గురించి, ఆయన ఆశలు, ఆశయాలు, ఆదర్శాలు అమలుచేయడానికి సూచనలిస్తూ, సమసమాజ స్థాపనలో మనందరమూ కూడా భాగస్వాములు కావాలనే కోణంలో ఇది నిజంగా మంచి చర్చ.

డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్‌గారు మహానుభావుడై, అంత పెద్ద నాయకుడై, తాడిత, పీడిత, బడుగు, బలహీనవర్గాల విమోచకుడుగా, విముక్తిదాతగా, రక్షకుడుగా ఎదగడానికి ప్రధానంగా ఆయన్ని ప్రభావితం చేసినటువంటి ముగ్గురు వ్యక్తుల్ని ఈరోజు మనం జ్ఞాపకం చేసుకోవాలి. అలా చేయడంవల్ల మనకు కొంత స్ఫూర్తి కూడా ఉంటుంది. మొదటిది జ్యోతిబాపూలేగారిని ఆయన తన గురువన్నారు. ఆనాడు నోటికి ముంత,

ముడ్డికి చీపురు, మెడకు గంట కట్టుకున్నటువంటి రోజుల్లో, మనష్యులను మనుష్యులుగా చూడనటువంటి సమయంలో ఊరికి ఉత్తరాన దూరంగా విసిరివేయబడి అంటరాని కులాలుగా పిలవబడుతున్నటువంటి కోట్లాదిమంది ప్రజలు ఆనాడు విద్యకు, ఉపాధికి నోచుకోక జంతువులకన్నా హీనంగా చూడబడుతున్నపుడు జ్యోతిబాపూలేగారు, సావిత్రిబాయిఫూలేగారు చేసినటువంటి ఉద్యమం ప్రభావం బాబా సాహెబ్ అంబేద్కర్‌గారిపైన పడడంవల్ల, ఆయన ప్రభావితుడై మొట్టమొదట ఆయన ఉద్యమ బీజాలు, పరివర్తన బీజాలు, ఆయన భవిష్యత్ పోరాటంయొక్క బీజాలన్నింటినీకూడా పూలేగారిద్వారా సంక్రమించాయని ఈ సభకు నేను తెలియజేస్తున్నాను.

ఆ తరువాత ప్రధానంగా ఇద్దరు వ్యక్తులు ఆయన్ని ప్రభావితం చేశారు. మొదటిది ఆనాటి మైసూర్ సంస్థానాధిపతి సాయాజీరావు గైక్వాడ్‌గారు, రెండవవారు బరోడా మహారాజ్ సాహూమహారాజ్ గారు. ఈ ఇద్దరూ కూడా బాబా సాహెబ్ అంబేద్కర్‌గారు అంతటి ఉన్నతమైన స్థాయికి ఎదగడానికి పునాదులు వేసిన వ్యక్తులు. పూలేగారు భావాజాలాన్ని, స్ఫూర్తిని, చైతన్యాన్ని అందించగా, మైసూరుమహారాజుగారు ఆ రోజుల్లో అంబేద్కర్‌గారి విదేశీ విద్యకు స్కాలర్‌షిప్‌ను అందచేశారు. ఆరోజు కనుక వారికి విదేశీవిద్యకు స్కాలర్‌షిప్ ఇవ్వకపోతే, ఆనాడు ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న కమ్యూనిజం, మార్క్సిజం, ఫ్రెంచ్ రెవెల్యూషన్, అమెరికాలో నీగ్రోలు చేసినటువంటి ఉద్యమాల ప్రభావం ఆయనమీద పడేదికాదు.

మొట్టమొదటిసారి ఆయన్ని ముట్టుకుంది తెల్లవాళ్ళు. ఆయన అక్కడ చదువుకోవడానికి వెళ్ళినప్పుడు ఒక తెల్లవ్యక్తి ముట్టుకుంటే అంబేద్కర్‌గారు వెనక్కి జరిగారు. ఏంటి అంబేద్కర్, నేను ముట్టుకుంటే వెనక్కు వెళుతున్నావని వారు అడిగినప్పుడు అంబేద్కర్‌గారు ఏడ్చారు. నా దేశంలో నన్నెవరూ ముట్టుకోరు, కానీ ఇక్కడ మీరు ముట్టుకుంటున్నారంటే నేను కూడా ముట్టుకోవడానికి అర్హుడినన్నమాట అని చెప్పి మొట్టమొదటిసారిగా బాబాసాహెబ్ అంబేద్కర్‌గారు కన్నీళ్ళ పర్యంతమయ్యారు. అప్పటినుంచి ఆయనలో ఉన్నటువంటి ఆ భావజాలం, తిరుగుబాటు ధోరణి, సమాజాన్ని మార్చాలనే తపన, ఉద్యమాల ప్రభావాలు ఆయనమీద పడి అక్కడి నుంచే సమాజ పరివర్తనకు పునాదులు వేసుకుంటూ వచ్చారు. దానికి మూల కారణం సాయాజీరావుగైక్వాడ్‌గారు. ఈ సందర్భంగా వారిని తప్పకుండా మనం జ్ఞాపకం చేసుకోవాల్సిన అవసరముంది. ఆ తరువాత బరోడా మహారాజ్‌గారు చాలా ఉదాత్తవాది. మొట్టమొదటిసారి భారతదేశంలో 1920వ సంవత్సరంలో బడుగు, బలహీన వర్గాల కోసం రిజర్వేషన్స్ తీసుకువచ్చినటువంటి మహానుభావుడు సాహూ మహారాజ్. ఆయన ఈ దళిత వర్గాల ప్రజలందర్నీ కూడా సమీకరించి, అంబేద్కర్‌గారిని అక్కడ కూర్చోబెట్టి, ఆయన అధ్యక్షతన అంబేద్కర్‌గారి చెయ్యి చూపించి ఇదిగో మీ నాయకుడు, మిమ్మల్ని విడుదల చేసే మెస్సయ్య, ఈయన మీకు కాబోయే రక్షకుడు. ఈయన మాట వినండి. ఈయన మీకోసం పోరాడతాడు. మీకోసం ఉద్యమిస్తాడు. ఈయన మాట వింటే మీరు విడుదలవుతారు. మీరు బాగుపడతారని చెప్పి మొట్టమొదటిసారిగా ఆయన్ని నాయకుడుగా పరిచయం చేసింది సాహూ మహారాజ్ గారు. వీళ్ళిద్దరూ కూడా అంబేద్కర్‌గారికి పునాదులు వేసి ఆయన నాయకుడుగా ఎదగడానికి మహాసౌధం

కట్టుకోవడానికి పునాదులు వేసినటువంటి నాయకులు. వాళ్ళకు నిజంగా కృతజ్ఞతలు తెలియజేయాల్సినటువంటి అవసరముంది.

అంతేగాకుండా భావసారూప్యతగల అంబేద్కర్‌గారు ఒక మాట అన్నారు. ఈ భారతదేశంలో కోట్లాదిమంది మూగజీవులు ఎవరైతే ఉన్నారో తాడిత, పీడిత, బడుగు, బలహీనవర్గాలు, ఊరికి ఉత్తరాన అంటరానితనంతో కుంగి, కృశించిపోతూ, జంతువులకన్నా హీనంగా చూడబడుతున్నటువంటి నా జాతి ప్రజలకు హక్కులు గనుక నేను సాధించలేకపోతే నన్ను నేను తుపాకీతో కాల్చుకుని చస్తానన్నారు బాబా సాహెబ్ అంబేద్కర్. ఎవరంటున్నారు అధ్యక్షా ఈ మాట. భారతదేశంలో ఎంతోమంది విప్లవకారుల్ని, ఉద్యమకారుల్ని, ఉద్యమాలు చేసి త్యాగాలు చేసినవాళ్ళను చూశాం కానీ నన్ను నేను తుపాకీతో కాల్చుకుని చస్తాను అని అంటే ఈ జీవితానికి అర్థం, పరమార్థం ఈ ప్రజలను విడుదల చేయడమే. ఆయన అన్న ఆ మాట మా మనసుల్లో బలంగా గింగిర్లు తిరుగుతూ జ్ఞాపకం వస్తున్నప్పుడు ఉద్వేగం, ఉత్సాహం, స్ఫూర్తి చైతన్యం వస్తుంది. అంతేగాకుండా పాలస్తీనా దేశంలో యూదులనుభవించే వివక్షను, అమెరికాలో నీగ్రోలనుభవించే రేసిజం, వర్ణ వివక్షను, భారతదేశంలోని అంటరానితనాన్ని, ఈ మూడింటిని వారు కంపేర్ చేస్తూ.. untouchability is the worst form of discrimination in the entire world అని అన్నారు. అంటే రేసిజం కన్నా, నల్లజాతి తెల్లజాతి వివక్షకన్నా, యూదులనుభవించే వివక్షకన్నా అంటరానితనమనేది చాలా ఘోరమైన వివక్ష అని ఆయన ఆరోజుల్లోనే చెప్పినటువంటి మాటను ఒకసారి మనం గుర్తుచేసుకోవాలి.

అంతేగాకుండా, ఆయన ఎన్నోసార్లు ఈ ప్రజలకోసం పోరాడుతూ, వివరిస్తూ, వారిని చైతన్యపరుస్తున్నప్పుడు, వారు చెప్తున్న సమానత్వం, సమసమాజం, వివక్షలాంటివి ఏవీ ప్రజలకు అర్థమయ్యేవి కాదు. ఆ రోజుల్లో దళితులకు ఈ భావాజాలం కొత్త. వాళ్ళకు అర్థమవకపోవడంతో అంబేద్కర్‌గారు ఇంటికెళ్ళి తలుపు గడియ వేసుకుని ఒంటరిగా ఏడ్చేవారంట. అయ్యో నా జాతి ప్రజలకు ఏది కావాలో వాళ్ళకు తెలియడంలేదు. నేను దీనికోసం పోరాడదామన్నా, ఇది మనకు కావాలన్నా, ఈ వివక్ష పోవాలన్నా వాళ్ళకు అర్థం కావడంలేదు. ఎప్పుడు వీళ్ళని బాగుచెయ్యాలి. ఎలా చైతన్యం తేవాలి. ఎలా వీళ్ళని ఉద్యమాలవైపు నడిపించాలి. ఎలా సమీకరించాలి. ఎలా బోధించాలని ఆయన ఒంటరిగా ఏడ్చినటువంటి రోజులు కూడా ఉన్నాయి. అంటే అంత పెద్ద ఎత్తున ఆయన స్ట్రగుల్ పడ్డారు. ఆయన వ్యక్తి కదా. ఒక రకమైన సంఘర్షణకు గురయ్యారు. ఆ సంఘర్షణ నుంచి ఒక ఉద్యమకారుడు ఆయనలో ఉద్భవించినట్లుగా మనం చూస్తాం.

అంతేగాకుండా ఆయన మొట్టమొదటి దశలో సామాజిక ఉద్యమాలు చేశారు. Kaivartas Movement (Calcutta), Namasudras (Faridpur, Bengal), Kayastha Movement, నాసిక్ టెంపుల్ పోరాటం లాంటివి చూస్తే మొట్టమొదట సామాజిక ఉద్యమాలతో మొదలుపెట్టినట్లు అర్థమవుతోంది. ఆ తరువాత ఆయన గమనించిన అంశమేమంటే ప్రజాస్వామ్యంలో రాజకీయ అధికారమనేది మాస్టర్ కీ. ఆ మాస్టర్ కీ చేతిలోకి వస్తే తప్ప ఈ సమాజాన్ని మనం మార్చలేమనే భావానికి గురై రాజకీయ పార్టీపెట్టి ఉద్యమాలు మొదలుపెట్టారు. Political power is the master key in Democracy, with which we can enlarge the doors of socio, economic,

cultural, educational so on and so forth అని అనే వారు. ఆ మాస్టర్ కీ మనచేతికొస్తే మిగతా రంగంలో ఉన్నటువంటి అసమానతలు కూడా మనం తప్పించుకోవచ్చని 1936 సంవత్సరంలో ఇండియన్ లేబర్ పార్టీ పెట్టి రాజకీయ ఉద్యమం మొదలుపెట్టారనే విషయం కూడా మనం గుర్తుచేసుకోవాల్సిన అవసరముంది. ఆ తరువాత భారతదేశ వ్యాప్తంగా పోటీచేసి ఎంతోమందిని గెలిపించుకున్నటు వంటి ఘనత కూడా ఆయనది. ఇక్కడ మన రాష్ట్రంలో బొజ్జా అప్పలస్వామిగారు ఆరోజుల్లోనే వారి పార్టీద్వారా గెలిచేవారు. ఆ విధంగా గెలిచినవాళ్ళు ఇంకా చాలామంది ఉన్నారు.

అంతేగాకుండా ఆయనది డైనమిక్ మూమెంట్. స్టాటిక్ మూమెంట్ కాదు. ఎప్పుడైనా సరే ఒక ఉద్యమం స్టాటిక్‌గా ఉంటే అది ఫలితాలు సాధించలేదు. మారుతున్నటువంటి కాలమాన పరిస్థితులకు అనుగుణంగా ఎత్తుగడలను, పోరాటపటిమను, ఫిలాసఫీని, స్ట్రాటజీని మార్చుకుంటూ ముందుకు పోయే వారు. ఎప్పుడైతే ఇండియన్ లేబర్‌పార్టీయొక్క స్ట్రాటజీ మార్చారో 1942 సంవత్సరంలో Depressed Classes League అనే పేరుమీద కూడా ఆయన పోటీ చేశారు. ఎందుకంటే, తమిళనాడులో రావు బహదూర్ శ్రీనివాసన్, ఎం.సి.రాజా అనే ఇద్దరు మహానుభావులు చాలా గొప్ప వ్యక్తులు. వారు తమిళనాడులో అంబేద్కర్‌గారికంటే ముందుగానే అంటరానితనం మీద పోరాటం మొదలుపెట్టారు. వారిరువురు అంబేద్కర్‌గారికి సమకాలికులు. ఉత్తరప్రదేశ్‌లో ఆది ధర్మ ఉద్యమాన్ని స్వామి అచ్యుతానంద హరిహర్ మొదలుపెట్టి అక్కడ అంటరాని కులాలవారినందర్నీ కూడా విడుదల చేయడం, అలా ఉత్తరప్రదేశ్, పంజాబ్‌లో ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్ళారు.

పశ్చిమబెంగాల్‌లో జోగేంద్రనాథ్ మండల్ అనే అతను నామశూద్ర ఉద్యమాన్ని తీసుకువచ్చి అక్కడున్న అంటరాని కులాల వారినందర్నీ సమీకరిస్తూ పోరాటాలు చేసుకుంటూ ముందుకు వెళ్తున్నారు. హైదరాబాద్‌నుండి భాగ్యారెడ్డి వర్మ అంటరానితనం మీద ఉద్యమం చేశారు. వారిపేరు అందరికీ సుపరిచితులే. భారతదేశ వ్యాప్తంగా అనేక ఉద్యమాలు జరుగుతున్నటువంటి నేపథ్యంలో వారందర్నీ సమీకరించి, ఒక గూటి మీదకి, ఒక తాటిమీదకి తీసుకువచ్చి Depressed Classes League ద్వారా కొత్త రూపాన్నిచ్చి భారతదేశ వ్యాప్తంగా ఆయన ఉద్యమం చేయడం మొదలుపెట్టారు.

మ. 2.20

అధ్యక్షా, 1978వ సంవత్సరంలో నేను అమరావతి కాలేజీలో రెండవ సంవత్సరం చదువుతున్నప్పుడు అంబేద్కర్ గారి పేరు మీద ఒక సంస్థను పెట్టి, పోరాటాలు చేసి, స్టూడెంట్స్ అందరం కలిసి జోలెపట్టుకుని అడుక్కుని అంబేద్కర్ గారి విగ్రహం పెట్టాము. అప్పటి నుండి అంబేద్కర్ గారి స్ఫూర్తితో, చైతన్యంతో ముందుకు వెళుతున్నాను. బాలయోగి గారు చనిపోయిన తరువాత, ఆయన దగ్గర ఓయస్‌డి గా పని చేస్తున్న నేను అక్కడి నుంచి షిఫ్ట్ అయిపోయి బాబాసాహెబ్ అంబేద్కర్ ఫౌండేషన్‌కు నేషనల్ డైరెక్టర్‌గా పనిచేశాను. నేను డైరెక్టర్‌గా పనిచేసినప్పుడు ఉస్మానియా యూనివర్శిటీకి పుస్తకాలను తెలుగులోకి అనువదింపచేశాము. ఇప్పటికీ ఆ ప్రాజెక్టు ఉంది. తమరు చెప్పినట్లుగా ఆ

ప్రాజెక్టును మరలా ప్రారంభిస్తాము. కాన్షీరామ్ గారు నాకు గురువు. ఆయన దగ్గర అంబేద్కర్ గారి యొక్క భావజాలాన్ని గురించి భారతదేశం అంతా తిరిగి లోతైన విషయాలను, ప్రజలకు సామాన్యంగా అర్థం కాని విషయాల గురించి అధ్యయనం చేశాము. ఎందుకంటే, అంబేద్కర్ గారి యొక్క ఆలోచనలను ముందుకు తీసుకువెళ్లిన వారిలో వారు అగ్రగణ్యులు. పూనా ఒడంబడిక జరగకముందు అంబేద్కర్ గారి మీద ఒత్తిడి వచ్చింది. గాంధీగారు చేస్తున్న ఆమరణ నిరాహార దీక్షను అంబేద్కర్గారు విరమించేటట్లు చేయకపోతే, గాంధీగారు చనిపోతే భారతదేశంలో ఉన్న దళితులను ఊచకోత కోస్తాము, దాడులు జరుగుతాయని హెచ్చరికలు వచ్చినప్పుడు అంబేద్కర్గారు చాలా ఘర్షణకు గురయ్యి ఒక మాట అన్నారు. Even if you hang me to the nearest lamppost, I will not give up the rights of my people. నన్ను ఆ కనిపిస్తున్న వీధి స్తంభానికి ఉరితీసి చంపినాకూడా నా జాతి ప్రజల యొక్క హక్కులను వదులుకోవడానికి సిద్ధంగా లేను". అన్నారు. ఎందుకంటే అప్పటికే రౌండ్‌టేబుల్ కాన్ఫరెన్స్‌ల ద్వారా మెక్‌డోనాల్డ్ కమ్యూనల్ అవార్డుని తీసుకువచ్చారు. సెపరేట్ ఎలక్టోరేట్స్‌ని వదులుకోవడానికి సిద్ధంగా లేరు. ఒకవైపు గాంధీగారు చనిపోవడానికి సిద్ధంగా ఉన్నారు, మరో ప్రక్క భారతదేశం అంతా అంబేద్కర్గారి మీద ఒత్తిడి తీసుకువస్తోంది. గాంధీ గారు చనిపోతే అందుకు అంబేద్కర్ గారు కారణం అవుతారని, ఆయని దేహాన్ని ముక్కలు ముక్కలుగా నరికివేస్తామని ఒకరు, అందరినీ ఊచకోత కోస్తామని మరొకరు అంబేద్కర్ గారిని బెదిరించారు. ఈ అంశాలన్నీ అప్పటి న్యూస్‌పేపర్స్‌లో వచ్చాయి. ఆ పేపర్ కటింగ్స్ ఇప్పటికీ ఉన్నాయి. ఆయన్ని అంతగా బెదిరించినా కూడా ఒకటే మాట అన్నారు – "నన్ను ఆ కనిపిస్తున్న వీధి స్తంభానికి ఉరితీసి చంపినాకూడా నా జాతి ప్రజల యొక్క హక్కులను వదులుకోవడానికి సిద్ధంగా లేను". అన్నారు. తరువాత పెద్ద దాడులు జరుగుతాయని అంబేద్కర్గారు భావించి, పూనా ఒడంబడిక మీద సంతకంచేసి, బాధతో, దుఃఖంలో బయటకు వచ్చిన ఆయన్ని ప్రెస్‌వాళ్లు ఎందుకు బాధగా ఉన్నారని అడుగగా, అప్పుడు ఆయన ఒక మాట అన్నారు – I brought a fruit of freedom to my people through round table conferences from London. But, the Congress people have snatched it from my hands. ఒక విలువైన స్వాతంత్ర్యం అనే పండుని రౌండ్‌టేబుల్ కాన్ఫరెన్స్‌ల ద్వారా, కమ్యూనల్ అవార్డు రూపంలో నేను లండన్ నుండి తీసుకువస్తే, కాంగ్రెస్ పార్టీ వాళ్లు ఆ పండుని నా దగ్గర నుండి లాగేసుకుని, ఆ పండు యొక్క రసాన్ని వారి ప్రజలకు ఇచ్చి తొక్క నా మొఖాన వేసి నా ప్రజలను మోసం చేశారని ఏడుస్తూ సమాధానం ఇచ్చారు. అంబేద్కర్ గారు ఎంత ఆవేదనకు గురయ్యారో అర్థమవుతుంది. అంత ఘర్షణ తట్టుకున్నాడంటే ఆయన సామాన్య మానవుడు కాదు. ఆయన చదువుకునే రోజులలో మొదటి భార్య పిల్లలకు జబ్బు చేసి, సరైన మందులు అందజేసే వారు లేక పిల్లలు చనిపోయారు. అంతటి త్యాగధనుడు డా.బాబాసాహెబ్ అంబేద్కర్గారు. ఆయన ఎప్పుడూ ఒక మాట అంటూ ఉండేవారు, ఎక్కడైనా మేకల్ని, గొర్రెలను బలి ఇస్తారు కానీ పులులను, సింహాలను ఎవ్వరు బలి ఇవ్వరు కాబట్టి మీరు కూడా పులులు, సింహాలుగా తిరగబడండి అనేవారు. ప్రజలలో ఏ విధంగా స్ఫూర్తిని, చైతన్యాన్ని రగిలిస్తారో చెప్పడానికి ఇది ఒక ఉదాహరణ. ఆ తరువాత ఆయన జీవితమంతా కాంగ్రెస్‌తో పోరాటమే. ఈ వ్యవస్థను ఇలాగే ఉంచి కొద్దికొద్దిగా మార్పు తీసుకురావాలనేది కాంగ్రెస్ పార్టీ అభిప్రాయం. కానీ అంబేద్కర్ గారు మాత్రం ఈ వ్యవస్థలో సమూల మార్పులు జరగాలి, పరివర్తన చెందాలి, సమ సమాజం నిర్మాణం కావాలి, అట్టడుగు ప్రజలకు అధికారం రావాలి, తద్వారా

ఈ వ్యవస్థలో మార్పులు తీసుకురావాలనేది అంబేద్కర్ గారి తపన. ఈ ఘర్షణతో వారు కాం[గ్రెస్ పార్టీతో నిరంతర యుద్ధం చేశారు. ఆయన పొలిటికల్ పార్టీ పెట్టినప్పటినుండి కాం[గ్రెస్ పార్టీతోనే పోటీ ఉండేది. కాం[గ్రెస్ పార్టీ ఆ రోజులలో ఎంత దుర్మార్గంగా ప్రవర్తించింది అంటే రాజ్యాంగసభకు రాకుండా అడ్డుకోవడానికి పెద్ద కుట్ర చేసింది. అప్పటికే ఆయన వైస్రాయ్ కేబినెట్‌లో రెండుసార్లు లేబర్ మినిస్టర్‌గా చేశాడు. అప్పటికే ఆయన హిమాలయ పర్వతం అంత ఎత్తు ఎదిగారు. భారతదేశంలో అంబేద్కర్ గారు వస్తున్నారు అని తెలిస్తే ఎటువంటి కరపత్రాలు, పోస్టర్లు వేయకపోయినా లక్షలమంది జనాభా వచ్చేవారు. అటువంటి మహానుభావుడిని కాం[గ్రెస్ పార్టీ ఒక చిన్న వ్యక్తిని పోటీకి నిలబెట్టి అంబేద్కర్‌ను ఓడించింది. రాజకీయ పార్టీలలో గెలుపు, ఓటములు సహజమే. బాబాసాహెబ్ అంబేద్కర్ పార్టీ తరఫున వెస్ట్‌బెంగాల్‌లో జైసూర్, కుల్నార్ అనే రెండు జిల్లాలలోని ఒక నియోజకవర్గంలో గెలిస్తే దానిని తీసుకువెళ్లి ఈస్ట్ పాకిస్తాన్‌కు ఇస్తే ఈస్ట్ పాకిస్థాన్ constituent Assembly కి మెంబర్ అయ్యారు. భారతదేశంలో కోట్లాదిమంది వెనుకబడిన తరగతుల ప్రజలకు వాయిస్ లేకుండా చేసింది కాం[గ్రెస్ పార్టీ. తరువాత బ్రిటీష్‌వాళ్లు ఈ కుట్రను గమనించి కాం[గ్రెస్‌వాళ్లను పిలిచి ఇది మంచిపద్ధతి కాదు, అంబేద్కర్ వారి గురించి ఎప్పటినుండో పోరాడుతున్నాడు, రౌండ్‌టేబుల్ కాన్ఫరెన్సులలో పాల్గొన్నాడు, కమ్యూనల్ అవార్డు ఇచ్చాము, పూనా ఒడంబడిక మీద సంతకం చేశారు, అటువంటి వారిని రాజ్యాంగసభకు రాకుండా అడ్డుకోవడం మంచి పద్ధతి కాదని చెప్పారు. మరోప్రక్క గాంధీగారు ఆయన్ని మరలా ఎన్నుకుని రాజ్యాంగ సభకు తీసుకుని వచ్చి ఒక మాట అన్నారు – మన రాజ్యాంగాన్ని ఎప్పటినుండి అమలు చేయడం మొదలు పెట్టమంటే 1956వ సంవత్సరం జనవరి 26వ తేదీ నుండి మనం ఈ వైషమ్యాలను ఎంత త్వరగా తగ్గిస్తే అంత మంచిది. అంటూ ఒక హెచ్చరిక చేశాడు. భావి భారత పాలకులారా మీకు ఒక హెచ్చరిక చేస్తున్నాను. ఆ హెచ్చరిక ఏమంటే ఈ వైరుధ్యాలను ఎంత త్వరగా తగ్గిస్తే అంత మంచిది. తగ్గించకపోతే మనం సాధించుకున్న స్వాతంత్ర్యం, మనం నిర్మించుకున్న పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థను ఎవరైతే అసమానతల కారణంగా ఇబ్బంది పెడుతున్నారో వారు ఈ వ్యవస్థను కూల్చివేస్తారని హెచ్చరిక చేశారు. భావి భారత పాలకులకు హెచ్చరిక చేస్తే, ఆ హెచ్చరిక మేరకు ప్రభుత్వాలు మేల్కొని రిజర్వేషన్ల ద్వారా, ప్రత్యేక పథకాల ద్వారా అనేక రకాలుగా ఈ అసమానతలను తగ్గించుకోవడానికి మనం ప్రయత్నం చేసుకుంటూ పోతున్నాము. గౌరవ సభ్యులు జనార్థన్ గారు చెప్పినట్లు ధనవంతుడు పది అడుగులు వేస్తే పేదవాడు ఒక్క అడుగు మాత్రమే వేస్తున్నాడు. తొమ్మిది అడుగులు వెనకే ఉండిపోతున్నాడు. ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ వలన ఈ అంతరాలు పెరిగిపోతున్నాయే తప్ప తగ్గడం లేదు. దీనిగురించే అంబేద్కర్‌గారు ఆరోజున హెచ్చరిక చేశారు. ఈ అంతరాలు తగ్గకపోతే మనం సంపాదించుకున్న స్వాతంత్ర్యం, పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థ నష్టపోతుందని హెచ్చరిక చేశారు. ఆ హెచ్చరికను దృష్టిలో పెట్టుకుని మనం అందరం పనిచేయాల్సిన అవసరం ఉంది. అందుకే తెలుగుదేశం పార్టీ శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో డా.బాబాసాహెబ్ అంబేద్కర్‌గారి మీద చర్చపెట్టడం అనేది ఒక చారిత్రాత్మక పరిణామం. ఇది ఒకమంచి అవకాశం.

మ. 2.30

అధ్యక్షా, ఇది ఒక మంచి అవకాశం. డా. బాబా సాహెబ్ అంబేద్కర్ గారు ఈ దేశానికి చేసిన త్యాగం, పోరాటం, ఆయన సాధించిన హక్కులు, రిజర్వేషన్లు ఇవన్నీ ఆయన మనకు ఇచ్చినటువంటి హెచ్చరికలు. అంతేగాకుండా, ఆయన మనకు రాజ్యాంగం గురించి కూడా చెప్పారు. రాజ్యాంగం చెడ్డవారి చేతిలో పడితే అది సరిగా అమలు కాదు. మంచివారి చేతుల్లో పడితే అది బాగా అమలవుతుందని గౌరవ సభ్యులు చెప్పడం జరిగింది. ఆయన చివరలో బౌద్ధమతానికి ఎందుకు వెళ్ళారంటే, ఆయన బౌద్ధమతాన్ని ఒక మతంగా స్వీకరించలేదు. వే ఆఫ్ లైఫ్‌గా ఆయన బౌద్ధమతాన్ని స్వీకరించారు. బౌద్ధమతంలోకి రాకముందు ఆయన ఒక ప్రకటన చేశారు. 'Though I am born as a Hindu, I will not die as Hindu' ఆయన 30 సంవత్సరముల క్రితమే ఈ మాటలు చెప్పినా, 30 సంవత్సరముల తరువాత వాటిని అమలు చేశారు. డిశంబరు 6వ తారీఖు, 1956వ సంవత్సరమునకు ముందు ఆయన చెప్పిన మాటలను గౌరవ సభ్యులు శ్రీ వి.వి.వి. చౌదరిగారు చక్కగా చెప్పారు.

డా. బాబా సాహెబ్ అంబేద్కర్ గారు బౌద్ధమతానికి రాక ముందు హిందూ మతం గురించి ఒక కామెంట్ చేసేవారు. 'Casteism is the bad breath of Hinduism. Wherever Hinduism spreads, caste system spreads. It has the potential to pollute the entire world.' అన్నారు. కులం అనేది హిందూ వ్యవస్థ యొక్క దుర్గంధం. ఈ హిందూ మతం ఎక్కడ విస్తరిస్తే, అక్కడ కులపు హోదా ఉంటుంది. ఇది ప్రపంచం అంతా పొల్యూట్ చేసే కెపాసిటీ ఉందని ఆయన చెప్పేవారు. అందుకోసం ఆయన ఒక మంచి ఉద్దేశంతో బౌద్ధమతాన్ని స్వీకరించి దీనిని వదిలించుకుందామని అక్కడకు వెళితే, అక్కడ కూడా మన వాళ్ళు కులాన్ని తీసుకువెళ్ళి, రిజర్వేషన్ల పోరాటం చేసి, నియోబుద్ధిస్టులదే రిజర్వేషన్ అనేసరికి, ఆయన ఏ ఉద్దేశంతో బౌద్ధమతంలోకి వచ్చారో, అది మళ్ళా నీరుకారిపోయిందని బాధపడ్డారు. అక్కడ కూడా కులాన్ని తీసుకువచ్చారు. అంత పవర్‌ఫుల్ ఈ కులం. ఎక్కడికి వెళ్ళినా వెంటాడుతుంది. ఆ విషయంలో మనమందరం అప్రమత్తంగా ఉండాలి. చివరగా, ఆయన ఒక విషయం చెప్పారు. 'With great difficulty I have brought this carven to this stage – caravan of social movement, caravan of political movement. If you have capacity you take it forward. If you have no capacity, under any circumstances you should not take it back.' అని ఆయన ఒక హెచ్చరిక చేశారు. ఎంతో కష్టపడి రాజకీయ ఉద్యమాన్ని నేను ఇంతవరకూ లాక్కొచ్చాను. ఈ ఉద్యమాన్ని చేతనైతే ముందుకు తీసుకువెళ్ళమని, లేకపోతే అక్కడే వదిలివేయమని, లేకపోతే దానిని వెనక్కి తీసుకువెళ్ళవద్దని ఆయన అంటే, మహారాష్ట్రలోని అంబేద్కర్ వాదులు, ఆయన చుట్టూ ఉన్నవారు ఏం చేశారంటే, ఒక్కొక్కరు కాంగ్రెస్ పార్టీలోకి చేరిపోయి, ఎం.ఎల్.ఏ.లు, ఎం.ఎల్.సి.లు, గవర్నర్లు అయ్యి, అందరూ ఆ ఉద్యమాన్ని కుప్పకూల్చేశారు. ఈ రోజున కాన్షీరామ్ లాంటి వారు ఆ ఉద్యమాన్ని పునరుద్ధరించాలంటే, ఆయన తల ప్రాణం తోకకొచ్చి, ఆరు సంవత్సరాలైనా ఇక్కడ ఎటువంటి ప్రయోజనం లేక వీరిని బాగుచేయలేమని, ఉత్తరప్రదేశ్‌కి వెళ్ళి అక్కడ సక్సెస్ అయ్యారు.

అధ్యక్షా, తమ ద్వారా నేను చెప్పదలచుకున్నది ఏమిటంటే – ఆనాడు వారు చెప్పింది ఏమిటంటే, 'Congress is a burning home. Please don't go to Congress Party, you will get burned.' అది మండుతున్న అగ్ని గుండం. దాని

దగ్గరకు వెళ్ళవద్దని అనేవారు. ఎందుకంటే, గతంలో కాంగ్రెస్ పార్టీతో చేసిన పోరాటంలో వారు ఆ వ్యవస్థను అలాగే కొనసాగించాలని అంటారు. అంబేద్కర్ గారు వ్యవస్థ మారాలని అంటారు. కాబట్టి, ఈనాడు మా తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం నూతన రాజధాని అమరావతిలో 10 ఎకరాల స్థలంలో అంబేద్కర్ పేరు మీద ఒక స్మారక చిహ్నం, గ్రంథాలయం, మ్యూజియం మొదలైనవన్నీ ఏర్పాటు చేస్తే అది చరిత్ర అవుతుంది. అక్కడ నుంచి ఆయన యొక్క ఆశలు, ఆశయాలు, ఆయన త్యాగం, పోరాటం, దార్శనికత, దూరదృష్టి, ఆయన ఇచ్చిన హెచ్చరికలు మొదలైనవన్నీ ప్రజలకు పెద్ద ఎత్తున మేము ప్రచారం చేయడమే కాకుండా, వాటిని చిత్తశుద్ధితో అమలు చేయడంలో మా ముఖ్యమంత్రిగారి ద్వారా మేము ముందుకు వెళతామని మీ ద్వారా తెలియజేస్తున్నాను. ఈ విషయమై మా ముఖ్యమంత్రిగారు ఒక చారిత్రాత్మకమైన నిర్ణయం తీసుకున్నారు. ఈరోజున భారతదేశంలో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌ను చిత్తశుద్ధితో అమలు చేస్తున్న రాష్ట్రం ఏదైనా ఉందంటే, అది మన రాష్ట్రంలోని మా పార్టీ ప్రభుత్వమే. దీనిమీద నేను ఎక్కడైనా, ఏ రాష్ట్రంలోనైనా డిబేట్ చేయడానికి సిద్ధంగా ఉన్నాను. అంతేగాకుండా, అంబేద్కర్ గారి ఆశయాలకు అనుగుణంగా ఒక పథకాన్ని తీసుకువచ్చి, దాని ద్వారా సుమారు 350 మంది విద్యార్థులను విదేశాలలో ఉన్నత విద్యలను చదివించడానికి ముఖ్యమంత్రిగారు పూనుకున్నారు. ఆ రోజులలో డా. బాబా సాహెబ్ అంబేద్కర్ గారిని మైసూర్ మహారాజు గారు ఏవిధంగా ఆయనకు విదేశీ విద్యకు సహాయం చేసి, స్కాలర్ షిప్పులు అందించారో, అదేవిధంగా మా ముఖ్యమంత్రి శ్రీ ఎన్. చంద్రబాబు నాయుడు గారు కూడా విద్యార్థులకు స్కాలర్ షిప్పులు ఇచ్చి విదేశాలలో చదువుకోవడానికి పంపిస్తున్నారు. ఇది అంబేద్కర్ గారు ఇచ్చిన స్ఫూర్తి, ఆయన దార్శనికత నుంచి తీసుకున్న అంశమని తమ ద్వారా తెలియజేస్తున్నాను.

అధ్యక్షా, మా ప్రభుత్వం శ్రీ ఎన్. చంద్రబాబు నాయుడి గారి నాయకత్వంలో దళితులకు, గిరిజనులకు ఎన్ని రకాలుగానో, వారిని సామాజికంగా, ఆర్థికంగా, విద్యాపరంగా ఎన్ని రకాలుగా సహాయం చేయాలో అన్ని రకాలుగా సహాయం చేస్తామని అన్నారు. భారతదేశంలోనే ఒక మోడల్‌గా మేము నిలుస్తాము. ఈరోజున ఆ విషయాన్ని భారతదేశ ప్రభుత్వం కూడా గుర్తించింది. వీరందరికోసం అనేక పథకాలను మేము తీసుకువస్తున్నాము. వీటన్నింటిని సంపూర్ణంగా అమలుచేసుకుంటూ ముందుకు వెళుతున్నాము. అదేవిధంగా, బ్యాంకర్స్‌తో కూడా అన్ని విషయాలను మాట్లాడి, పేదవారికి ఎట్టి పరిస్థితులలోను లోన్లు ఇవ్వవలసిందేనని, ఎటువంటి వివక్ష పాటించకూడదని, డిపాజిట్లు కూడా అడగడానికి వీలు లేదని కరాఖండీగా చెప్పాము. వాటిని తప్పకుండా చేస్తాము. ఇంకా అనేక మంది నిరుద్యోగులు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల గురించి కూడా కొంతమంది గౌరవ సభ్యులు చెప్పారు. వారందరికీ స్కిల్ డెవలప్ మెంట్ కోర్సులు పెడుతున్నాము. మన రాష్ట్రంలో సుమారు 7 లక్షల ఎస్.ఎఫ్.టి. విలువ కలిగినటువంటి స్థలంలో యూత్ సెంటర్స్ అన్నీ స్కిల్ డెవలప్‌మెంట్ కోసం వాడుతున్నాము. భారతదేశంలో బహుశా 7 లక్షల ఎస్ ఎఫ్ టి గల భవనాలు యూత్ సెంటర్లు, స్కిల్ డెవలప్‌మెంట్ కోసం ఇచ్చిన రాష్ట్రం మరెక్కడా లేదు, అది కేవలం మన రాష్ట్రంలోనే ఉంది. ఇది అంతా మన ముఖ్యమంత్రి శ్రీ ఎన్. చంద్రబాబు నాయుడిగారి చలవే. వీటి ద్వారా యువజనులలో స్కిల్ డెవలప్‌మెంటును మెరుగు పరచి, మంచి ఉద్యోగాలు ఇచ్చి,

సమాజంలో గౌరవప్రదంగా ఉండే విధంగా అన్ని చర్యలు తీసుకుంటాము. సమసమాజ స్థాపన గురించి డా. బాబా సాహెబ్ అంబేద్కర్ కన్న కలలను శాయశక్తులా ఆ ఆదర్శాలను, ఆశయాలను నెరవేర్చడానికి, వాటిని నిజం చేయడానికి ఒక అంబేద్కర్ వాదిగా, గౌరవ ముఖ్యమంత్రిగారి ఆశీస్సులు, ప్రోత్సాహంతో తప్పకుండా ఈ ప్రభుత్వం ముందుకు తీసుకువెళుతుందని తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ గౌనివారి శ్రీనివాసులు : అధ్యక్షా, 'దేవానాం మనుష్య రూపేణా' అని పెద్దలు అన్నారు. భగవంతుడు సర్వాంతర్యామి. అన్ని చోట్లా ఉంటారు. కానీ, భగవంతుడి రూపంలో మనుషులను ఈ దేశానికి స్వతంత్ర్యాన్ని సిద్ధింప చేసినటువంటి మహాత్మా గాంధీజీగారిని, ఈ దేశానికి ఒక మంచి రాజ్యాంగాన్ని రచించినటువంటి భారత రత్న డా. బాబా సాహెబ్ అంబేద్కర్ గారిని మనమందరం గుర్తుపెట్టుకోవాలి. వారి స్ఫూర్తిని మరింత ముందుకు తీసుకువెళ్ళడానికి దేశ స్థాయిలో మన ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారు, రాష్ట్ర స్థాయిలో మన ముఖ్యమంత్రివర్యులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు ఒక మంచి కార్యక్రమాన్ని డా. బాబా సాహెబ్ అంబేద్కర్ గారి పైన ఏర్పాటు చేశారు. ఈ అంశంపై సభలో నాకు మాట్లాడేందుకు ఒక అవకాశం కల్పించినందుకు చాలా సంతోషంగా ఉంది.

భారతదేశంలో అణగారిన వర్గాలను పైకి తీసుకురావడానికి, తన కుటుంబంలో 14వ సంతానంగా జన్మించి తన జీవితంలో అనేక అవమానాలు, ఛీత్కారాలు ఎదురైనా, వాటి తాలూకు వ్యతిరేకతలు రాజ్యాంగ రచనలో ప్రతిబింబించకుండా, ఎంతో ముందు చూపుతో, మన దేశంలో ఉన్న అనేక రకాల సంస్కృతీ సాంప్రదాయాలను, కుల మత సమీకరణాలను మేళవించి, ఆయన వ్రాసిన రాజ్యాంగం, స్వాతంత్ర్యం సిద్ధించి, 68 సంవత్సరములైనా, ఇప్పటికీ నభూతో నభవిష్యతి అన్న చందాన దేశంలో ఉత్పన్నమవుతున్న అనేక సమస్యలకు సంజీవనిగా జాతీయ సమైక్యతను సమగ్రతను కాపాడుకుంటూ, దేశానికి దశ, దిశను నిర్దేశిస్తున్నది.

డా. బాబా సాహెబ్ అంబేద్కర్ ఒక యుగపురుషుడుగా కోట్లాది మంది భారతీయుల గుండెలలో చిరస్థాయిగా నిలిచిపోయిన వ్యక్తి. ఈరోజున ఆయన విగ్రహం లేని ఊరు, పట్టణం, భారతదేశంలో లేదంటే ఈదేశం ఆయన్ని ఎంత ఉన్నతంగా ఆదరిస్తుందో మనం అర్థం చేసుకోవాలి. ఈరోజున మన దేశంలో అన్ని వ్యవస్థలు బలంగా ఉన్నాయంటే, ప్రజలకు ఈ దేశ చట్టాలు, వ్యవస్థలపైన అపార నమ్మకం, విశ్వాసం కలిగి కలిసిమెలసి జీవిస్తున్నారంటే, అది డా. బాబాసాహెబ్ అంబేద్కర్ గారి దార్శనికత. ఆయన కేవలం కేంద్ర ప్రభుత్వమే కాకుండా, రాష్ట్రాలు కూడా ఆర్థికంగా పరిపుష్టమై ప్రజలకు మెరుగైన సేవలు సత్వరం అందేలా ఉండాలని ఈదేశంలో వ్యవస్థలను రూపొందించారు. ఆయన రూపొందించిన స్వతంత్ర ఆర్థిక వ్యవస్థ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం చేస్తూ, నిధుల బదలాయింపు ప్రక్రియను రాజ్యాంగ బద్ధంగా జరపడానికి ఇప్పటికీ వీలు కల్పిస్తోంది. అంతేగాకుండా, స్వతంత్ర ఎన్నికల కమీషన్ దేశంలోని వయోజనులందరికీ ఓటు హక్కును కల్పిస్తూ, ప్రతి ఐదు సంవత్సరములకు ఒకసారి ప్రభుత్వాల ఎంపికలో ప్రజల భాగస్వామ్యాన్ని, బాధ్యతను గుర్తుచేస్తోంది. ఈరోజు అనేక దేశాలలో ఇప్పటికి కూడా

మహిళలకు ఓటు హక్కు లేనటువంటి విషయం మనం గ్రహించాలి. కానీ, మహిళా సాధికారితే కొలమానంగా, దేశ అభివృద్ధి సూచికలు కొలచి, డా. బాబా సాహెబ్ అంబేద్కర్ గారు వ్రాసిన రాజ్యాంగం ఎటువంటి ఆలోచనలకు తావు లేకుండా, మహిళలందరికీ ఓటు హక్కు కల్పించడమే కాకుండా, చట్ట సభలలో వారికి సముచిత స్థానం కల్పించింది. డా. బాబా సాహెబ్ అంబేద్కర్ గారు రూపొందించిన 1955 Hindu Marriage Act ప్రకారం ఈ దేశంలో మహిళలు తలెత్తుకుని గౌరవంగా జీవించేలా అనాదిగా వస్తున్న హిందూ జీవన విధానాన్ని చట్టబద్ధం చేసి, ప్రపంచం గర్వించతగ్గ విలువలతో కూడిన జీవన సరళిని ఈ దేశానికి ఇచ్చింది. ఈ దేశంలో ఆర్థిక కేంద్రంగా పరిఢవిస్తున్నటువంటి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాని ఏర్పాటు చేయడంలో, ఒక ఆర్థిక వేత్తగా డా. బాబా సాహెబ్ అంబేద్కర్ గారు 1934వ సంవత్సరంలో Hilton-Young commission కు తగిన సూచనలు, సలహాలు ఇచ్చి కీలక భూమిక పోషించారు.

మ. 2.40

శ్రీ గౌనివారి శ్రీనివాసులు (నామినేటెడ్)ః పైవన్నీ అమలుజరిగి ఉండకపోతే భారతదేశం ప్రస్తుతం ఎలా ఉండేదో ఊహించుకుంటేనే భయమేస్తోంది, అస్థవ్యస్థ పాలనతో మరో బ్రిటీషు పాలనను తలపించేది. 1942 వ సంవత్సరానికి పూర్వం మనదేశంలో కార్మికులు బ్రిటీషు వారి దగ్గర రోజుకు 11 గంటలు పనిచేస్తూ శ్రమించేవారు. మన దేశంలో లేబర్ రీఫార్మ్స్ అంటే మనకు గుర్తుకు వచ్చేది కమ్యూనిస్టులే. కానీ, అతికొద్దిమందికి తెలిసిన విషయమేమిటంటే బాబాసాహెబ్ అంబేద్కర్ గారు బ్రిటీషు వైశ్రాయ్‌తో వాదించి, కొట్లాడి, ఒప్పించి శ్రామికుల పని గంటలను రోజుకు 8 గంటలకు కుదించేలా నిర్ణయపరిచారు. డా.బాబాసాహెబ్ అంబేద్కర్ గారు న్యాయవాదిగా, సంఘసంస్కర్తగా, ఆర్థికవేత్తగా, సామాజిక వేత్తగా మానవజాతికి ఒక ఆశాకిరణం. ఆయన ఆశయాలు, ఆలోచనలు, వ్యాఖ్యానాలు అత్యంత విలువైనవి. అన్ని సమయాల్లో కూడా వర్తింపచేసుకుని, ఆచరణలో పెట్టగలిగితే బాగుంటుంది. కొంతమందిని పనిచేసినంతకాలం గుర్తుంచుకుంటారు. మరి కొంతమందిని మరణించే వరకు గుర్తుంచుకంటారు. కానీ, చాలా చాలా అరుదుగా మరణించి 60 సంవత్సరాలు గడిచినప్పటికీ ఇప్పటికీ భారతదేశ ప్రజల హృదయాల్లో జీవించి ఉన్న వ్యక్తి.. కాదు కాదు ఒక శక్తి డా.బాబాసాహెబ్ అంబేద్కర్ గారు. ఈ దేశ అంతరాల్లో ఎవరు దర్శించే ప్రయత్నం చేసినా, ఈ దేశ ముఖ చిత్రంలో డా.బాబాసాహెబ్ అంబేద్కర్ ప్రతిబింబం తప్పక కనిపిస్తుంది. ఇటువంటి ఒక మహనీయుణ్ణి, దేశ సర్వతోముఖాభివృద్ధికి జీవితకాలం వెచ్చించిన మహా మనిషిని దళితులకు మాత్రమే దేవుడని చెప్పి ఒక వర్గానికి మాత్రమే పరిమితం చేసి మాట్లాడటం ఆయన్ను అవమానపరచడమే అవుతుంది. ఆయన అన్ని వర్గాలకు సామాజిక న్యాయం చేయడం ద్వారా కులం, అంటరానితనం, అస్పృశ్యతలను రూపుమాపడానికి నడుం బిగించిన గొప్ప మహానాయకుడు.

డా.బాబాసాహెబ్ ఆశయాలకు అనుగుణంగా బడుగుబలహీన వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం పరితపిస్తున్న మన ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి నేతృత్వంలోని తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం అనేక కార్యక్రమాలను చిత్తశుద్ధితో

అమలుపరుస్తోంది. విద్యార్థులకు ట్యూషన్ ఫీజు రీయింబర్స్‌మెంట్, పోస్ట్‌మెట్రిక్, ప్రీమెట్రిక్ స్కాలర్‌షిప్స్ అయితేనేమి, ఇళ్ల స్థలాలు కేటాయించడంలో అయితేనేమి, ఉచితంగా గృహాలకు విద్యుత్ సరఫరా అయితేనేమి, కులాంతర వివాహాలు ప్రోత్సహించడం అయితేనేమి, ఉపాధి హామీ పథకం ద్వారా ప్రోత్సాహకాలు చెల్లించడం అయితేనేమి, ఎన్టీఆర్ భరోసా కార్యక్రమం ద్వారా రూ.1000 పెన్షన్ చెల్లించడం అయితేనేమి, ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్లు నిర్వహించడం అయితేనేమి, పొలంబడి ద్వారా రైతులకు వ్యయం తగ్గించి, దిగుబడి పెంచే విధంగా కృషి చేయడమైతేనేమి, ఉద్యోగ నియామకాల్లోనూ, పదోన్నతుల్లోనూ రిజర్వేషన్లు అమలుపరచడమైతేనేమి, ఇలా రాష్ట్ర ప్రభుత్వం అన్ని శాఖల ద్వారా దాదాపు 36 శాఖలు, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ ద్వారా వేల కోట్ల రూపాయల నిధులు కేటాయించి, అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు త్రికరణ శుద్ధిగా తెలుగుదేశం పార్టీ అభివృద్ధి పరుస్తోంది. గతంలో కూడా నారా చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం దళిత జన్మభూమి కార్యక్రమాన్ని నిర్వహించి కేవలం బడుగు, బలహీన వర్గాల వారి అభ్యున్నతి కొరకు అధికారులను గ్రామాలకు పంపి వారి సమస్యలను తెలుసుకుని సాధ్యమైనంత వరకు పరిష్కరించడమే కాకుండా ఆయా సభల్లో వచ్చిన వినతులకు స్పందించి నిధులు కూడా కేటాయించి అనేక గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టిన ఘనత ఈ ప్రభుత్వానికే ఉంది.

చివరిగా ఒక్కమాట. ఈ రోజు సమాజంలో సమాచార, సాంకేతిక విప్లవంతో అనేక మార్పులకు లోనవుతూ జీవన విధానంలో కూడా అనేక మార్పులు చోటు చేసుకుంటున్నాయి. వీటన్నింటినీ క్రోఢీకరించుకుని, అంబేద్కర్ రచించిన రాజ్యాంగంపైన అనునిత్యం చర్చలు జరిగేలా, అంబేద్కర్ గారి ఆశయాలను మరింతగా ప్రజల్లోకి పంపి, దేశ సర్వతోముఖాభివృద్ధికి మనమందరం పునరంకితమవ్వాలని ఆశిస్తూ డా.బాబాసాహెబ్ అంబేద్కర్ గారి 125వ జయంతి ఉత్సవాల సందర్భంగా ఆ మహనీయుడికి మరొక్కసారి హృదయపూర్వక శ్రద్ధాంజలి ఘటిస్తూ, ఈ కార్యక్రమంలో మాట్లాడేటటువంటి అవకాశం కల్పించిన మీకందరికీ నమస్కరిస్తూ చివరిగా ఒక్క మాట చెబుతున్నాను. ఒకసారి నేను ఫిలిప్పైన్స్ దేశానికి ట్రైనింగ్ ప్రోగ్రామ్‌కి వెళ్లినప్పుడు, అక్కడ నేను మాట్లాడేటప్పుడు ఒక మాట అన్నాను. భారతదేశంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ రిజర్వేషన్లు ఉన్నాయని అన్నాను. సమావేశం అయిపోయిన తరువాత, అక్కడికి వచ్చిన వాళ్లు నాతో మాట్లాడిన మాట ఏమంటే – ఎస్సీ అంటే ఏమిటి? ఎస్టీ అంటే ఏమిటి? బీసీ అంటే ఏమిటి? మైనారిటీ అంటే ఏమిటి? అని వాళ్లు నన్ను ప్రశ్నించినప్పుడు వాళ్లకు నేను జవాబు చెప్పలేకపోయిన పరిస్థితులను ఒకసారి గుర్తుకు తెచ్చుకుంటూ, ఇప్పుడే పెద్దలు మాట్లాడుతూ ఒక మాట మాట్లాడారు. ఒక డాక్యుమెంట్ తయారుచేయాలని, దాంతోబాటు ఆడియో, వీడియో క్యాసెట్స్ విడుదల చేయాలన్నారు. మన గౌరవ మంత్రివర్యులు శ్రీ రావెల కిశోర్‌బాబు గారు చంద్రన్న సంక్షేమ పాలన అనే కార్యక్రమాన్ని చాలా బాగా చేశారు. అదే క్రమంలో ఈ ఆడియో, వీడియో క్యాసెట్స్ కూడా తయారు చేసి, అన్ని గ్రామాలకు కూడా పంపితే చాలా బాగుంటుందనే సూచనలు కూడా చేస్తున్నాను. అదేవిధంగా కుప్పంలో ఉన్నటువంటి ద్రవిడ భాషా విశ్వవిద్యాలయంలో ఈ అంబేద్కర్ పాఠ్యాంశాన్ని పెట్టాలనే సూచనను సోదరులు బాలసుబ్రహ్మణ్యం గారు కూడా చెప్పారు. ఆ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ద్రవిడ విశ్వవిద్యాలయంలో అంబేద్కర్ పాఠ్యాంశం పైన ఏవిధంగా ముందుకు పోవాలో ఆ

విధంగా కార్యక్రమాలు చేస్తే బాగుంటుందనే మరో సూచనని తెలియజేస్తున్నాను. ఒక బీద, బడుగు వర్గాల నుండి వచ్చిన వ్యక్తినైన నాకు ఇటువంటి పెద్దల సభలో మాట్లాడేటటువంటి అవకాశం కల్పించడమంటే, అది కేవలం బాబాసాహెబ్ అంబేద్కర్ గారు వ్రాసిన రాజ్యాంగం యొక్క పుణ్యము, శ్రీ నారా చంద్రబాబు నాయుడి గారి ఆశీస్సులని సవినయంగా తెలియజేసుకుంటూ, నాకీ అవకాశమిచ్చిన పెద్దలకు నమస్కరిస్తూ సెలవు తీసుకుంటున్నాను.

(ప్యానెల్ ఛైర్‌పర్సన్ శ్రీమతి పమిడి శమంతకమణిగారు అధ్యక్ష స్థానం వహించారు.)

ఛైర్‌పర్సన్ః మినిస్టర్ గారు స్టేట్‌మెంట్ ఇస్తారు.

శ్రీమతి పీతల సుజాతః స్టేట్‌మెంట్ కాదు మేడమ్.

ఛైర్‌పర్సన్ః స్టేట్‌మెంటే లెండి.

శ్రీమతి పీతల సుజాతః ఓకె. థాంక్యూ మేడమ్. చాలా మంచి వాతావరణంలో ఒక మహానుభావుడు గురించి ఎంతోమంది మేధావులు, విద్యావంతులు, పెద్దలందరూ కూడా మంచి చర్చ చేయడం జరిగింది. నిజంగానే అందరూ చెప్పినట్లుగా, మన రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్.అంబేద్కర్ గారి చరిత్ర కానివ్వండి, ఆయన గురించి మాట్లాడాలంటే ఎన్ని రోజులైనా సరిపోదు. కానీ, ఈ రోజున నేను-నా దేశం అనే రెండు మాటల్ని తీసుకుంటే, నా దేశానికి నేను ఫస్ట్ ప్రయారిటీ ఇస్తానని దానికోసం కట్టుబడినటువంటి ఏకైక వ్యక్తి డా.బి.ఆర్.అంబేద్కర్ గారు. ఆయన చిన్నతనం నుండి కూడా ఎంతగా కష్టపడ్డారో, ఎంత మనోవేదనకు గురయ్యారో దాని గురించి పెద్దలందరూ కూడా మాట్లాడారు. ఇంత మంది పెద్దలకు తెలిసినంతగా నాకు నిజంగానే తెలియదు. నేను వాళ్లు మాట్లాడినప్పుడు నోట్ చేసుకున్నాను. దాదాపుగా 22 మంది సభ్యులు ఈ చర్చలో పాల్గొన్నారు. వారికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. గౌరవ ప్రధానమంత్రి శ్రీ నరేంద్రమోడీ గారు పార్లమెంటులో రెండు రోజులు డా.బి.ఆర్.అంబేద్కర్ గారి జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని చర్చ జరిపి, ఒక మంచి ఆదర్శానికి తెరతీసినందుకు ప్రధానమంత్రి గారికి సభాముఖంగా నేను కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. అదేవిధంగా మన రాష్ట్ర అసెంబ్లీలో కూడా రెండు రోజులపాటు చర్చకు అంగీకరించి, స్టేట్‌మెంట్ ప్రవేశపెట్టినటువంటి గౌరవ ముఖ్యమంత్రి శ్రీనారా చంద్రబాబు నాయుడు గారికి సభాముఖంగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

ఈ రోజున చూస్తే, దేశంలోని ప్రతిఒక్కరికీ కూడా కులమతాలకు అతీతంగా అందరికీ సామాజిక న్యాయం జరగాలన్నదే అంబేద్కర్ గారి ఆశయం. మరి ఆ ఆశయం కోసం ఆయన ఎంతగా కష్టపడ్డారో, ఆ విధమైనటువంటి మార్పు కోసం జీవితాంతం పరితపించిన వ్యక్తి ఆయన. డా.బాబాసాహెబ్ అంబేద్కర్ గారు ప్రపంచ మేధావి, సంఘసంస్కర్త, దార్శనికుడు అనే విషయం అందరికీ తెలిసినదే. ఆయన మహారాష్ట్రలోని రత్నగిరి జిల్లా, అంబావడే గ్రామంలో జన్మించారు. తండ్రి పేరు రామ్జీ మాలోజీ సక్‌పాల్,

తల్లి పేరు బీమాబాయి. ఆయనకు 14 ఏళ్ల వయస్సులో 1905 వ సంవత్సరంలో వివాహం జరిగింది. భార్య పేరు రమాబాయి గారు. ఆయన పెద్దయ్యాక స్త్రీవిద్యకు ప్రాధాన్యతనిస్తున్న మహాత్మా జ్యోతీరావు పూలే గారిని ఆదర్శంగా తీసుకుని, నిమ్నజాతుల అభివృద్ధి కోసం, స్త్రీ విద్య కోసం ఎంతగానో పరితపించారు. ఈ రోజున చూస్తే, ఆయన్ను మనమందరం కూడా దళితులకు ఆరాధ్యదేవుడని, నాయకుడని అనుకుంటున్నాము, రాజ్యాంగ నిర్మాతగానే చూస్తున్నాము. కానీ, ఇదంతా నాణానికి ఒకవైపు. ఇంకో కోణంలో అందరి అభివృద్ధి కోసం ఎంతో కృషి చేసినటువంటి మహావ్యక్తి ఆయన. ఇప్పుడు మన పెద్దలందరూ కూడా మాట్లాడారు. కార్మికులకు పనిదినాలు తగ్గించడం కానివ్వండి, ఒకరోజు తప్పకుండా కార్మికులకు హాలిడే ఉండాలని వాళ్ల కష్టాన్ని గుర్తించిన వ్యక్తి డా.బి.ఆర్.అంబేద్కర్ గారు.

మ. 2.50

అధ్యక్షా, గర్భిణీ స్త్రీలకు సెలవు దినాలు ఉండాలి కాబట్టి వారికి తప్పనిసరిగా సెలవు దినాలు ఉండే విధంగా చేయాలని డా. బి.ఆర్. అంబేద్కర్ గారు ఆలోచన చేశారు. మహిళలను ప్రమాదకరమైన పనులలోకి పంపించకూడదని మంచి ఆలోచన చేసిన వ్యక్తి డా. బి.ఆర్. అంబేద్కర్ గారు. అదే విధంగా, మహిళా కార్మికులకు రాత్రి పూట విధులు ఉండకూడదని కూడా మంచి ప్రతిపాదన చేసిన వ్యక్తి. మహిళలకు ఆస్తిలో సమాన హక్కు ఉండాలని హిందూ కోడ్ బిల్లును ప్రవేశపెట్టారు. దానితోపాటుగా, విడాకుల వ్యవస్థను కూడా ఆయన ప్రవేశ పెట్టారు. ఆడపిల్ల పుట్టిన తరువాత తల్లి ఆధీనంలో, పెళ్లి అయిన తరువాత భర్త ఆధీనంలో , ఒకవేళ భర్త చనిపోతే పిల్లల ఆధీనంలో ఉంటే వాళ్లకు సరైన సంరక్షణ ఉండడం లేదు. భర్తకు ఎటువంటి కుష్టు రోగం కాని, ఇంకా ఎలాంటి రోగాలున్నా, భర్త కొడుతున్నా, హింసిస్తున్నా కూడా నరకాన్ని అనుభవిస్తూ స్త్రీ అలానే జీవిస్తుంది కాబట్టి ఆమెకు ఒక వ్యక్తిత్వం ఉండాలని మహిళల కోసం ఆనాడే ఆలోచన చేసిన గొప్ప వ్యక్తి. ఇది ఏదో నెగిటివ్‌గా ఆలోచించినవి కావు. అయితే, ఆయన అనుకున్నవన్నీ కూడా జరగలేదు. చాలామంది ఆనాడు ఆయనను అడ్డుకోవడం జరిగిందని మనకు చరిత్ర చెబుతోంది. హిందూ కోడ్ బిల్లును ఆదర్శంగా తీసుకొని తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు అన్న ఎన్.టి. రామారావు గారు డా. బి.ఆర్. అంబేద్కర్ గారిని ఆదర్శంగా తీసుకొని మహిళలకు పురుషులతో సమానంగా ఆస్తి హక్కు కల్పించిన ఘనత ఎన్.టి. రామారావు గారికే దక్కుతుంది. అదే విధంగా పురుషులతో సమానంగా మహిళలకు కూలి ఉండాలని ఆనాడే డా. బి.ఆర్. అంబేద్కర్ గారు ముందు చూపుతో ఆలోచన చేసిన విషయాన్ని నేను ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను.

అదే విధంగా, ఉద్యోగ నియమాకలనేవి కుల,మతాలకు అతీతంగా, రాజకీయాలకు అతీతంగా, బంధుప్రీతికి అతీతంగా, స్నేహానికి అతీతంగా జరగాలి. ఉద్యోగాలనేవి జ్ఞానానికి , పట్టుదలకు, చదువుకు సంబంధించినవి కాబట్టి బంధుప్రీతికి తల ఒగ్గకూడదు, దేనికీ తల ఒగ్గకుండా జరగాలని తలంచి జాతీయ స్థాయిలో యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమీషన్, రాష్ట్ర స్థాయిలో సర్వీస్ కమీషన్, జిల్లా స్థాయిలో ఎంప్లాయ్‌మెంట్ ఎక్ఛేంజ్‌ల ద్వారా ఉద్యోగాలను ఇచ్చే విధానాన్ని కూడా తీసుకువచ్చింది డా. బి.ఆర్. అంబేద్కర్ గారే. ప్రతి దానిలో ఆడ, మగకు సమానంగా అవకాశాలు ఉండాలని మహిళలకు కూడా ఓటు హక్కును తీసుకువచ్చారు. ఈ దేశ ప్రజాస్వామిక వ్యవస్థ ఇంత పటిష్టంగా ఉండడానికి, నాయకుల

యొక్క తల రాతలను మార్చే విధంగా ఉన్నదంటే డెఫెనెట్‌గా అది డా. బి.ఆర్ అంబేద్కర్ గారు తీసుకువచ్చిన ఒక మంచి ఆలోచనకు నిదర్శనం. ఆ రోజున ఓటు హక్కును తీసుకువచ్చారు కాబట్టే ఐదు సంవత్సరాలకు ఒకసారి ఎన్నికలను జరపడానికి ఎన్నికల సంఘం, చీఫ్ ఎలక్షన్ కమీషనర్, రాష్ట్ర ఎలక్షన్ కమీషనర్ అనే వ్యవస్థను ఏర్పాటు చేసి వాళ్ల ద్వారా ఎన్నికలు జరిగి నాయకులను ఎన్నుకొనే విధానాన్ని దేశం కోసం ఒక పటిష్టమైన వ్యవస్థను డా. బి.అర్ . అంబేద్కర్ గారు సృష్టించారు. పురుషునికి, స్త్రీకి సమానంగా ఓటు హక్కును ఆనాడు కల్పించడం జరిగింది.

అదే విధంగా, వ్యవసాయ రంగాన్ని కూడా ఒక పరిశ్రమగా గుర్తించాలని ఆనాడు ఆయన ఆలోచించడం జరిగింది. అంటే.. చిన్న కమతాలుగా, సహకార వ్యవసాయంగా చేయాలని సూచించారు. అంటే.. రష్యా తరహాలో భూములను ప్రభుత్వ భూములుగా చేయాలని ఒక ఆలోచించడం జరిగింది. అయితే అది రూపు దాల్చలేకపోయింది. ప్రతి వ్యక్తికి ఇన్సూరెన్స్ అనేది ఉండాలని కూడా డా. బి.ఆర్. అంబేద్కర్ గారి ఆలోచనకు నిదర్శనం. దానిలో భాగంగానే ఈరోజు చాలా పెద్ద ఎత్తున ఇన్సూరెన్స్ కంపెనీలు వచ్చాయి. అదే విధంగా, ఒక ప్రాంతం, ఒక భాష అనే తేడా లేకుండా రెవెన్యూ ఏదైతే ఉంటుందో అది అంతా సమానంగా భారతదేశంలో ఉన్న అన్ని రాష్ట్రాలకు చెందాలనే విధంగా ప్లానింగ్ కమీషన్‌ను డా. బి.అర్. అంబేద్కర్ గారి కృషికి ఫలితంగా ఏర్పాటు చేయడం జరిగిందని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. అసలు ఆయన దేశం కోసం ప్రాముఖ్యత ఇచ్చిన వ్యక్తి. పేద, బడుగు, బలహీన, నిమ్న జాతుల వారి అభివృద్ధి కోసం, వాళ్లు బాగా చదువుకోవడం కోసం ఎంతగా ఆయన పరితపించారో విద్యావంతులందరికీ తెలిసిన విషయమే. ఏదైతే, ఆయన చిన్నతనంలో గ్లాసు మంచినీళ్లు కావాలంటే దూరంగా పట్టి ఇచ్చారో, ముట్టుకోనివ్వలేదో, ఆయన చెరువు ప్రక్కన వెళుతుంటే అంటరానివారిగా చూసి ఆ చెరువులో నుండి నీటిని తీసుకురానివ్వకపోవడం వంటివన్నీ చూసి ఈ వివక్షత ఏమిటి? ఎందుకు ఇట్లా అంటరానివారిగా చూస్తున్నారని ఆనాడే చిన్నతనంలోనే ఆయన మనసులో బీజం పడింది. అనాడే ఆయనకు చాలా బాధ కలిగింది. దానిని ఎట్లాగైనా రూపుమాపాలంటే చదువు ఒకటే మార్గమని , చదువుతోనే దానిని సాధించాలని ఆయన లండన్ వెళ్లి చాలా మంచి, మంచి చదువులు చదివారు.

ఇప్పుడు సుబ్రహ్మణ్యం గారు చెప్పినట్లు .. కార్ల్‌మార్క్స్ కాని, ముస్సోలీ కాని, డా. బి.ఆర్. అంబేద్కర్ గారు కాని లండన్ లైబ్రరీలో ఉన్న మొత్తం పుస్తకాలను చదివిన ప్రపంచ మేధావులలో ఆయన ఒకరన్నారు. అటువంటి వ్యక్తి మన దేశంలో పుట్టడం భారతీయులు చేసుకున్న అదృష్టం. ఆయన గురించి నాలాంటి చిన్న వ్యక్తికి మాట్లాడే అవకాశం రావడం పూర్వ జన్మ సుకృతంగా భావిస్తున్నాను. ఆయన ఏమన్నారంటే, నీ కోసం జీవిస్తే నీలోనే జీవిస్తావు, జనం కోసం జీవిస్తే జనంలోనే నిలచిపోతావు. కాబట్టి నీ కోసం కాకుండా జనం కోసం జీవించు. దేశ జనాభాలో మార్పు తీసుకురావాలని ఎంతగానో ఆయన ప్రయత్నం చేశారు. ఆ విధంగా ఆయన ఎంతగా ప్రయత్నం చేసినా కూడా అదే కులం నుండి ఆయన మీద వ్యతిరేకత వచ్చింది. సపోర్ట్ లేదు. అందువల్ల ఆయన దాదాపు 10 లక్షల మందితో బౌద్ధ మతాన్ని స్వీకరించడం జరిగింది. తదనంతర పరిణామాలు అందరికీ తెలిసినవే. కులం పునాదుల మీద దేనిని సాధించలేము, ఒక జాతిని కాని, నీతిని గాని నిర్మించలేము

కాబట్టి ఏదైనా సరే కుల,మతాలకు అతీతంగా అందరు సమానంగా అభివృద్ధి చెందినప్పుడే ఆయన ఆత్మకు శాంతి చేకూరుతుంది. ఇలాంటి మంచి వ్యక్తి గురించి చర్చ రావడం, మాట్లాడిన సభ్యులందరూ మంచి, మంచి సలహాలు ఇచ్చారు.

ఆయన 125 వ జన్మదిన సందర్భంగా రాష్ట్రంలో ఉత్సవాలు జరుగుతున్నాయి. రాజ్యాంగం గురించి రెండు నిమిషాలు తెలియజేస్తాను అధ్యక్షా. అసలు, రాజ్యాంగ రచనా కమిటీలో డా. బి.ఆర్. అంబేద్కర్ గారిని సభ్యుడిగా తీసుకోలేదంటే అది ఎవ్వరం కూడా నమ్మలేని నిజం. అయితే ఆయన వివిధ మీటింగులలో చూపించినటువంటి ప్రతిభ, విజ్ఞానం, ఆయన చేసినటువంటి కృషిని గమనించి తప్పనిసరిగా ఇటువంటి వ్యక్తిని రాజ్యాంగ రచనా కమిటీలో సభ్యునిగా తీసుకోకపోతే మన జాతికి చాలా ద్రోహం చేసిన వారమవుతామని మన మొట్టమొదటి రాష్ట్రపతి బాబు రాజేంద్ర ప్రసాద్ గారు తలంచి ఆయనను రాజ్యాంగరచనా కమిటీలోకి తీసుకోవడం జరిగింది.

స్వాతంత్ర్యం వచ్చిన తరువాత రాజ్యాంగ రచనా కమిటీకి ఎన్నికలు జరిగాయి. షెడ్యూల్డ్ క్యాస్ట్ ఫెడరేషన్ తరఫున డా. బి.ఆర్. అంబేద్కర్ గారు పోటీ చేస్తే, కాంగ్రెస్ పార్టీ ఓడించింది. దానికి కమ్యునిస్టు పార్టీ కూడా సహకరించిందని ఒక పుస్తకంలో చదివాను. ఈస్ట్ బెంగాల్ నుండి ఎన్నికైనటువంటి జోగీనాథ్ మండల్ అనే వ్యక్తి రాజీనామా చేస్తే, ఆ ప్లేస్‌లో డా. బి.ఆర్. అంబేద్కర్ గారిని నిలబెట్టడం జరిగింది. అప్పుడు ఆయనకు సపోర్ట్ చేసింది ఇండిపెండెంట్‌గా పోటీచేసిన షెడ్యూల్డ్ క్యాస్ట్‌కు చెందిన ఇద్దరు, ఆంగ్లో ఇండియన్ ఒకరు, ముస్లిం ఒకరు ఆయనకు సపోర్టు చేసి ఆయనను గెలిపించారు. తరువాత ఈస్ట్ బెంగాల్ పాకిస్థాన్‌లో కలిసి పోవడంతో ఆయన అక్కడ ఇమడలేక ఆ పదవికి రాజీనామా చేయడం జరిగింది. తదనంతరం జరిగిన పరిణామాలు ఈయనను తప్పనిసరిగా రాజ్యాంగ రచనా కమిటీలోకి తీసుకోవాలని బాబు రాజేంద్ర ప్రసాద్ గారు చాలా ఆశపడి, ఆతృతను వెలిబుచ్చడం జరిగిందనే విషయాన్ని మనం పుస్తకాలలో చదివాము. రాజ్యాంగ రచనా కమిటీకి ఎంపిక కావాలంటే తప్పనిసరిగా పోటీచేయాలి. అయితే, అక్కడ జైసూర్ సీటు ఖాళీ అయింది. ఆ సీటు ఖాళీ అయితే అక్కడ నుండి అంబేద్కర్ గారు పోటీ చేయాలని నిర్ణయించుకున్నారు. అప్పటికే కాంగ్రెస్ పార్టీ ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు మౌలానందా గారిని నిలబెడుతున్నట్లు ప్రకటించడం జరిగింది. అయితే హుటాహుటిన గాంధీజీ గారు, జవహర్‌లాల్ నెహ్రూ గారు, రాజేంద్ర ప్రసాద్ గారి లాంటి పెద్దలందరూ కూడా వచ్చి నీకు తరువాత ఛాన్స్ ఇస్తాం, ఇప్పుడు తప్పసరిగా అంబేద్కర్ గారిని నిలబెట్టి తీరాలని ఆయన యొక్క విజ్ఞానానికి తల ఒగ్గి, ఆయన యొక్క కృషికి నిజంగా సపోర్టు చేసి ఆయనను రాజ్యాంగ రచనా కమిటీలోకి తీసుకోవడం జరిగింది.

మ. 3.00

అటుపై పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ గారి మంత్రివర్గంలో డా. బి.ఆర్. అంబేద్కర్ గారు చేరడం జరిగింది. ప్రణాళిక శాఖా మంత్రిగా చేయాలని ఆయన ఆశపడ్డారు. ఆ విధంగా నిమ్న జాతులు, బలహీన వర్గాలకు సపోర్టు చేసి వారిని అభివృద్ధి చేసే అవకాశం వస్తుందని అనుకున్నారు. కానీ, జవహర్‌లాల్ నెహ్రూ గారు ముందు న్యాయశాఖ మంత్రిగా

చేరండి, తరువాత చూద్దామని అన్నారు. తదనంతరం పరిణామాల మేరకు 7 గురు కమిటీ సభ్యులతో 1947లో రాజ్యాంగ రచనా కమిటీ వేయడం, ఒకరు చనిపోవడం, మిగతావారు రాజీనామా చేయడం, కొంతమంది రాకపోవడం వంటి విషయాలన్నీ అందరికీ తెలిసినవే అధ్యక్షా. ఏదేమైనప్పటికీ, చివరికి ఒక యజ్ఞంలాగా రాజ్యాంగాన్ని పూర్తి చేసిన వ్యక్తి డా. బి.ఆర్. అంబేద్కర్ గారు. ప్రాథమిక సూత్రాలు గానీ, ఆదేశిక సూత్రాలు గానీ రచించడంలో ఆయన ముఖ్య భూమికను పోషించారు. మనందరికీ ఆదర్శప్రాయమైన వ్యక్తిగా ఆయన నిలచిపోయారు. వారి ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరు కులమతాలకు, పార్టీలకు అతీతంగా ముందుకువెళ్లవలసిన అవసరం ఉంది. ఈనాడు గౌరవ సభ్యులు అనేక సూచనలు, సలహాలు ఇచ్చారు. సోషల్ వెల్ఫేర్ మంత్రిగారు కూడా సభ్యులు అడిగిన ప్రశ్నలకు ప్రభుత్వం తరఫున క్లారిటీ ఇచ్చారు. కొత్త రాజధానిలో అంబేద్కర్ భవన్‌ను ఏర్పాటు చేస్తున్నాము. కొత్త తరానికి అంబేద్కర్ గారి గురించిన చరిత్ర తెలిసే విధంగా అక్కడ ఒక మ్యూజియం ఏర్పాటు చేయడం జరుగుతుంది. పల్లెల్లో, మారుమూల ప్రాంతాలలో ఇంకా 90 శాతం అంటరానితనం, వివక్ష ఉన్నాయి. దానిని రూపుమాపాలంటే సమాజంలో మార్పు రావాలి. అందరి సహకారం ఉంటే అది తప్పకుండా సాధ్యమవుతుంది. ఆ దిశగా అందరం ముందుకు వెళ్లాలని కోరుతున్నాము. అంబేద్కర్ గారిని ఆదర్శంగా తీసుకుని శ్రీ ఎన్.టి. రామారావు గారు మహిళలకు ఆస్తిలో హక్కు ఇచ్చారు. గౌరవ చంద్రబాబు నాయుడు గారు కూడా వారిని ఆదర్శంగా తీసుకుని స్మార్ట్ విలేజ్, స్మార్ట్ టౌన్ అనే కాన్సెప్ట్ పెట్టారు. దీని ముఖ్యోద్దేశం ఏమిటంటే, స్థానికంగా సెటిల్ అయినవారు, ఒక స్థాయికి చేరుకున్నవారు ఆ గ్రామాన్ని దత్తత తీసుకుంటే ఆ గ్రామం అంతా అభివృద్ధి చెందుతుంది. తద్వారా అంతటా అభివృద్ధి జరిగి సమన్యాయం జరుగుతుందని ఈ కార్యక్రమాన్ని చంద్రబాబునాయుడు గారు చేపట్టారు. ఆ విధంగా కూడా ప్రభుత్వం ఒక అడుగు ముందుకు వేస్తున్నది.

నారాయణరెడ్డి గారు చెప్పినట్లు హాస్టల్స్‌లో గానీ, ఫలానా ఎస్సీ కాలనీ, బిసి కాలనీ అని, ఊరు చివర ఎస్సీ, ఎస్టీ ప్రాంతమని ప్రత్యేకంగా ఎప్పటినుంటో ఉంటున్నాయి. తప్పకుండా రాబోయే రోజులలో వాటిని రూపుమాపే విధంగా కృషి చేద్దాము. అందరూ కలిసి ఒకచోట ఉండే విధానం పట్టణ ప్రాంతాలలో అక్కడక్కడ ఉంది. గ్రామాలలో కూడా కుల వివక్షను రూపుమాపాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వం బిసి, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, మహిళా సంక్షేమానికి ఎక్కువ శాతం ఖర్చుపెడుతున్నది. ఆ అభివృద్ధి ఫలాలు ప్రతి ఒక్క ఇంటికీ అందే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నది. ఈ విషయంలో మన గౌరవ సభ్యులందరూ కూడా గ్రామ స్థాయిలో పర్యవేక్షించాలని సభాముఖంగా కోరుతున్నాను. కుల, మత, అసమానతలను రూపుమాపాలంటే అందరం కలిసికట్టుగా ముందుకు వెళ్లాలి. డా. బి.ఆర్. అంబేద్కర్ గారు ఏదైతే దేశ సమగ్రాభివృద్ధికి కృషి చేశారో ఆ దిశగా మనం కలిసికట్టుగా పయనించి రాష్ట్రాన్ని కుల మతాలకు అతీతంగా ముందుకు తీసుకువెళ్లేందుకు సభ్యులందరి సహకారం కావాలని కోరుతున్నాను. రాష్ట్ర ప్రభుత్వం ఇబ్బందుల్లో ఉన్నా దళితుల సంక్షేమం కోసం వేల కోట్లు ఖర్చుపెడుతున్నది. తప్పకుండా రాబోయే రోజులలో అందరి సహకారంతో ప్రజల సమగ్ర అభివృద్ధి కొరకు ముందుకువెళతామని తెలియచేస్తూ దళిత మహిళనైన నాకు ఈ అవకాశం ఇచ్చినందుకు గౌరవ ముఖ్యమంత్రిగారికి కృ తజ్ఞతలు తెలియచేస్తున్నాను.

నిమ్న, దళిత జాతి వర్గాల వారికి డా. బి.ఆర్. అంబేద్కర్‌గారు దేవుడు. సుబ్రహ్మణ్యం గారు దేవుడు అనకూడదు అని అన్నారు గానీ, ఆయన భిక్ష వల్లే మాకు ఈ అవకాశాలు వచ్చాయి. మాలాంటి ప్రతి ఒక్కరికీ ఆయన దేవుడే. కాబట్టి ముందుగా మా దేవుడు డా. బి.ఆర్. అంబేద్కర్ గారికి మా నమస్కారం. తరువాత నాకొక మంత్రిగా అవకాశం ఇచ్చిన మా గాడ్ ఫాదర్ శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికి నా నమస్కారం. ఇక్కడ మాట్లాడేందుకు అవకాశం ఇచ్చిన మీకు నా ధన్యవాదాలు తెలియచేస్తున్నాను అధ్యక్షా.

నిన్న గౌరవ ముఖ్యమంత్రిగారు అంగన్‌వాడీ వర్కర్ల జీతాలు పెంచుతున్నట్లు ప్రకటన చేయడం జరిగింది. కౌన్సిల్‌లో కూడా నేను సమాచారమిస్తున్నాను. The recommendations of the Group of Ministers constituted in the year 2015 vide G.O.Ms.No.1469, dated 15-5-2015 to finalize the proposal pertaining to the enhancement of the honorarium to the Anganwadi Workers and Helpers is agreed as per the statement. The honorarium of the Anganwadi Workers is enhanced from the existing Rs.4,200/- to Rs.7,000/-. The honorarium to the mini Anganwadi Workers is enhanced from the existing Rs.2,950/- to Rs. 4,500/-. The honorarium to the Anganwadi Helpers is enhanced from the existing Rs. 2,200 to Rs.4,500/-. The enhanced honorarium will come into force w.e.f. 1-04-2016. ప్రభుత్వం ఎన్ని ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ప్రజల సౌకర్యం కొరకు, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడానికి ముఖ్యమంత్రి శ్రీ ఎన్. చంద్రబాబు నాయుడు గారు చిత్తశుద్ధితో కృషి చేస్తున్న విషయాన్ని గమనించి గౌరవ సభ్యులు ప్రభుత్వానికి సహకరించవలసిందిగా కోరుతున్నాను.

CHAIRPERSON: Now, the House is adjourned to meet again tomorrow, Monday, the 21st December, 2015 at 10.00 a.m.

(Then, the House adjourned at 3-08 p.m.)

* * *